VISALAANDHRA VIJAYAWADA PHONE: No. 376

700658

విశాలాంధ్ర

6 పేజీలు 6 నయాపైసలు రిజిష్టర్డు నెం. A-193

సంపుటి 9] విజయవాడ • 2 సెప్టెంబరు 1960 * శుక్రవారం [సంచిక 157

ఎలిజబెత్ రాణికి ఆంధ్ర ప్రభుత్వ ఆహ్వానం

హైదరాబాద్, సెప్టెంబరు 1

ఎలిజబెత్ రాణి వచ్చే జనవరిలో భారతదేశం పర్యటించే సందర్భంలో ఆంధ్రప్రదేశ్‌ను రావలసిందిగా రాష్ట్ర ప్రభుత్వం ఆహ్వానించింది. ఈ విషయమై ఆంధ్ర ప్రభుత్వం కేంద్రానికి వ్రాస్తున్నది. (పి. ఐ.)

రాష్ట్రపతితో [illegible] తుది చర్చలకు 35 మందిగల రాయబారవర్గం

హైదరాబాద్, సెప్టెంబరు 1

[illegible] 35 మందిగల [illegible] ముఖ్యమంత్రి, ఆర్థికమంత్రి, వివిధ శాఖల అధికారులూ వుంటారు.

కమ్యూనిస్టుల కార్యకలాపాలపై ప్రధానమంత్రి ఆరోపణలు

'రుజువన్నా చేయాలి లేదా ఉపసంహరించుకోవాలి' అని లోక్‌సభలో హిరేన్ డిమాండ్

దేశభక్తి, విజ్ఞత ఏ ఒక్కరి సొమ్మూ కాదని ఉద్ఘాటన

[విశాలాంధ్ర విలేకరి]

న్యూఢిల్లీ, ఆగస్టు 31

నేడు లోక్‌సభలో విదేశాంగ వ్యవహారాలపై జరిగిన చర్చ సందర్భంలో కమ్యూనిస్టుపక్ష ఉపనాయకుడు ప్రొఫెసర్ హిరేన్ ముఖర్జీ మాట్లాడుతూ సరిహద్దు ప్రాంతాల్లో కమ్యూనిస్టులు దేశానికి వ్యతిరేకంగా ఏవో కార్యకలాపాలను సాగిస్తున్నారంటూ ప్రధాని నెహ్రూ చేసిన ఆరోపణలను తీవ్రంగా నిరసించారు.

తన ఆరోపణలకు గురించి ఉదాహరణలతో సహా శ్రీ నెహ్రూ సభవారికి వివరించి చెప్పనన్నా చెప్పాలి, లేదా వాటిని ఉపసంహరించుకోనన్నా ఉపసంహరించుకోవాలని హిరేన్ ముఖర్జీ డిమాండ్ చేశారు.

రాజ్యసభలో ఇటీవల ప్రధాని నెహ్రూ కమ్యూనిస్టులపై విరుచుకుపడిన విషయం శ్రీ హిరేన్ ప్రస్తావిస్తూ ఇలా అన్నారు:

"ఈ విధంగా ప్రత్యర్థులపై దాడిచేయడం వల్ల దెబ్బతింటున్నది తన ప్రతిష్ఠేనని ప్రధానమంత్రి గుర్తించడం మంచిది. ఇలాంటి విషయాలలో ప్రజలే తీర్పు చెప్పగలరు. కాబట్టి వాటిని ప్రజలకు వదలివేయండి.

ప్రధాన మంత్రి తటస్థవిధానాన్ని హృదయపూర్వకంగా బలపరచే వారిలో కమ్యూనిస్టులు అగ్రశ్రేణిలో ఉన్నారు. అటువంటి కమ్యూనిస్టులపై ప్రధాని నెహ్రూ ఏవిధమైన ఆధారం లేకుండా నిందలు వేస్తున్నారు. సరిహద్దు ప్రాంతాలలో మేము జాతీయవ్యతిరేక కార్యకలాపాలు సాగిస్తున్నట్లు ఆరోపణలు చేస్తున్నారు. ఇవి మీరు రుజువు చేయగలరా అని సవాలు చేస్తున్నాను.

ప్రధాన మంత్రి ఇలాంటి ప్రచారం చేస్తున్న వారి శక్తివ్యక్తులను, న్యూఏజ్ (కమ్యూనిస్టు పత్రిక) బహిరంగంగానే ఈ ప్రచారం చేస్తుంది.

హిరేన్ ముఖర్జీ ఈ ఆరోపణలు రుజువు చేయగలరా అని సవాలు మళ్లీ చేస్తున్నాను. నిరూపించుకోని ఇలాంటి ఆరోపణలను దిగమింగడానికి మేము సిద్ధంగా లేమని తెలుసుకోండి."

ఇలాంటి ఆరోపణలు చేయడం పరిపాటి అయిపోయింది. కాంగ్రెసు అధ్యక్షుడు కూడా ఇలాంటి ఆరోపణలు చేయగా పశ్చిమ బెంగాలు ముఖ్యమంత్రి ఇది నిజం కాదన్న విషయం సభ దృష్టికి తీసుకొని వస్తున్నాను. ఉత్తరప్రదేశ్ శాసనసభలో జరిగిన చర్చలు కూడా ఈ ఆరోపణ నిరాధారమని నిరూపించాయి.

దేశభక్తి గాని, విజ్ఞత గాని మా సొత్తు సొమ్మని మేము భావించడం లేదు. అలా చెప్పడమూ లేదు. కాని, ప్రధాన మంత్రి మమ్మల్ని నిందించడానికి పూనుకొంటే అది ఆయన ప్రతిష్ఠనూ, రాజకీయ చర్చల స్థాయినీ దిగజార్చుతుందని మా కేమీ బాధాకరం కాదని ఆయన గ్రహించాలి.

ప్రధాన మంత్రి తటస్థ విదేశాంగవిధానాన్ని మేము బలపరుస్తున్నమాట వాస్తవం. అయితే ఆయనకు కమ్యూనిస్టులంటే ఒకవిధమైన ద్వేషము. కాబట్టి అప్పుడప్పుడు వారిపై లేనిపోని ఆరోపణలు చేస్తుంటారు.

శ్రీ హిరేన్ ముఖర్జీ తన ప్రసంగాన్ని ముగిస్తూ ప్రధానమంత్రి అనుకొంటున్నట్లు కమ్యూనిజం కరడుగట్టిన సిద్ధాంతం కాదనీ, శాంతియుత సహజీవన విధానం ఎలా అమలుజరపాలనే సమస్యపై అంతర్జాతీయ స్థాయిలో చర్చలు జరుగుతున్నవనీ ఇలాంటి చర్చలు జరగడం మంచిదనీ అన్నారు.

ఆఫ్రికా ఖండంలోని నేటి పరిస్థితిని గురించి ప్రస్తావించి ఆయన యిలా అన్నారు:

"ఆఫ్రికా ఖండంలో స్వాతంత్ర్యోద్యమం మొగ్గలు పూవులూ, అనుకూలంగా పరిఢవిల్లుతోంది. ఈ దశలో ప్రధాని నెహ్రూ ఆయన గతంలో వలస విధానంపట్ల వహించిన వైఖరినే ఇప్పుడు కొనసాగించాలి తటపటాయించకూడదు. భారత చైనాల మధ్య సరిహద్దు సమస్య శాంతియుతంగా పరిష్కరింపబడుతుందనే ఆశిస్తున్నాను. కాంగో విషయంలో భారతదేశం తగినంత ప్రధాన పాత్రను నిర్వహించడంలేదు"

కాంగోలో పోయిన శక్తులకు [illegible] దుగా వెళ్లిన మన రాజేశ్వర్ దయాళ్ కృషి ఫలించాలని కోరుతున్నాను. అయితే ఐరాసను సహితం సామ్రాజ్యవాదానుకూల శక్తులకు వినియోగించుకునేందుకు ప్రయత్నాలు జరుగుతున్న విషయాన్ని ఆయన గుర్తించాలి. మన దేశంలోని కొన్ని పత్రికలు సామ్రాజ్యవాదులకు అనుకూలపడే కాంగో వ్యతిరేక వ్రాతలు వ్రాస్తున్నాయి. కాంగోలో ఐరాస కర్తవ్యం అక్కడ శాంతిని నెలకొల్పడమూ, కాంగో ప్రజలు తమ కాళ్ళమీద నిలబడగలిగేటట్లు వారికి సహాయపడడమున్నూ. ఐరాస కార్యదర్శి హామర్షెల్డ్‌ను ప్రధాని నెహ్రూ మెచ్చుకొంటూ మాట్లాడారు. కాని కాటంగా తిరుగుబాటుదార్లను అణచివేయడంలో హామర్షెల్డ్ కాంగో ప్రభుత్వానికి సాయపడలేదు. వెనుకడుగువేశారు. పైగా కాంగోలోని స్థానికఘర్షణల్లో కాంగో వ్యతిరేకపక్షాలవైపు కొమ్ము కాసినట్లుకూడా తెలుస్తోంది. కాంగోలో ఐరాస పాలనను నెలకొల్పాలన్న ఉద్దేశం ప్రమాదభరితమైనది. కాంగో ప్రజల వ్యవహారాలు కాంగో వారే చక్కబెట్టుకోవాలి. భారత ప్రభుత్వం వెంటనే కాంగో ప్రభుత్వాన్ని ఆఫ్రికా స్వతంత్ర దేశాలను గుర్తించాలి.

పుదుచ్చేరి సమస్యను గురించి శ్రీ హిరేన్ ముఖర్జీ ప్రస్తావిస్తూ ఇలా అన్నారు:

"మన సుప్రీం కోర్టు అధికారాలు ఆ ప్రాంతానికికూడా వర్తింపచేయాలి. పుదుచ్చేరికి పార్లమెంటులో ప్రాతినిధ్యం వుండాలి.

బర్మాలోని భారతీయులకు భారత ప్రభుత్వం ఏ విధంగానూ సహాయపడటం లేదు. ఆ విషయమై ప్రభుత్వం ఆలోచిస్తుందని ఆశిస్తున్నాను.

సింహళంలో నూతన ప్రభుత్వం ఏర్పడడంతో అక్కడి భారతీయుల సమస్య త్వరలో పరిష్కారం కాగలదనుకొంటున్నాను.

చైనాతో భారతదేశానికి గల సరిహద్దు వివాదాల పరిష్కారం కాగలదనే నా విశ్వాసం. కాని సరిహద్దు సంఘటనలేవి జరిగినా అవి ఆందోళనకరమయినవే. ఉభయ దేశాలమధ్య వైషమ్యాలను మరింత పెంచేమాటలకూ చేతలకూ ఎవరు పూనుకోరాదు. ఇప్పుడు ఉభయదేశాలమధ్య సంబంధాలెంత బెడిసివున్నప్పటికీ ఈ రెండూ పరిణతిచెందిన మహాదేశాలనే విషయం మరువరాదు.

పాకిస్తాన్‌తో నిర్యుద్ధసంధి

పాకిస్తాన్‌తో నిర్యుద్ధసంధిని పున

(తరువాయి 6 వ పేజి)

పాలసరఫరా పథక నిర్వహణాధికారి

హైదరాబాద్, ఆగస్టు 31

విజయవాడ హైదరాబాదు పాల సరఫరా పథకాన్ని అమలు జరపడానికై ప్రభుత్వం ఒక ప్రత్యేకాధికారిని నియమించింది.

ఈ పథకం కేంద్రప్రభుత్వం ఐరాస ఆర్థిక సహాయనిధి సహాయంతో అమలు జరుపుతున్నది.

కమ్యూనిస్టులపై మళ్లీ నెహ్రూ అభాండాలు

న్యూఢిల్లీ, సెప్టెంబరు 1

కమ్యూనిస్టుపార్టీ, భారత చైనా సరిహద్దు సమస్యపై జాతీయ వ్యతిరేక మయిన, దేశభక్తి విరుద్ధమైన వైఖరి అవలంబించినదని ప్రధాని నెహ్రూ నేడు లోక్‌సభలో మళ్ళీ కమ్యూనిస్టుపార్టీపైనా, పార్టీ ఇంగ్లీషు వార పత్రిక న్యూఏజ్ పైనా అభాండాలు వేశారు.

ప్రధాని విదేశాంగ వ్యవహారాలపై చర్చకు సమాధానం చెప్తూ కమ్యూనిస్టు పార్టీని నిందించారు దీనిపై కమ్యూనిస్టు పక్ష ఉపనాయకుడు శ్రీ హిరేన్ ముఖర్జీకి ప్రధానికీ తీవ్రమైన వాగ్వాదం జరిగింది.

శ్రీ నెహ్రూ ఇంకా ఇలా అన్నారు.

భారతదేశంలోని మాజీ ఫ్రెంచి స్థావరాల కోర్టులపై ఫ్రెంచికోర్టులకున్న అధికారాలను రద్దుచేయాలని భారతప్రభుత్వం నిర్ణయించింది.

ప్రధానమంత్రి భారత - పాకిస్తాన్ నీటి పంపిణీ ఒడంబడిక వివరాలిని ఈ సంధి 1960 ఏప్రిల్‌నుండి అమల్లోకి వస్తుంది. భారత-పాకిస్తాన్ దేశాల ప్రతినిధులున్న సింధు జలాల కమిషన్‌ను నియమిస్తాము. నీటిపంపిణీఒడంబడికను అమలు జరిపే విషయమై ఉభయ దేశాలమధ్య ఉత్తర ప్రత్యుత్తరాలు ఈ కమిషన్ద్వారానే నడుస్తాయి. సాంకేతిక సంబంధమయిన విషయాలలో ఉభయ దేశాలకు అభిప్రాయ భేదాలు వస్తే తటస్థుడైన ఒక నిపుణుని అభిప్రాయానికి పంపి వాటిని పరిష్కరించేందుకు ఒడంబడికలో ఏర్పాటు చేస్తాము. ఒడంబడికను వ్యాఖ్యానించడంలో ఉభయుల మధ్య వచ్చే ప్రధానమైన వివాదంపై తీర్పు చెప్పడానికి ఒక కోర్టును కూడా ఏర్పాటు చేస్తాము.

ఈ ఒడంబడిక పది సంవత్సరాలపాటు అమల్లో ఉంటుంది. ఈ కాలంలో భారతదేశం పాకిస్తాన్‌కు నీటిని సరఫరా చేస్తుంది. అయితే అలా సరఫరా చేసే నీటి పరిమాణం ఏటేటా తగ్గుతూ వుంటుంది. పాకిస్తాన్ కోరితే ఈ ఒడంబడికకాలం మరో 3 సంవత్సరాలు పొడిగించవచ్చు. అయితే అలా పొడిగించమని అడిగిన పక్షాన భారతదేశం తాను సరఫరా చేసే నీటిని తగ్గించవచ్చు. ఒడంబడిక పొడిగించే కాలం ఒక సంవత్సరమయితే అయిదుశాతం, రెండేళ్లయితే పదిశాతం, మూడేళ్లయితే 15 శాతం నీటిని తగ్గించడానికి వీలున్నది"

అఖిలభారత కమ్యూనిస్టుపార్టీ ఇంగ్లీషు వారపత్రిక "న్యూఏజ్" సరిహద్దు సమస్యపై ఎడతెరపిలేకుండా నీచమైన అబద్ధ ప్రచారం సాగిస్తున్నదని శ్రీ నెహ్రూ మళ్ళీ ఆరోపించారు "ఈ ప్రచారం మనల్ని అప్రతిష్టపాలు చేసేందుకే ఉద్దేశింపబడినది. ఇది భారతీయుల ఆలోచనా విధానానికే విరుద్ధమయినది" అన్నారు శ్రీ నెహ్రూ.

చైనా-భారత సరిహద్దు సమస్యపై కమ్యూనిస్టు పార్టీ కార్యకలాపాలు జాతీయ వ్యతిరేకమూ, దేశభక్తి విరుద్ధమూ' అని ప్రధాని అనగా కాంగ్రెసు సభ్యులు "సిగ్గు, సిగ్గు" అని కేకలు వేశారు.

భారతదేశ సమగ్రతకంటే సమస్యలపై తాము తగ్గివచ్చే పార్టీతోగానీ, ఏ వ్యక్తితోగాని రాజీ చేసుకోవడమనేది లేదని అన్నారు.

అస్సాం అల్లర్లపై న్యాయవిచారణ

ప్రతిపక్షాలన్నీ కలిసి లోక్‌సభలో ప్రతిపాదించనున్న సవరణ

న్యూఢిల్లీ, ఆగస్టు 31

అస్సాం అల్లర్లపై న్యాయవిచారణ జరపాలని కోరుతూ లోక్‌సభలోని కమ్యూనిస్టుపక్షం, ఇతర ప్రతిపక్షాలూ అస్సాంపై ప్రభుత్వతీర్మానానికి ఒక సవరణ ప్రతిపాదించనున్నాయి. ప్రతిపక్షాలన్నీ కలిసి ఉమ్మడిగా ఒక సవరణ ప్రతిపాదించడం యిదే మొదటిసారి.

మరో విశేషమేమంటే ఈ తీర్మానాన్ని బెంగాల్ కాంగ్రెసు సభ్యులు కూడా బలపరుస్తున్నారు. వారుకూడా యిలాంటి సవరణలనే ప్రతిపాదిస్తున్నారు.

ఈ సవరణలను ప్రభుత్వం తీవ్రంగా వ్యతిరేకిస్తుంది. అస్సాం అల్లరులపై చర్చ జరుగనున్న సందర్భంలో ఈ సమస్యపై కాంగ్రెసు పార్లమెంటరీ పక్షంలో తీవ్రమైన అభిప్రాయభేదాలేర్పడ్డాయి.

వైమానిక సంస్థ ఉద్యోగుల సమ్మె

చట్టవిరుద్ధమని సుబ్బరాయన్

న్యూఢిల్లీ, సెప్టెంబరు 1

భారత వైమానిక సంస్థకు చెందిన బొంబాయి ప్రాంతీయ కమిటీ రేపటి నుండి చేయనున్న సమ్మె "చట్టవిరుద్ధమూ, బాధ్యతా రహితమూ, అన్యాయమూ" అని రవాణా శాఖ మంత్రి డా. సుబ్బరాయన్ నేడు లోక్‌సభలో వివరించారు. సమ్మెపై డా॥ సుబ్బరాయన్ నేడొక ప్రకటన చేశారు. అందులో ఇలావుంది:

"ఉద్యోగుల కోర్కెలను మధ్యవర్తి తీర్పుకు పంపించాము. మధ్యవర్తివిచారణ పూర్తిఅయింది. ఆయనతీర్పు త్వరలోనే ప్రకటించబడనున్నది. పైగా వారు కొన్నక్రొత్త ఉద్యోగులకు కలుగజేయవలసిన సౌకర్యాల విషయంలో ఇతర వివాదాలేమీలేవు. దానిపైకూడ మేనేజిమెంటుకూ, ఉద్యోగులకూ అంగీకారం కుదరవచ్చు ఈసమస్యను కూడా మధ్యవర్తి కమిటీకి పంపించాలని అన్నారు. ఈ పరిస్థితుల్లో ఆగస్టు 29 న యూనియన్ సమ్మె నోటీసు ఇచ్చింది. ఈ సమ్మె రేపటి నుండి జరుగనున్నది. సమ్మె జరిగితే, భారత వైమానిక సంస్థ విమానాల రాకపోకలకు తీవ్రమైన ఆటంకం ఏర్పడి ప్రయాణీకులకుచాలా ఇబ్బంది కలుగుతుంది వైమానికసంస్థకు చాలానష్టం కలుగుతుంది

శ్రీ గోలి శంకరయ్య నిరాహారదీక్ష

విజయవాడలో ప్రారంభం

విజయవాడ, సెప్టెంబరు 1

శ్రీ గోలి శంకరయ్యగారు నిన్న సాయంత్రంనుండి స్థానిక మునిసిపల్ ఆడిటోరియంలో నిరాహార దీక్షను ప్రారంభించారు.

దేశమంతా ఆహార ధాన్యాలను చౌకగా అమ్మించడం, అందులో భాగంగానే ఆంధ్రప్రదేశ్‌లో 3500 చౌకడిపోలు ఏర్పర్చడం, నెల్లూరు ఆహారాందోళన సందర్భంలో మరణించిన, గాయపడినవారికి నష్టపరిహారమివ్వడం, వారిపైగల కేసులను ఉపసంహరించాలనేది ఆయనకోర్కెలు.

ఒకవైపునవర్షం కురుస్తున్నా లెక్కచేయకుండానే ఆయన తన దీక్షను కొనసాగిస్తున్నారు. నిరశన దీక్ష ప్రారంభించబోయేముందు ఆయన ఒక ప్రకటన చేస్తూ పైకోర్కెలు నెరవేరేంతవరకు తన దీక్షను కొనసాగిస్తానన్నారు. సత్యధర్మాల రక్షణకోసం తాను ప్రాణాలను త్యజించడానికైనా సిద్ధంగా వున్నానన్నారు.

ఈ సందర్భంలో ప్రజలంతా శాంతియుతంగా ఉండాలనీ, యీ ఉద్యమానికి అందరూ సహకరించాలనీ కోరారు.

హిందీలో శాస్త్రీయ, సాంకేతిక పదాలు

రూపొందించడానికి త్వరలోనే హిందీ కమిషన్ నియామకం సంభవం

న్యూఢిల్లీ, సెప్టెంబరు 1

హిందీలో శాస్త్రీయ, సాంకేతిక పదాలను రూపొందించేందుకు త్వరలోనే ప్రభుత్వం ఒక హిందీ కమిషన్‌ను నియమించగలదని నేడు లోక్‌సభలో విద్యామంత్రి డాక్టర్ శ్రీమాలీ తెలియజేశారు.

శ్రీ నర్దేవ్ స్నాతక్ అడిగినప్రశ్నకు విద్యామంత్రి సమాధానం చెప్తూ అధికారభాషా సమస్యపై రాష్ట్రపతి జారీ చేసిన ఆదేశపత్రం దృష్ట్యా శాస్త్రీయ, సాంకేతిక పదజాలాన్ని రూపొందించేందుకు ఇప్పటివరకూ జరిగిన కృషిని ఆ కమిషన్ సమీక్ష చేయగలదని తెలియజేశారు హిందీ, తదితర భారతీయ భాషలలో శాస్త్రీయ, సాంకేతిక పదజాలాన్ని రూపొందించేందుకు అనుసరించవలసిన సూత్రాలను కూడా ఈ కమిషన్ నిర్ణయించగలదన్నారు.

క్రొత్తగా రూపొందించబడే సాంకేతిక పదజాలాన్ని ఉపయోగించి, ప్రామాణిక పాఠ్యగ్రంథాలను, నిఘంటువులనూ తయారు చేయించే కార్యక్రమాన్నికూడా ఈ కమిషన్ తీసుకోవచ్చుననికూడా ఆయన చెప్పారు.

సభ్యులు అడిగిన కొన్ని ఉపప్రశ్నలకు ఆయన జవాబు చెప్తూ భారతీయ భాషలన్నింటికీ అంగీకారయోగ్యంగా వుండే సాంకేతిక పదజాలాన్ని రూపొందించడానికి ప్రయత్నం జరుగుతుందన్నారు.

ఇలాంటి పనిని పూర్తిచేయడానికి సహజంగా కొంతహెచ్చుకాలం అవసరమైనప్పటికీ సాధ్యమైనంత త్వరలోనే పూర్తిచేయడానికి ప్రభుత్వం శ్రద్ధతీసుకొంటుందని డాక్టర్ శ్రీమాలీ చెప్పారు.

ఒరిస్సాలో వరదల తగ్గుముఖం

లోక్‌సభలో మంత్రి వెల్లడి

న్యూఢిల్లీ, ఆగస్టు 31

ఒరిస్సాలో వరదలు తగ్గుముఖం పట్టాయని, మళ్ళీ కొత్తవర్షాలు కురవకపోతే ఒక వారంరోజుల్లోగా వరదనీరు పూర్తిగా తగ్గిపోతుందని కేంద్ర నీటి పారుదలశాఖ మంత్రి హాఫిజ్ మహమ్మద్ ఇబ్రహీం ఈ రోజు లోక్‌సభలో తెలియజేశారు.

ఇబ్రహీం ఈ వారం మొదట్లో ఒరిస్సాలో వరద ప్రాంతాలన్నీ పర్యటించి వచ్చారు. ఆయన ఇలా అన్నారు.

వరదల వలన ఎంత నష్టం సంభవించిందో ప్రభుత్వాధికారులు ఇంతవరకు అంచనాలు వేయలేదు. అయితే పెద్ద నష్టమే సంభవించిందనడంలో ఎవరికీ అనుమానంలేదు. ప్రస్తుత సమాచారాన్నిబట్టి 3400 చదరపు మైళ్ళ ప్రాంతం మునిగిపోయిందని ఇరవై ఎనిమిదిమంది ప్రాణాలు కోల్పోయారని, కొన్ని గ్రామాలు కొట్టుకపోయాయని, ఇండ్లు నాశనమయ్యాయని తెలుస్తోంది.

రాష్ట్ర ప్రభుత్వం సహాయ కార్యక్రమాలు కొనసాగిస్తున్నది: తక్కావీ ఋణాల పంపిణి సాగుతున్నది. గుడిసెల నిర్మాణానికి వరద బాధితులకు పదివేల వెదుళ్ళు ఇప్పటికి సహాయం చేయబడ్డాయి.

ఆగస్టు 27, 28 వ తేదీల్లో నేను వరద ప్రాంతాల్లో పర్యటించాను బ్రాహ్మణి, వైతరణి, సాలంది నదీ డెల్టా ప్రాంతాల్లో ఎక్కువ నష్టం జరిగింది. ఈ నదుల్లో వచ్చిన వరదలతోపాటు మహానది, బుఢబలంగ నదుల్లో వరదలు వచ్చినందున పరిస్థితి మరీ ప్రమాదకరంగా తయారైంది.

సంపూర్ణంగా వరదలను నివారించడానికి తీసుకొనే చర్యలతోబాటు ప్రస్తుతం తాత్కాలిక చర్యలుకూడ కొన్ని తీసుకోవాలి. ఈ తాత్కాలిక చర్యలన్ని ఆరాష్ట్రప్రభుత్వం ప్రస్తుతం నిర్వహిస్తుంది.

పోలీసుల సాయంతో విజయవాడ పందుల తరలింపు

మున్సిపల్ ప్రత్యేకాధికారి గట్టి చర్య

విజయవాడ, సెప్టెంబరు 1

విజయవాడ వీధులలో తిరిగే దాదాపు నూరు పందులను మునిసిపాలిటీ ప్రత్యేకాధికారి, తన సిబ్బంది, పోలీసుల సహాయంతో పట్టుకొని [illegible] పంపించారు.

పందులకు లైసెన్సు తీసుకోవాల్సిన గడువు నిన్నటితో పూర్తి అయింది కాని ఎక్కువమంది పందుల యజమానులు లైసెన్సు తీసుకోలేదు.

ఈరోజు ఉదయం మున్సిపాలిటీ అధికారులు వీధులలో తిరిగే పందులను పట్టించే కార్యక్రమం తీసుకోవటంతో, తమంతట తామే పందులను వీధులలో తిరగకుండా చేస్తామని హామీ యిచ్చి గురువారం 2 వ తేదీ ఉదయం 7 గంటల వరకు గడువు యిచ్చారు.

పట్టణంలోని పందులను యజమానులు ఎక్కడికో తోలుకెళ్తున్నారు.

ఒలింపిక్ పోటీలు:

కుస్తీ పోటీల్లో రష్యా, టర్కీలకు బంగారుపతకాలు

రోమ్, ఆగస్టు 31

రోమ్‌లో జరుగుతున్న ఒలింపిక్ గ్రీకో-రోమన్ తరహా కుస్తీ పోటీల్లో రష్యా, టర్కీ దేశాలకు చెరి మూడు బంగారు పతకాలూ, రుమేనియాకూ, బల్గేరియాకూ ఒక్కొక్క బంగారు పతకమూ లభించాయి.

బాంటమ్ వెయిట్ తరగతి కుస్తీలో ఓలెగ్ కారయేవ్‌కూ, లైట్ వెయిట్ తరగతిలో అవతాండిల్ కోరిడ్జ్‌కూ, హెవీ వెయిట్ తరగతిలో ఇవాన్ బోగ్డాన్‌కు బంగారు పతకాలు లభించాయి. ఈ ముగ్గురు వస్తాదులు సోవియట్ యూనియన్‌కు చెందినవారు.

వెల్టర్ వెయిట్ తరగతి కుస్తీలో ముతాఫ్ బేరాక్‌కూ, ఫెదర్ వెయిట్‌లో ముజహిర్ సిల్లేకూ, లైట్ వెయిట్‌లో టిస్కిన్‌కూ బంగారు పతకాలు లభించాయి. వీరు ముగ్గురూ టర్కీ వారు.

రుమేనియా దేశస్థుడు డిమిటర్ పిర్వులెస్కుకూ ఫ్లైవెయిట్ తరగతిలో బంగారు పతకం లభించింది

బల్గేరియాదేశస్థుడు డిమిట్రో డోబ్రెవ్‌కు మిడిల్ వెయిట్ తరగతి కుస్తీలో బంగారుపతకం లభించింది

ఫ్లైవెయిట్ తరగతిలో సంయుక్త అరబ్బు రిపబ్లిక్కుకు చెందిన ఉస్మాన్ సయ్యద్‌కు రజితపతకమూ, ఇరాన్ వస్తాద్ మహమ్మద్ పజిరేకు కంచు పతకమూ లభించాయి.

హంగరీకి మరోరెండు బంగారు పతకాలు

ఆధునిక పెంటాథ్లన్ (ఈదుట, షాట్‌పుట్, జావెలిన్, దుముకుట గుర్రపు పోటీ) పోటీల్లో హంగరీకి రెండు బంగారు పతకాలు లభించాయి

జట్టుకు ఒక బంగారు పతకమూ, హంగరీ దేశస్థుడు ఫెరెన్స్ నెమెత్‌కూ ఒక బంగారు పతకమూ లభించాయి.

ఆస్ట్రేలియాకు మరోరెండు బంగారు పతకాలు

పురుషుల పదిహేనువందల మీటర్ల ఫ్రీస్టయిల్ తరహా యీత పోటీలో ఆస్ట్రేలియా దేశస్థుడు ముర్రేరోజ్‌కు బంగారు పతకం లభించింది

జపాను దేశస్థుడు ట్సురోయామనకకు రజితపతకమూ, ఆస్ట్రేలియా దేశస్థుడు జాన్ కాంరాడ్స్‌కు కంచుపతకమూ లభించాయి

పురుషుల వందమీటర్ల బేక్‌స్ట్రోక్ తరహా యీతపోటీలో, ఆస్ట్రేలియా దేశస్థుడు డేవిడ్ థియెలీకి బంగారు పతకం లభించింది

హాకీలో భారత, పాకిస్తాన్‌లకు సమానమైన పాయింట్లు

రోమ్, ఆగస్టు 21

రోమ్‌లో జరుగుతున్న ఒలింపిక్ హాకీ పోటీల్లో భారత, పాకిస్తాన్ దేశాలకిప్పటికి సమానంగా పాయింట్లు లభించాయి ఈ రెండుదేశాలూ ఆయా గ్రూపుల్లో ప్రధాన స్థానం ఆక్రమించాయి. వివిధదేశాలకు హాకీలో యీవిధంగా పాయింట్లు వచ్చాయి

ఎ గ్రూపు భారతదేశం 4, న్యూజీలాండు 2, హాలెండు 1 పాయింట్లు వచ్చాయి డెన్మార్కుకు ఒక్క పాయింటూ రాలేదు. బి గ్రూపు పాకిస్తాన్ 4, ఆస్ట్రేలియా 2, పోలెండు 2, జపాన్ 0 సి గ్రూపు కెన్యా 2, జర్మనీ 2, ఫ్రాన్సు 2, ఇటలీ 0.

భారత క్రీడాకారుల ఓటమి

వంద మీటర్ల పరుగుపందెం ఎన్నికలలో జరిగిన పందాల్లో భారతీయుడు టి. ఆర్. కోషీ ఎన్నిక కాలేదు. అతను ఏడవవానిగా వచ్చాడు. థాయిలాండుకు చెందిన సూ న్యాకాన్, ఇండొనేషియాకు చెందిన గోపాల్ ఆఖరివారుగా వచ్చారు వీరు ఎన్నిక కాలేదు ఆ విధంగా ఈ పందెంలో తర్వాతిరౌండుల్లో పాల్గొనడానికి ఏ ఒక్క ఆసియా క్రీడాకారుడూ అర్హుడు కాలేదు.

5 వేల మీటర్ల పరుగులో మరో భారతీయుడు, ఆర్. భాటియా పదకొండవ వానిగావచ్చి, తరువాత రౌండ్సులో పాల్గొనడానికి అర్హత కోల్పోయాడు

అమెరికాకు బంగారు పతకం

షాట్‌పుట్‌లో అమెరికా దేశస్థుడు బిల్ నీడర్‌కు బంగారు పతకం లభించింది అతడు కొత్త రికార్డును స్థాపించాడు. రజిత, కంచు పతకాలు కూడా అమెరికావారైన, పారీ ఓబ్రియన్, డల్లాస్ లాంగ్‌లకు లభించాయి

లాంగ్‌జంప్‌లో రష్యా వనితకు బంగారుపతకం

రోమ్, ఆగస్టు 31

మహిళల లాంగ్ జంప్ పోటీలో, రష్యావనిత వెరాక్రెప్కినా బంగారు పతకం గెల్చుకొంది.

పోలిష్ వనిత క్రజెస్కిన్స్కా రజిత పతకాన్నీ, జర్మన్ వనిత హిల్డ్రమ్ క్లాస్ కంచుపతకాన్నీ గెల్చుకొన్నారు

పరుగు పోటీల్లో ప్రముఖుల ఓటమి

రోమ్, ఆగస్టు 3

ఒలింపిక్ ఫైనల్ రౌండుకు ఎన్నిక చేయడానికి నేడు [illegible] క్రీడల్లో, ట్రాక్ పోటీలు (పరుగు షాట్ పుట్ వగైరా) ప్రారంభమైనాయి.

ఆ పోటీల్లో ప్రముఖ క్రీడాకారులు ఓడిపోవటం ఒక విశేషం

వంద మీటర్ల పరుగులో, 2 వందల మీటర్లలో యూరపు ఛాంపియన్ అయిన మేన్‌ఫ్రెడ్ జర్మర్ ఆఖరివాడుగా వచ్చాడు. మొదటి ముగ్గురే ఫైనల్సుకు ఎన్నికవుతారు

షాట్ పుట్‌లో, యూరపు ఛాంపియన్ ఆర్థర్ రో (బ్రిటను) ఓడిపోయాడు

8 వందల మీటర్ల పరుగులో బ్రిటనుకు చెందిన బ్రియాన్ హ్యూసన్ ఓడిపోయాడు అతడు 15 వందల మీటర్లలో యూరపు ఛాంపియను. ఈ పోటీలో ప్రపంచ రికార్డు హోల్డరు ఇస్త్వాన్ రోజావోల్గి (హంగరీ) కూడ ఓడిపోయాడు.

ఒలింపిక్ పోటీలలో వివిధ దేశాలకు లభించిన పతకాలు

రోమ్, ఆగస్టు 31

	బం	ర	కం
రష్యా	9	3	3
ఇటలీ	5	2	1
అమెరికా	4	7	4
ఆస్ట్రేలియా	4	0	2
జర్మనీ	3	10	2
హంగరీ	3	5	2
టర్కీ	3	1	0
రుమేనియా	1	1	2
స్వీడన్	1	0	2
బ్రిటను	1	0	2
డెన్మార్కు	1	0	1
బల్గేరియా	1	0	1
జపాను	0	2	0
పోలెండు	0	1	2
బెల్జియం	0	1	1
హాలెండు	0	1	1
అరబ్బు రిపబ్లిక్	0	1	0
యుగోస్లావియా	0	1	0
బ్రెజిల్	0	0	1
మెక్సికో	0	0	1
జెకోస్లోవేకియా	0	0	1
ఇరాన్	0	0	1
ఫ్రాన్సు	0	0	1

(సూచిక బం - బంగారం, ర - రజితము, కం - కంచు)

శార్వరినామ సంవత్సర
భాద్రపద శుద్ధ ద్వాదశి రా1-36
ఉ షా రా 10-45

విశాలాంధ్ర
శుక్రవారం 2-9-1960

వియత్నాం ఏకీకరణ

వియత్నాం ప్రజాతంత్ర రిపబ్లిక్ అవతరించి నేటికి 15 సంవత్సరాలైంది. ఈ సమయంలో వియత్నాం ప్రజలకు మా శుభాకాంక్షలు తెలియచేస్తున్నాం.

1946 సెప్టెంబరు 2 న వియత్నాం ప్రజాతంత్ర రిపబ్లిక్ అవతరించినప్పటికీ, 1954 వరకు, ఫ్రెంచి సామ్రాజ్యవాదులు నూతన రిపబ్లిక్‌పై దురాక్రమణ యుద్ధం సాగిస్తూనే వచ్చారు. దక్షిణ వియత్నాం ఈ సామ్రాజ్యవాదులకు స్థావరమైంది. డాక్టరు హోచిమిన్ నాయకత్వాన ఉత్తర వియత్నాం ప్రజలు వీరోచిత పోరాటాలు జరిపి ఫ్రెంచి సామ్రాజ్యవాదులను దక్షిణాదికి తరిమి వేయగలిగారు.

జూలై 1954 న జెనీవాలో జరిగిన ఒప్పందానుసరించి 17 వ అక్షాంశరేఖ, ఉత్తర దక్షిణ వియత్నాంలకు సరిహద్దుగా గుర్తించబడ్డది. ఉభయ ప్రాంతాల ఏకీకరణ శాంతియుతంగా జరిపేందుకై ఒక అంతర్జాతీయ కమిషన్ ఏర్పడ్డది పోలెండు, ఇండియా, కెనడా దేశాలు ఈకమిషన్‌లో సభ్యులు. కాని-ఆరేండ్లు గడిచినా ఉత్తర, దక్షిణ వియత్నాంలు నేటికీ వేరువేరుగానే ఉన్నాయి. ఏకీకరణలక్ష్యం నెరవేరలేదు.

ఈలోగా దక్షిణ వియత్నాంలో డీన్ డియం అనే ఒక కీలుబొమ్మ ప్రభుత్వాన్ని అమెరికా గద్దె నెక్కించింది. ఆ ప్రభుత్వానికి సహాయం చేసే పేరుతో ఒక 'సైనిక సలహా సమితి'ని దక్షిణ వియత్నాంలో ఏర్పరచింది.

'ఈ చర్య జెనీవా ఒప్పందాలకు పూర్తివ్యతిరేకం. ఆ ఒప్పందంలో అసలు అమెరికా భాగస్వామి కానే కాదు. ఐనా తనకు కాని వియత్నాం వ్యవహారాలలో జోక్యం కల్పించుకుని వియత్నాం విభజనను శాశ్వతం చేయాలని చూస్తున్నది.

అమెరికా చర్యను నిరసిస్తూ ఉత్తర వియత్నాం ప్రభుత్వం జెనీవా అంతర్జాతీయ కమిషన్‌కు అప్పీలు చేసింది. ఈ విషయంలోతమవైఖరిని బలపరచవలసిందిగా ఆసియా, ఆఫ్రికా ఖండాలలోని 21 స్వతంత్ర దేశాలకు ఉత్తర వియత్నాం ప్రధాని ఈ సంవత్సరం జూలై 16 న ఒక ప్రత్యేక విజ్ఞప్తి పంపారు.

అంతర్జాతీయ కమిషన్‌లో సభ్యుడైన భారత ప్రతినిధి, ఈ సమస్యపై ఉత్తర వియత్నాం నిరసనను త్రోసిపుచ్చి అమెరికా వాదనను సమర్థించాడు. ఇది ఆశ్చర్యకరం. భారత ప్రతినిధి ఇట్టి అప్రతిష్ఠాకర వైఖరి అవలంబించిన ఫలితంగా కమిషన్ సభ్యులలో పోలెండు ఒకటి మాత్రమే ఉత్తర వియత్నాం వాదనను సమర్థించగా, కెనడా ఇండియాలు వ్యతిరేకించాయి. భారతప్రతినిధి వైఖరి, దక్షిణ వియత్నాంలో అమెరికన్ సేనల ఆక్రమణను పరోక్షంగా సమర్థించటమే తప్ప మరొకటి కాదు.

వియత్నాం ఏకీకరణసమస్య కేవలం ఆ దేశ ప్రజలకు మాత్రం సంబంధించినది కాదు. ఆసియా ప్రజలందరికీ, శాంతి స్వాతంత్ర్యాలను వాంఛించే దేశాలన్నిటికీ ఇందులో ఆసక్తి ఉన్నది.

అమెరికన్ దురాక్రమణదారులు ఆసియాలో వీలైన ప్రతిచోట తమ సైనిక స్థావరాల నేర్పరచుకోవాలని యత్నిస్తున్నారు. దక్షిణ కొరియా, ఫార్మోజా, దక్షిణ వియత్నాం థాయ్‌లాండ్, ఇవన్నీ అమెరికా సైనిక స్థావరాలుగా ఉన్నాయి. ఆసియా స్వతంత్ర దేశాల ఆంతరంగిక వ్యవహారాలలో జోక్యం కల్పించుకునేందుకు, వాటిని తమ యుద్ధకూటములలోకి ఈడ్చేందుకూ ఈ సైనిక స్థావరాలను వారు వినియోగించుకుంటున్నారు.

ఒక స్వతంత్ర దేశంలో పరాయి దేశానికి సంబంధించిన సైనిక స్థావరం ఉండటం ఆ దేశ స్వాతంత్ర్యానికే కాక ప్రపంచశాంతికే ముప్పు భారత విదేశాంగ విధానానికి ఈ సూత్రమే ప్రాతిపదిక. అలాంటిది, వియత్నాం విషయంలో ఈ విధానానికి విరుద్ధంగా భారత ప్రతినిధి ఎందుకు ప్రవర్తించాడో బోధపడదు. ఇది శోచనీయం.

వియత్నాం ఏకీకరణకు భారత ప్రభుత్వం చొరవతో కృషిచేయవలసి ఉంది. అంతర్జాతీయ కమిషన్‌లో సభ్యత్వం ఉండటంవల్ల ఈ విషయమై భారత ప్రభుత్వం పైన ప్రత్యేక బాధ్యత కూడా ఉన్నది.

వియత్నాం ప్రజా రిపబ్లిక్ పురోగతి

సెప్టెంబరు 2, 1945 న వియత్నాం ప్రజాతంత్ర రిపబ్లిక్ అవతరించింది. నేటికి 15 సంవత్సరాలు గడిచాయి. డాక్టరు హోచిమన్ నాయకత్వాన అన్ని రంగాలలో పురోగమిస్తున్న వియత్నాం రిపబ్లిక్‌కు నేడు పర్వదినం.

వియత్నాం రిపబ్లిక్ అవతరణను సహించలేని ఫ్రెంచి సామ్రాజ్యవాదులు వియత్నాంపై దురాక్రమణ యుద్ధం 1946 డిసెంబరు 16 న ప్రారంభించారు నాటినుండి వియత్నాం స్వాతంత్ర్య రక్షణకు ప్రతిఘటనా పోరాటం సాగిస్తూనే వచ్చింది 1954 జూలైలోగాని ఫ్రెంచి దురాక్రమణ అంతంకాలేదు

పునర్నిర్మాణం

ఒక వైపున జాతీయ స్వాతంత్ర్యం కొరకు పోరాడుతూనే 1946-54 సంవత్సరాల మధ్య వియత్నాం ప్రభుత్వం సర్వతోముఖ జాతీయ పునర్నిర్మాణానికి పూనుకున్నది.

1946 లో అధికారం వియత్నాం ప్రభుత్వం చేతికివచ్చేసరికి, దేశం ఆర్థిక విధానం అతి శోచనీయస్థితిలో ఉంది. దీర్ఘకాలం ఫ్రెంచి సామ్రాజ్యవాదుల వలస పాలనకు గురైన ఫలితంగా, దేశం కరువుకు ఆలవాలమై పోయింది. తిండిలేక 20 లక్షలమంది ప్రజలు మరణించారు తోటలు ధ్వంసమైపోయాయి పంటలు నాశనమైనాయి ఫ్యాక్టరీ పరికరాలను ఊడదీసి సామ్రాజ్యవాదులు తరలించుకు పోయారు ముడిసరుకు లేదు ఖజానాలో 10 లక్షల వియత్నాం నాణాలు మాత్రమున్నాయి

ఈ దుస్థితిని తొలగించేందుకు వియత్నాం ప్రభుత్వ సమూలమైన చర్యలు తీసుకుంది.

భూమి పంపకం

దేశద్రోహులు, వలసదారుల భూములను ప్రజలకు ప్రభుత్వం పంచిపెట్ట సాగింది.

1957 కల్లా పంపక కార్యక్రమం పూర్తి అయింది 81,8,000 హెక్టార్ల భూమిని (1 హెక్టారు-2½ ఎకరాలకు సమానం), 21,04188 కుటుంబాలకు పంచిపెట్టింది

ధాన్య పంపకంఅంతా ప్రభుత్వమే చేపట్టింది. పరిశ్రమాభివృద్ధికి పూనుకుంది ప్రైవేటు వ్యక్తులు నిర్వహించే చేతివృత్తులకు కూడా ప్రోత్సాహమిచ్చింది

1954 జూలైలో యుద్ధ విరమణ జరిగినమీదట వియత్నాం ప్రభుత్వం పారిశ్రామిక పునర్నిర్మాణానికి మరింతగా పూనుకున్నది

అయిదేండ్ల అభివృద్ధి

1955 నుండి నేటి వరకు, అనగా అయిదేండ్లలో ఆహారోత్పత్తి 52.7 శాతం పెరిగింది

1955లో 17 ప్రభుత్వ పరిశ్రమలు మాత్రముండగా 1959కి వీటి సంఖ్య 147కు పెరిగింది. పారిశ్రామిక కుటీర పరిశ్రమల ఉత్పత్తి 4 2 రెట్లు పెరిగింది. ప్రభుత్వ పరిశ్రమలలో పనిచేసే పారిశ్రామికుల సంఖ్య 25 వేలనుండి 1 లక్షకు పెరిగింది కార్మికుల ఉత్పత్తి సామర్థ్యం 3 8 రెట్లు అయింది

సహకార క్షేత్రాలు

1958 లో రైతులలో 5 శాతం మాత్రమే సహకార వ్యవసాయక్షేత్రాలలో సభ్యులు 1960 కి వీరిసంఖ్య 54 శాతం అయింది పరిశ్రమలలో కూడా సోషలిస్టు ఉత్పత్తి సంబంధాలు త్వరితగతిని అభివృద్ధి చెందాయి. 1959 నాటికి మొత్తం పారిశ్రామిక ఉత్పత్తిలో 80 శాతం ప్రభుత్వ పరిశ్రమలు, ప్రైవేటు వ్యక్తులు ప్రభుత్వం సమిష్టిగా నిర్వహించే పరిశ్రమలు, ఈ రెండూ కలిసి ఉత్పత్తి చేశాయి

1955 లో పారిశ్రామికాభివృద్ధికి కేటాయించిన ధనంకంటె మూడు రెట్లు 1959 లో పరిశ్రమాభివృద్ధికి కేటాయించబడ్డది

ఒక్క మాటలో చెప్పాలంటే, గత అయిదేండ్లలో వియత్నాం ఆర్థిక విధానం, పటిష్టమైన సోషలిస్టు మార్గాన పురోగమిస్తున్నది.

ఉత్తర వియత్నాం, రిపబ్లిక్ సోషలిస్టు మార్గాన పురోగమిస్తుంటే దక్షిణ వియత్నాం అమెరికా దాదాపులకు కేంద్రంగా తయారైంది. 17 అక్షాంశరేఖ ఉత్తర దక్షిణ వియత్నాంలకు సరిహద్దు దక్షిణ వియత్నాం దుస్థితి ఈక్రింది పత్రికా ఉల్లేఖనాల ద్వారా తెలుసుకోవచ్చు

1959 మే 27 న, స్విస్ పత్రిక 'ఆర్థిక సమాచారం' ఇలా వ్రాసింది

"మార్కెట్టులో సరుకులున్నాయి కాని కొనగోలు దారులులేరు నిరుద్యోగం హెచ్చుగా ఉంది. పారిశ్రామికాభివృద్ధికి ఒక పథకంలేదు. జౌళి మిల్లులు చాలా మూత పడిఉన్నవి"

ఫ్రెంచి పత్రిక 'ఫిగారో' 1957 జూన్ 5 న ఇలా వ్రాసింది

"దక్షిణ వియత్నాం పాలకుడు డీమ్ ఒక నియంత. ఎసెంబ్లీకి ఎట్టి అధికారాలు లేవు"

అమెరికన్ పత్రిక న్యూయార్క్-వరల్డు టెలిగ్రాం అండ్ సన్ జూలై 25 1959 న ఇలా వ్రాసింది "దక్షిణ వియత్నాం పోలీసు రాజ్యంగా ఉంది మూడు ముఖ్యనగరాలలో మూడు సైనిక కోర్టులు ఏర్పడ్డాయి త్రోవలో పోతూపోతూ ఒక వ్యక్తి రాజభవనం వైపు చూసి పిడికిలి బిగిస్తే చాలు ఆ వ్యక్తిని సైనిక కోర్టు శిక్షిస్తుంది."

దక్షిణ వియత్నాంలో ప్రకటిత మయ్యే 'పాలిటెక్నిక్' అనే పత్రికలో 1960 జనవరి 15 న ఒక దక్షిణ వియత్నాం సైనికాధికారి ఇలా వ్రాస్తున్నాడు "దేశంలో అశాంతి హెచ్చుగా ఉంది వేలకొద్ది ప్రజలను కాల్చి చంపినా, ప్రజలలో దాగొని ఉన్న 'శత్రువు' ప్రతిఘటన తగ్గించలేము"

రవీంద్ర శతవార్షిక ఉత్సవ సమితి

ఢిల్లీలో ప్రముఖులతో ఏర్పాటు

న్యూఢిల్లీ, ఆగస్టు 31

వచ్చే 'యేడాదిలో' జరుపబోయే విశ్వకవి రవీంద్రుని శతవార్షిక ఉత్సవాలకు తగు సన్నాహాలను జరిపేందుకుగాను ఢిల్లీలో ఒక కమిటీ ఏర్పడింది.

ఈ కమిటీకి "రవీంద్ర శతవార్షిక కాంతి ఉత్సవ ఢిల్లీసమితి" అని పేరు పెట్టారు

ఈ కమిటీకి పార్లమెంటు సభ్యుడు పండిత బనార్సీదాస్ చతుర్వేది అధ్యక్షులుగా వుంటారు కమిటీ సభ్యులుగా పార్లమెంటు సభ్యుడు శ్రీ బ్రహ్మప్రకాశ్, బేగమ్ కుదిసీజైదీ, డాక్టర్ బి యస్ గంగూలీ, డాక్టర్ ఆర్ సి మజుమ్‌దార్, శ్రీ విష్ణుప్రభాకర, శ్రీ యశపాల్ జైనుస్, డాక్టర్ సల్లమత్ ఉల్లా, శ్రీ యమ్ ఫరూకీ, శ్రీ గోపీనాద్ అమాన్, బేగం హమిదాసుల్తాన్ అహమ్మద్ గార్లున్నారు. (వి. వి.)

వ్యాఖ్యలు-విమర్శలు

మన మూడవ ప్రణాళికకోసం మరో రు 60 కోట్లు అప్పుగా ఇచ్చేందుకు సోవియట్ అంగీకరించింది. దీంతో రెండవ మూడవ ప్రణాళికలకు సోవియట్ చేసిన, చేయనున్న సహాయం రు. 885 కోట్లవుతుంది

సోవియట్ సహాయానికి వడ్డీ తక్కువ సాలుకు నూటికి రెండున్నర మాత్రమే పాశ్చాత్య రాజ్యాలు తీసుకొనే వడ్డీ అయిదు శాతంపైనే సామ్రాజ్యవాదులు అప్పిస్తే వాళ్ళ అప్పును మనం పౌనల్లోనూ, డాలర్లలోనూ చెల్లించాలి కాని రష్యాకు రూపాయిల్లో చెల్లిస్తేచాలు

మనదేశంలో మనం ఎగుమతిచేయగల సరుకులే కొనుక్కొని సద్దుకొందుకు సోవియట్ సిద్ధంగా వుంది.

అప్పుగానో, సహాయంగానో అమెరికాకూడా చాలా ఇచ్చింది 1945 నుండి 59 వరకూ రూ 755 కోట్లవరకూ ఇచ్చింది. ఏంలాభం? మన కాళ్ళపై మనం నిలబడేందుకు వీలుగా ఒక్క భారీపరిశ్రమను నిర్మించుకొనేందుకుకూడా ఆ సహాయం ఉపయోగించలేదు. రష్యా ఉక్కు కర్మాగారానికి, యంత్రపరికరాల ఉత్పత్తి కర్మాగారానికీ, నూనె గనుల త్రవ్వకానికీ సహాయం ఇస్తోంది.

రష్యా ఇచ్చే సహాయానికి లాభాపేక్ష లేదు అక్కడినుండివచ్చే నిపుణులు కోటీశ్వరుల ఏజెంట్లూ కాదు. వారు సోషలిస్టు సమాజ ప్రతినిధులు కనుక లాభాల వేటాలేదు, ధరలను మధ్యలో పెంచడమూలేదు యంత్రోత్పత్తి కిటుకు కాస్తా భారత నిపుణులకు తెలిస్తే తమకు మార్కెట్‌లో పోటీ వస్తుందనే భయంలేదు అందుకే వారు మన నిపుణులకు అరవిడిచి తర్ఫీదు ఇస్తున్నారు.

సోవియట్ ప్రభుత్వం, భారత ప్రభుత్వానికి అప్పిస్తోంది. ఆ అప్పుకు యంత్రాలు దిగుమతిచేసి ప్రభుత్వ రంగంలో పరిశ్రమలు నెలకొల్పేందుకు తోడ్పడుతోంది

అమెరికా ప్రభుత్వం తాను ఇచ్చే అప్పుకుగాను ఆదేశంలో [illegible] యున్న సామగ్రిని మనకు దిగుమతి చేస్తోంది పరిశ్రమల నిర్మాణానికి తమ దేశపు గుత్త పెట్టుబడిదారులకు అవకాశమిప్పిస్తోంది సహాయం పేరిట తమ పెట్టుబడిదారుల వ్యాపారానికీ, పరిశ్రమలకూ, లాభాలకూ అవకాశం కల్పించుకుంటోంది అమెరికా.

ఆ పెట్టుబడిదారుల స్వభావాన్ని, వాళ్ళ పరిశ్రమల దోపిడీ స్వభావాన్ని తెలుసుకొనేందుకు ఒక్క ఉదాహరణ ఇస్తే సరిపోతుంది 1946 నుండి 1958 వరకూ అమెరికా విదేశాల్లో పెట్టిన పెట్టుబడి 1800 కోట్ల డాలర్లు ఆ పెట్టుబడులపై వచ్చిన లాభం 2510 కోట్ల డాలర్లు అంటే పర్యవసానం? తమ 1800 కోట్ల డాలర్లు తమ దేశానికి చేరగా అదనంగా విదేశాలనుండి మరో 770 కోట్లుకూడా తరలి వచ్చింది. ఆయా దేశాల్లో ఉన్న నూనెశుద్ధికర్మాగారాలో, మరొకటో తమవి గానే వుండగా వచ్చిన ఫలితం ఇది

ఈ అంశాలన్నిటినీ పరిశీలిస్తే సోవియట్ సహాయానికిగల విశిష్టత మరింత స్పష్టంగా అర్థమవుతుంది

* * *

మధ్య ఆసియాలో మరోసారి కలవరం కలుగుతోంది జోర్డాన్ ప్రధాని బాంబు ప్రేలుడుకు హతుడయ్యాడు. ఇరాన్ ప్రధానిచే రాజు షా, రాజీనామా ఇప్పించి బర్తరఫ్ చేశాడు సామ్రాజ్యవాదుల శిబిరంలో వున్న యీ రెండు దేశాలు ఏ క్షణానైనా బ్రద్దలయ్యే అగ్నిపర్వతాలవలె వున్నాయి

రెండేళ్ళకు పూర్వం ఇరాక్‌లో విప్లవ ప్రభుత్వం ఏర్పడినప్పుడు ఆ జ్వాలలను, అటూ ఇటూ వ్యాపించనీయకుండా చేయాలని సామ్రాజ్యవాదులు చుట్టూ కమ్ముకున్నారు, అమెరికా నౌకా దళాలు లెబనాన్‌లో దిగాయి జోర్డాన్‌లో బ్రిటిషు సేనలు దిగాయి హుస్సేన్ రాజుకు అండగా వుంటామని ఆసామ్రాజ్యవాదులు ప్రకటించారు.

ప్రపంచ ప్రజాభిప్రాయం ఒత్తిడి వల్ల, లెబనాన్ ప్రజల ప్రతిఘటనా పోరాటంవల్ల అమెరికన్ సేనలు వెనక్కుమళ్ళాయి హుస్సేన్ రాజుపరిపాలనపైన నానాటికి అసంతృప్తి పెరుగుతోంది ఈ మధ్య నిరంకుశ నిర్బంధాలు యుద్ధ ప్రయోగంతో ఎన్నికలు జరిగాయి దాంతో ప్రజల్లో మరింత అలజడి కలిగింది ఎటూ ముంచుకు వస్తున్న ముప్పునుండి తప్పించుకునేందుకు రాజు షా ఇప్పుడొక పాచిక నడ్డం వేశాడు. ఆ నిరంకుశ విధానాలకు తాను బాధ్యుడు కానట్లూ, తన ప్రధానమంత్రి, అతని పార్టీయే ఇందుకు బాధ్యత వహించవలసినట్లూ ప్రకటించి ఆ ప్రధాన మంత్రిని యజ్ఞపశువును చేశాడు

ఇరాక్ విప్లవానంతరం జోర్డాన్ రాజు అధికరమున్న పార్లమెంటును రద్దుచేశాడు పార్లమెంటు సభ్యులను జైళ్ళపాలుచేసి సైనికరాజ్యం నెలకొల్పాడు [illegible] మజాలి ప్రధాన మంత్రిగా ఒక ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయించుకున్నాడు సైనిక కుట్రలభయం జాస్తవడంచేత, తన సేనా నాయకుణ్ణే నమ్మలేక ముజాలి తమ్ముణ్ణి కొత్త సేనానాయకుడుగా నియమించాడు. అతడు అదివరకటి సైన్యాధిపతులందర్నీ బంధించి హుస్సేన్ రాజు సేవచేస్తున్నాడు.

అసలయినా 'టై.'బాంబుప్రయోగం రాజుకోసమే జరిగిందని కూడా ఒక వార్త అతడు ప్రధానివద్దకు ఆ సమయానికి రావలసి యున్నదట అందుకే బయలుదేరాడటకూడా కాని ముందుగానే బాంబు పేలింది. ప్రధానీ, మరికొందరూ మరణించారు. దేశమంతా ఇప్పుడలజడిగా వుంది. అవసరమైతే తమసేనల్ని రాజు రక్షణార్థం పంపుతామని బ్రిటిషు ప్రభుత్వం కబురు గంపినట్లుకూడా కొన్ని వార్తలు

ఏ సహాయం ఎంతవచ్చినా, పర్షియా, జోర్డాన్ రాజులను రక్షించటం ఎవరి తరమూ గాదు ఆరనిచిచ్చు ఆ దేశాల్లో రాజుకొంది అది ఆ రాజరికాలను ఎప్పుడో ఒకప్పుడు ఆహుతి పుచ్చుకు తీరుతుంది.

* * *

వైద్యులకు కర్మ సిద్ధాంతం అబ్బితే రోగులు బాగుపడరు. పాలకులకు అబ్బితే ప్రజలూ బాగుపడరు. విజ్ఞాన శాస్త్రంమీద, నిర్మాణశక్తి మీద, నమ్మకంపోగొట్టి అన్నిటికీ కర్మను అడ్డం పెట్టితమ అసమర్థతను కప్పిపుచ్చుకొందుకూ, తమ పరిపాలనను కొనసాగించుకొందుకూ వారుప్రయత్నిస్తూంటారు

ఉత్తరప్రదేశ్‌లో కలరా వచ్చి వందలకొలదీ జనం రాలిపోతున్నారు ఏలినవారు ఏ రోగ నివారణ కార్యక్రమం పుచ్చుకున్నారని విలేకరులు ఆ రాష్ట్ర ఆరోగ్య శాఖా మంత్రిని ప్రశ్నించారు "ఏదో, చేతకలిగినది చేస్తున్నాం ఏం చేసినా చావాలని వ్రాసిపెట్టున్నవాళ్ళు ఎటూ చావక మానరు" అన్నారట ఆ మహానుభావుడు ఇటువంటి వాళ్ళను తక్షణం ఏ అరణ్యాలలో పంపటం కంటే ఈ రోజుల్లో శరణ్య మేముంటుంది?

క్యూబాలో విప్లవానంతరం వెల్లివిరుస్తున్న నవచైతన్యం

దేశ పునర్నిర్మాణానికి ప్రజాసంరంభం

[క్యూబాలో విప్లవానంతరం పెద్దఎత్తున పునర్నిర్మాణ కార్యక్రమం జరుగుతున్నది. దాన్ని జయప్రదం చేయటానికి ప్రజానీకం సమధికోత్సాహంతో కృషిచేస్తున్నది. తద్వారా అనేక సౌకర్యాలు ప్రజలకు కలుగుతున్నాయి. ఈ ప్రజాసంరంభాన్ని స్వయంగా తిలకిస్తున్న మా ప్రత్యేకవిలేకరి క్యూబాపరిస్థితులపై వ్రాసిన ప్రథమ లేఖను పాఠకుల ఉపయోగార్థం నేడు ప్రచురిస్తున్నాం — సం.]

నేను క్యూబాకు రాగానే మొదటి రోజున క్రొత్తగా కట్టిన కార్మికుల నివాసస్థలాలు చూపెట్టారు. కార్మికులు ప్రపంచ యువజనులను అమితోత్సాహంతో ఆహ్వానించారు కార్మికుల ఉత్సాహము, వారి రాజకీయ చైతన్యమూచూచి ఆనందము, ఆశ్చర్యము కలిగినవి. కార్మికులకు ప్రత్యేకముగా 'న్యూ హవానా' నిర్మించుచున్నారు చాల కట్టడములు పూర్తయినవి ఇంకను కట్టుచున్నారు లక్షయిళ్ళు కట్టారు భవనములన్నియు చాలా ఆధునాతనంగా ఉన్నాయి. ఒక కుటుంబమునకు 2 పడకగదులు, 2 స్నానాల గదులు, వంటగది, డ్రాయింగు రూము కలిసి ఉన్నవి ఇంటిలో ఆధునిక సామగ్రి ఉన్నది ఎలెక్ట్రిక్ ఫానులూ, వంటగదిలో రిఫ్రిజిరేటరు, ప్రైపులూ ఉన్నాయి న్యూఢిల్లీలో పార్లమెంటు సభ్యులకు యిచ్చిన సౌకర్యాలన్నీ ఆ యింటిలో ఉన్నవి కార్మికులను అనేక ప్రశ్నలు అడగ్గా, వీరు చాలా ఉత్సాహముతో జవాబులు చెప్పారు. ఆ ప్రశ్నలన్నీ నేను తెలిసుకొనుట చాలా కష్టముగా వున్నది స్పానిష్‌నుంచి ఇంగ్లీషు తర్జుమా చేసేవారు తక్కువ అందుచే వివరాలన్నీ పంపలేక పోవుచున్నాను

కార్మికుల పరిస్థితి

ఒక్కొక్క కార్మికుడు వారమునకు 48 గంటలు పనిచేయును అందులో 4 గంటలు ప్రభుత్వానికి ఉచితముగా చేస్తాడు. 44 గంటలకూ 5 డాలర్లు ముడుతున్నది విప్లవము తరువాత పరిస్థితి అనేకరెట్లు బాగుపడిందని ఎల్లప్పుడూ స్మరిస్తూ ఉంటారు మంచి జీవితంకోసం కృషిచేస్తామని, కష్టపడి క్యూబాను రక్షించుకుంటామని స్వచ్ఛంగా వారు ఎంతో ఉత్సాహముతో చెప్పుచున్నారు ప్రత్యేకంగా ఒక డ్రైవరు ఇల్లు చూచాము మన ఆంధ్రదేశములో గొప్ప యింటి వారికంటె ఎక్కువ ఫర్నిచర్ తోటి, కాయగూరలు తిను బండారాల తోటి, ఉన్నాయి. ఆ డ్రైవరు విప్లవము పూర్వపు పరిస్థితులకును ఇప్పటి పరిస్థితులకునూ పోలికే లేదని చెప్పాడు ఇప్పుడు అతడు నెలకు 150 డాలర్లు సంపాదించుచున్నాడు. విప్లవంమీద వారి నమ్మకము ఫెడెల్ కాస్ట్రో యందు వారి అనురాగమూ, ఆప్యాయతా వర్ణించ నలవికానిది అమెరికా వ్యతిరేకత క్యూబా ప్రజలలో నరనరానా జీర్ణించుకు పోయినట్టు స్పష్టంగా కనపడుచున్నది అమెరికన్ సామ్రాజ్యవాదులను నిరసించని కార్మికుడు కనపడటంలేదు. ప్రతి ఫ్యాక్టరీలోను కార్మికులు పనిచేయుచున్న పీపుల్స్ ఆర్మీ కవాతులుకనపడుచున్నవి ముసలి వారుకూడా కవాతు చేయుచున్నారు ఈ అవసానదశలో "నీకీ కష్టము ఎందుకు" అంటే 'నాజీవితం ఎంత ఉంటే అంతా కూడా దేశాన్ని, నా ప్రజలనురక్షించుటకు వినియోగిస్తాను' అనిచెప్పాడు. ఒక్కసంవత్సరంలో 20 వేల యిళ్ళు కట్టారు. 20 వేల కుటుంబాలు అందులో నివసించుచున్నవి. సుమారు లక్షమంది అందులో దివ్యంగాకాపురాలుచేయవచ్చును. అవి అన్నియుకూడా కార్మికుల నివాసస్థలములే మర్నాడు నైట్‌క్లబ్‌కు వెళ్లాము. అక్కడకూడ కార్మికులే ఎక్కువగా ఉన్నారు. ఈతస్థలం ఒకటి చూచాము అక్కడ కార్మికులు చాలా ఉత్సాహంతో సముద్రంలో స్నానాలు చేయుచున్నారు ఎక్కడకు వెళ్ళినా 'క్యూబా వర్థిల్లాలి' 'అమెరికా నశించాలి' అనే నినాదాలే హవానా అంతా ఇవే నినాదాలతో నిండియున్నది.

ప్రజానాయకులు

ఫెడెల్, రావుల్

మధ్యతరగతి కూడా చాలా ఉత్సాహంతో అన్ని రంగాలలోను పాల్గొనుచున్నారు కార్మికులకు వారి మధ్య ఉన్న స్నేహభావాలు అపారమైనవి ఫెడెల్ కాస్ట్రో రావుల్ కాస్ట్రోఇద్దరూ ప్రజల హృదయాలలో అంటుకొని పోయినారు ప్రతియింటిలోను ఫెడెల్ ఫోటో కనపడుతుంది. ప్రతి కారులోను టాక్సీలోనూ ఫెడెల్ ఫోటో -విప్లవ నినాదాలు చూస్తాం మొత్తంక్యూబా అంతా గొప్ప పునర్నిర్మాణంలో ఉన్నట్లు కన్పడుతుంది

క్రొత్తగా విప్లవం సాధించారు. కనుక ఇక్కడ అందరూ యువక నాయకులే ఇక్కడ నూటికి 99 మంది స్పానిష్‌భాష మాట్లాడుచున్నారు.

ప్రస్తుతము నేను "సిరమైస్త్రా"లో ఉన్నాను యిక్కడే మా క్యాంపు ఏర్పాటు చేశారు మేముకూడా యిక్కడ మిలటరీ శిక్షణ పొందుతున్నట్టేఉంది

విద్యా సౌకర్యాలు

ఓరియంట్ రాష్ట్రంలో "సిరమైస్త్రా" ఒకభాగము కాస్ట్రో యీ పర్వత ప్రాంతంనుండే విప్లవం సాగించాడు ఇది చాలా వెనకబడిన ప్రదేశము. కాని ఇక్కడ ప్రజలు 100కి నూరుపాళ్ళు విప్లవాన్ని సమర్థించి పాల్గొన్నారు ఈ ప్రాంతంలో వెనుకబడిన జాతులకు విద్యగరుపుటకై బ్రహ్మాండమైన కట్టడాలు కట్టుచున్నారు 20,000 మంది రైతువిద్యార్థులకు అన్ని సౌకర్యాలతో పాఠశాలలు నిర్మించుచున్నారు 4 మాసాల్లో 500 మందికి సరిపడు పాఠశాలలు పూర్తిఅయినవి ప్రస్తుతము 500 మంది రైతుబిడ్డలు చదువుచున్నారు వారికి అన్నియు ఉచితముగా లభించుచున్నవి మన కాన్వెంటుస్కూల్సులోకూడా యిన్ని సౌకర్యాలు లేవు విప్లవమునకు పూర్వము 70 శాతానికి విద్యాసౌకర్యాలు లేవు ఇప్పుడు 70 శాతం విద్యాసౌకర్యాలు పొందుచున్నారు ఇక్కడకు 20 మైళ్ళ దూరంలో పర్వతముల మధ్య మిలటరీ స్కూళ్ళు నిర్మించుచున్నారు హవానానుంచి, యితర పట్టణముల నుంచి విద్యార్థులు వచ్చి ఈ కొండ జాతుల పాఠశాలల్లో ఉపాధ్యాయులుగా పనిచేయుచున్నారు. విద్యార్థులకు 8 మాసాలు శిక్షణ యిచ్చి ఇక్కడను పంపుతారు ఇక్కడ 8 మాసాలు వారు ఉచితముగాపనిచేయాలి తరువాత నెలకు 10 డాలర్లు ఇస్తారు 2సం॥ కాలం పనిచేయాలి. తరువాత ఉద్యోగం గ్యారంటీచేస్తారు

సైనిక శిక్షణ

కాస్ట్రో చేసిన మంచిపనులు యిచ్చట ప్రజలలో విపరీతమైన ఉత్సాహమూ, ఉద్రేకమూ కలిగించినవి. మొత్తం క్యూబా ప్రజలందరూ అంటే స్త్రీలు, పురుషులు, బాలబాలికలూ మిలటరీ ట్రైనింగులో ఉన్నారు ఇచ్చట మిలటరీ జీవితము తప్ప ఇంకొక జీవితము కనబడదు. ప్రత్యేకముగా చెప్పుకోవలసిన దేమంటే వారి మధ్య ఉన్న సుహృద్భావము అపారమైనది. మొత్తం క్యూబా ప్రజలు ఉవ్వెత్తున దేశపునర్నిర్మాణ కార్యక్రమంలోనూ, దేశరక్షణలోనూ మిలటరీ శిక్షణ పొందుచున్నారు. ఆయుధాలు లేకుండా ఎవ్వరూకనపడరు ప్రజలందరికి ఆయుధాలు యిచ్చారు. "సిరమైస్త్రా"లో యిదివరకుగెరిల్లా క్యాంపులుగా ఉన్న వాటిలో మిలటరీ శిక్షణ పాఠశాలలు కట్టుచున్నారు ప్రజలందరకూ ముఖ్యముగా పీపుల్స్ ఆర్మీకి ఆధునిక ఆయుధాలు యిచ్చుటకు ఫైడెల్‌కాస్ట్రో నిర్ణయించాడు. ఇతర ప్రాంతములనుంచి వచ్చినవారు ఈ పర్వతప్రాంతంలో మిలటరీ శిక్షణ పొందుచున్నారు వెయ్యి మిలటరీ పాఠశాలలు కట్టుటకు నిర్ణయించారు, ఇప్పుడు సుమారు 5, 6 వేల మంది పనిచేయుచున్నారు యిక్కడ పనిచేయుట చాలాకష్టం పర్వతాలమీద 20 మైళ్లు కాలి నడకతో వెళ్ళాలి. అయినా ఆ కష్టాలన్నిటికీ ఓర్చి యిక్కడ యీభవనాలుకట్టుచున్నారు.

సోషలిజం

ఇక్కడ ఉత్పత్తి సంబంధాలు, ఉత్పత్తి పరికరాలు సోషలిజం వైపుకి సాగిపోతున్నాయి ప్రపంచంలో కల్లా ఒక ప్రత్యేకత ఈ క్యూబా విప్లవములో ఉన్నట్లు కనబడుతున్నది

నూటికి 90 పాళ్ళు విప్లవ ప్రభుత్వాన్ని సమర్థించటం, పునర్నిర్మాణంలో పాల్గొనటం కళ్ళారా చూస్తున్నాం అన్ని రంగాలలోను విప్లవ చైతన్యము ప్రజలప్రేమను, ఆప్యాయతను సంపాదించి, చూరగొని సోషలిజం వైపుకి తమదేశాన్ని పురోగమింప చేస్తూ ఉన్నట్టు స్పష్టంగా కన్పడుతున్నది.

కాస్ట్రోపట్ల ప్రజల ఆప్యాయత

ఆగస్టు 6 వ తేదీన లాటిన్ అమెరికన్ కాంగ్రెసు కార్యకర్తలు ఒక బహిరంగసభ ఏర్పాటుచేశారు ఆ వేళ హవానా కోలాహలం, చైతన్యమూ చూస్తే అమితాశ్చర్యం కలిగినది. కాస్ట్రో ఉపన్యసిస్తాడని ఉదయం 11 గంటలకు తెలియపర్చారు. జోరున వర్షం కురుస్తున్నా ఊరేగింపులతో సుమారు 60 వేల మంది జనం స్టేడియంకు వచ్చారు. అనారోగ్యంగా ఉన్నా, డాక్టర్లు వద్దని వారిస్తున్నా వినకుండా ఆవేశ సుమారు నాలుగు గంటలసేపు కాస్ట్రో ఉపన్యసించాడు. క్యూబా అంతా ఇది గొప్పగా చెప్పుకుంటున్నారు ఆ వేళ మొత్తం అమెరికన్ కంపెనీలను జాతీయం చేసినట్లు ఆయన ప్రకటించారు. రాత్రి 9 గం॥ లగాయతూ తెల్లవారఝామున 3 గంటలవరకూ ఒక్కమనిషికూడా వెళ్లకుండా సభను దిగ్విజయంచేశారు

ప్రజల ఆనందోత్సాహాలు

60 వేలమంది ఒక్క అడుగు తెల్లవార్లూ డ్యాన్సుచేస్తూ, నినాదాలు యిస్తూనే ఉన్నారు ప్రజల చేతుల్లోకి అధికారంవస్తే దేశంలో ఎంత ఆనందం వెల్లివిరుస్తుందో అక్కడకళ్ళకుకట్టినట్లు కన్పడింది సభలో ఫైడెల్ ఉపన్యసిస్తుండగా మధ్యన గొంతుక పోయింది. తిరిగి తేరుకొనగానే అమెరికన్ కంపెనీలనుజాతీయంచేస్తూ గావించినచట్టాన్ని అరటిపండువలచినట్టు విప్పి ఆయన ప్రజలకువివరించారు ఫైడెల్ మాట్లాడుతున్నంతసేపూ ప్రజలు డ్యాన్సు చేస్తూనే ఉన్నారు గొంతుక పోయినప్పుడు ప్రజలంతా ఒక్కపెట్టున "ఫైడెల్! నీవు అనారోగ్యంగా ఉన్నావు ఇక మాట్లాడబోకు. మాకు సంగతులన్నీ రావుల్ చెప్తాడులే" అని నినాదాలిచ్చారు. అప్పుడు కొంతసేపు రావుల్ మాట్లాడాడు మరునాడు హవానాలో ఈ జాతీయం చేయటాన్ని గురించి గొప్ప పండుగలు, వేడుకలు జరిగినవి ఎక్కడ చూచినా ఉత్సాహభరితమైన వేడుకలే కనబడ్డాయి

◆

దేశంలో చిన్నకార్లు తయారుచేసే విషయాన్ని పరిశీలనకై ఒక నిపుణుల సంఘానికి పంపడానికి కేంద్రప్రభుత్వం తీర్మానించింది.

* * *

ఉత్తర ప్రదేశ్ కేంద్ర కమిటీ, జిల్లా పరిషత్తుల బిల్లు తొలి దశను ఉత్తర ప్రదేశ్ శాసన సభ ఆమోదించింది.

అధిక ధరల సమస్య

పార్లమెంటుసభ్యుల ఆర్థిక సలహాసంఘంలో చర్చ

న్యూఢిల్లీ, ఆగస్టు 30

అధికధరల సమస్యపై ప్రభుత్వం సమర్పించిన ఒక నివేదికను పార్లమెంటు సభ్యుల సలహా సంఘంలో చర్చించారు.

ప్రభుత్వ నివేదికలో ధరల పెరుగుదలకు ఈ క్రింది కారణాలు తెలియజేశారు.

"ద్వితీయ ప్రణాళిక ప్రారంభమైనప్పటినుండి యింతవరకు 20 శాతం ధరలు పెరిగాయి. డిసెంబరు 1959 నుండి జూన్ 1960 వరకు అయిదు పాయింట్లు అంటే 4 8 శాతం పెరిగాయి.

ఈ పెరుగుదలలో 38 శాతం పారిశ్రామిక ముడి సరకుల ధరలు పెరిగినందున సంభవించింది పారిశ్రామిక సరకుల ధరలు 80 శాతం పెరిగాయి ఆహారధాన్యాలు, పప్పుల ధరలు 28 శాతం పెరిగాయి. 1959 - 60లో ముడిజనుము, పత్తి పంటలు వరుసగా 12 శాతం 18 శాతం తగ్గినందున ఈ సరకుల ధరలు పెరిగాయి. గోధుమ ధరలు గత సంవత్సరం కంటే తగ్గాయి. కాని బియ్యంధరలు పెరిగాయి జీవనవ్యయ సూచీ సంఖ్య 1960 జూన్‌లో 128 ఉన్నది. డిసెంబరు 1959 నుండి ఇది నిలకడగానే ఉంది.

అత్యవసర జీవితావసర వస్తువులు, పారిశ్రామిక ముడిసరుకుల ఉత్పత్తి గణనీయంగా పెరిగినప్పటికీ ధరలు స్థిరీకరించాలంటే ఆర్థిక వ్యవస్థలోని అనేక అంశాలమీద ఆధారపడివుంది అవసరమైన సమయాల్లో కంట్రోళ్ళు, ఉచితమైన పన్నుల విధానం, సరియైన ద్రవ్యవిధానం అవలంబించాలి

న్యాయమైన పన్నులవిధింపుద్వారా వినిమయాన్ని అదుపుచేయడం, ఋణ గ్రస్త ద్రవ్యవిధానాన్ని, బ్యాంకురుణాలను జాగ్రత్తగా అమలు పరచడం, పొదుపు ఉద్యమం ద్వారా సాధ్యమైనంత యెక్కువ పెట్టుబడి సేకరణ, అవసరమైన సందర్భాలలో ప్రభుత్వ ప్రత్యక్షజోక్యం - వీటన్నిటిని ప్రయోగించడంద్వారా ధరల స్థిరీకరణ సాధ్యమవుతుంది

ఈ అన్ని సమస్యలను జాతీయాభివృద్ధి సమితి నిర్మించిన ఒక కమిటీ పరిశీలించుచున్నది

విదేశాల సహాయం

విదేశాల సహాయం గురించి జరిగిన చర్చసందర్భంలో ప్రభుత్వం సభ్యులకు యీ దిగువ వివరాలతో నివేదిక సమర్పించింది

"ప్రపంచ బ్యాంకు అధ్వర్యాన భారతదేశానికి సహాయం చేయదలచిన పశ్చిమ రాజ్యాల సమావేశం పారిస్‌లో సెప్టెంబరు 12 వ తేదీన జరుగుతుంది. మన తృతీయ ప్రణాళికకు చేయదగు సహాయం గురించి ఈ సమావేశంలో ఆలోచిస్తారు. ఈ సమావేశం తరువాత విదేశాల సహాయం ఎంత లభిస్తుందో తెలుస్తుంది తృతీయ ప్రణాళికకు సోవియట్ రు 180 కోట్లు, జకోస్లొవేకియా 23 కోట్ల 10 లక్షలు స్విట్జర్లండ్ రు 10 కోట్ల 9 లక్షలు, ఇచ్చాయి ఇవన్నీ కలిపి మొత్తం 247 కోట్ల 80 లక్షలు

ప్రపంచబ్యాంకు యిచ్చిన అప్పు మినహా మిగిలిన అప్పులన్నీ ఏదోఒక ప్రాజెక్టుకు ఉద్దేశించి యివ్వబడినవే

విదేశ మారకం పొదుపు

విదేశ మారకం పొదుపుచేసే సమస్యపై జరిగిన చర్చలో ఒక సభ్యుని ప్రశ్నకు శ్రీ మొరార్జీ దేశాయి సమాధానం చెబుతూ విదేశాలకు పోయే భారతీయ యాత్రికులపై విధించిన ఆంక్షలను సడలించడం సాధ్యం కాదన్నారు భారతదేశానికి వచ్చే విదేశీ యాత్రికులవలన గత నాల్గు సంవత్సరాల్లోనూ వచ్చిన ఆదాయం ఈ విధంగా ఉందని తెలియజేశారు.

1956 లో 15 కోట్ల 50 లక్షలు, 1957 లో 16 కోట్లు, 1955 లో 17 కోట్ల 50 లక్షలు, 1959 లో 19 కోట్ల 10 లక్షలు

1960 జూలై ఆఖరువరకు 9 కోట్ల 29 లక్షల మేరకు ప్రైజు బాండ్లు అమ్ముడైనట్లు ఆర్థికమంత్రి తెలియజేశారు

ఆంధ్ర విశ్వవిద్యాలయ స్నాతకోత్సవం

వాల్తేరు, ఆగస్టు 31

ఆంధ్ర విశ్వవిద్యాలయంలో స్నాతకోపన్యాసం ఇవ్వడానికి కేంద్ర విద్యామంత్రి డాక్టరు కె. ఎస్. శ్రీమాలి అంగీకరించారు స్నాతకోత్సవం డిసెంబరు 3 వ తేదీన జరుగుతుంది ఉత్సవానికి ఛాన్సలర్ అధ్యక్షత వహిస్తారు.

టర్కీ-రష్యాల మధ్య సత్సంబంధాలు

తాము వాంఛిస్తున్నామని క్రుశ్చేవ్, గుర్సెల్ ఉత్తర ప్రత్యుత్తరాలు

మాస్కో, సెప్టెంబరు 1

టర్కీ, సోవియట్ దేశాల మధ్య సన్నిహిత సహకారం ఉండాలని అంటూ సోవియట్ ప్రధాని నికిటా క్రుశ్చేవ్ టర్కీ అధ్యక్షుడూ, ప్రధాని అయిన సెమాల్ గుర్సెల్‌కి ఒక జాబు రాశారు.

క్రుశ్చేవ్ ఈ లేఖను జూన్ 28వ తేదీని రాశారు దీనిని నేడు సోవియట్ పత్రికలన్నీ ప్రచురించాయి.

"టర్కీ, సోవియట్ దేశాల మధ్య గతంలో ఉన్న పరస్పర సహకార సంబంధాలను తిరిగి నెలకొల్పడానికి నా ఈ ప్రస్తావన దోహదపడవచ్చు"నని క్రుశ్చేవ్ తన లేఖలో రాశారు.

క్రుశ్చేవ్ ఈ జాబులో ఇంకా ఇలా అన్నారని 'టాస్' వార్తాసంస్థ తెలిపింది.

మన రెండు దేశాల మధ్య సంబంధాలను బాగుచేయాలనే వాంఛ ఉభయత్రా ఉంది. ముందు ముందు ఈ సంబంధాలను సన్నిహిత సహకార సంబంధాలుగా పెంపొందించేందుకు సెమాల్ గుర్సెల్‌కి సూత్రప్రాయంగా అభ్యంతరం ఏమీ లేదన్న విషయం చాల సంతోషకరం.

టర్కీ ప్రభుత్వం గనుక తటస్థవిధానాన్ని అనుసరిస్తే ఉభయదేశాలమధ్య చాల హృదయపూర్వకమయిన సహకార సంబంధాలు పెంపొందగలవనేది మా దృఢ విశ్వాసం.

అయితే, ఈ సన్నిహిత సంబంధాలను నెలకొల్పేందుకు వాండీ ప్రస్తావన జరగడానికి ఇదొక షరతు ఏమీ కాదని క్రుశ్చేవ్ స్పష్టం చేశారు.

గుర్సెల్ జవాబు

క్రుశ్చేవ్ లేఖకు గుర్సెల్ జూలై 8వ తేదీన జవాబు రాశారు. టర్కీ, సోవియట్ దేశాలమధ్య సంబంధాలు నెలకొల్పాలనే అభిలాషను క్రుశ్చేవ్ వ్యక్తంచేసినందుకు ఆయన సంతృప్తిని తెలిపారని 'టాస్' వార్తాసంస్థ ప్రకటించింది "మా ఆకాంక్ష కూడా ఇదే అని మీకు హృదయపూర్వకంగా తెలుపుకోగోరుతున్నాను" అని ఆయన రాశారు.

అయితే, "టర్కీ కొన్ని దేశాలతో కలిసి కూటములుగా ఏర్పడే విధానాలకూ, టర్కీ- సోవియట్ దేశాల మధ్య సత్సంబంధాలు నెలకొనడానికీ, వైరుధ్యం ఏమీలేదు" అని గుర్సెల్ రాశారు.

ఇతర దేశాలతో టర్కీ సైనిక సంధులు పూర్తిగా రక్షణకోసమేననీ, దురాక్రమణకు పూనుకోగల దేశాలకు వ్యతిరేకంగానే అవి అమలులోకి వస్తాయిగాని, ఏ ఒక దేశానికీ వ్యతిరేకంగా ఉద్దేశించినవి కావనీ గుర్సెల్ తన జవాబులో వాదించారు.

"అంతర్జాతీయ వ్యవహారాల్లో నా ప్రభుత్వం కెమాల్ అటాటర్క్ (నవ టర్కీ నిర్మాత) నిర్దేశించిన సూత్రాలనే దృష్టిలో పెట్టుకొని వ్యవహరిస్తుందని మీకు రూఢిగా తెలుపగలను"ని ఆయన రాశారని 'టాస్' ప్రకటించింది.

ఐరాసతో షోంబే పేచీ

ఎలిజబెత్‌విల్లీ, ఆగస్టు 31

కాటంగా రాష్ట్రంలో బెల్జియన్లు ఖాళీచేసిన కామినా సైనిక స్థావరంపై అధికారం గురించి ద్రోహి మోసే షోంబే మూఠా, ఐరాసతో పేచీ పెట్టుకుంది.

కాంగోతో సంబంధంలేని కాటంగా ఒక స్వతంత్ర దేశం అనీ, తమది సార్వభౌమాధికారాలుగల స్వతంత్ర ప్రభుత్వమనీ, అందుచేత కామినా స్థావరంపై అధికారం తమదే అనీ ఈ మూఠా వాదన.

ఐరాస అధికారులు ఈ వాదనను లెక్క చేయకుండా బెల్జియన్లు ఖాళీచేసిన ఆ స్థావరాన్ని స్వాధీనం చేసుకోవలసిందిగా వందమంది స్వీడిష్ సైనికులను అక్కడికి పంపారు. ఆ స్థావరంలోని అయిదారు వందలమంది బెల్జియన్ సాంకేతిక నిపుణులను అక్కడే ఉండవలసిందిగా కూడా ఐరాస అధికారులు కోరారు.

తమ అధికారాన్ని గుర్తించకపోతే ఆ స్థావరాన్ని ఏ దశకూ పనికిరాకుండా చేస్తామని షోంబే మూఠా బెదిరిస్తూంది.

నేపాల్‌కి భారత దేశ ఆర్థిక సాయం

ఒప్పందంపై సంతకాలు

ఖాట్మండ్, ఆగస్టు 31

నేపాల్‌కు భారతదేశం ఆర్థిక సహాయం గురించి ఉభయ ప్రభుత్వాలకు ఒప్పందం కుదిరింది. దానిపై నేపాల్ రాజధాని కార్యాలయంలో నేడు సంతకాలు జరిగాయి.

ఈ ఒడంబడిక ప్రకారం భారతదేశం నేపాల్‌లో అయిదు ప్రాజెక్టుల నిర్మాణానికి సహాయంగా ఒక కోటి 47 లక్షల రూపాయలు సహాయం చేస్తుంది. దీనితో నేపాల్‌కి భారతదేశం ఇప్పటికి ఇరవైకోట్ల 82 లక్షల రూపాయలు సహాయం చేసింది.

బెల్జియమ్ సేనల ఉపసంహరణలో ఆలస్యం

హామర్షెల్డ్ నిరసన

ఐరాస, ఆగస్టు 31

మొదట నిర్ణయించుకున్న ప్రకారం ఆగస్టు 29 అర్ధరాత్రికి బెల్జియమ్ ప్రభుత్వం కాంగోనుండి తన సేనల ఉపసంహరణను పూర్తిచేయలేదని ఐరాస ప్రధాన కార్యదర్శి హామర్షెల్డ్ నేడొక నిరసనను బెల్జియమ్‌కి అందజేశారు.

అంతేకాకుండా కాంగోలోని తన సైనికులసంఖ్యను గురించి బెల్జియమ్ ప్రభుత్వం తెలిపిన లెక్కలకూ, అక్కడి విషయాలను స్వయంగా చూచిన పరిశీలకులు తెలుపుతూన్న అంకెలకూ వ్యత్యాసం ఉందనికూడా హామర్షెల్డ్ తెలిపారు.

ఈ విషయాలను పొందుపరచిన నివేదికను హామర్షెల్డ్ భద్రతాసంఘ సభ్యులకు అందజేశారు.

బెల్జియం ప్రతినిధి జవాబు

కాంగోనుండి బెల్జియంసేనల ఉపసంహరణను పూర్తిచేయడం కొంత ఆలస్యం కావడం తమ తప్పిదంవల్ల జరిగినదేమీ కాదని ఐరాసలోని బెల్జియమ్ ప్రతినిధి వాల్టర్ లోరిడాన్ నేడొక ప్రకటన చేశారు కాటంగా రాష్ట్రంలో మిగిలిన బెల్జియంసేనల సంపూర్ణ ఉపసంహరణ విషయంలో రవాణా సౌకర్యాలు లేకపోవడంవల్లనే కొంత ఆలస్యమయిందని ఆయన అన్నారు.

జాతీయాదాయంలో సక్రమ లెక్కలు

ప్రణాళికా పద్ధతికి మిక్కిలి తోడ్పడగలదని డాక్టర్ వి కె. ఆర్. వి. రావ్ ప్రసంగం

న్యూఢిల్లీ, ఆగస్టు 31

ఆర్థికరంగంలో ప్రణాళికా పద్ధతి అమలు జరపడానికి జాతీయ ఆర్థిక వ్యవస్థకు సంబంధించిన విజ్ఞానం తెలుసుకోవడం అత్యంతావశ్యకమైందని, అందుకుగాను జాతీయాదాయ లెక్కలను సక్రమంగా తయారు చేయడము అవసరమని ప్రముఖ ఆర్థికశాస్త్రవేత్త డాక్టరు వి కె ఆర్. వి రావు ఈరోజు అన్నారు.

ఢిల్లీ విశ్వవిద్యాలయ ఆర్థికాభివృద్ధి సంస్థ తరఫున ఏర్పాటు చేయబడిన జాతీయాదాయ పరిశోధకుల సభకు అధ్యక్షత వహిస్తూ శ్రీ రావు ఇలా తెలియజేశారు.

జాతీయాదాయ పరిశోధనలో వాస్తవమైన లెక్కలను సేకరించడం ప్రధాన సమస్య. ఈ లెక్కలను సేకరించడంలో జాతీయ ఆర్థిక వ్యవస్థలో పునాదిగానున్న వాటి గణాంకాలు ప్రాతిపదికగా తీసుకోవాలి.

ఈ లెక్కలు సేకరించకుండా మొత్తం జాతీయ ఉత్పత్తి గురించి కాని, ఉత్పత్తి సాధనాల జాతీయాదాయం ప్రాతిపదికగా తీసుకొని దేశంలోని ఉత్పత్తి గురించి కాని ఒక సరియైన, సమగ్రమైన అంచనా వేయడం దుస్సాధ్యం.

దేశంలో అత్యధిక శ్రామిక ప్రజలకు వ్యవసాయరంగంలో పని లభిస్తుంది వ్యవసాయ రంగంలో సాధించిన ఉత్పత్తి మొత్తం జాతీయ ఉత్పత్తిలో సగానికి ఉంది. ఈ రంగంలో లెక్కలు సేకరించడంలో చాల ఇబ్బందులున్నాయి అందువల్ల వ్యవసాయ ఉత్పత్తిపై సేకరించిన లెక్కలపై ఆధారపడడం మంచిది కాదని తేలుతుంది. ఈ జాతీయాదాయం లెక్కకట్టేటప్పుడు వ్యవసాయ ఉత్పత్తిలో సక్రమమైన లెక్కలు సేకరించడానికి ప్రాముఖ్యమివ్వాలి.

చిన్న చిన్న పరిశ్రమల్లో, వృత్తుల్లో ఇతర చేతివృత్తుల వారి ఆదాయాలను అంచనాలు కట్టేటప్పుడు ఏ మాత్రం ఆధారంలేకుండా కేవలం ఊహాగానాల మీద ఆధారపడడం పూర్తిగా తగ్గించకపోతే జాతీయాదాయం లెక్కలు ఆర్థిక విధానాలను రూపొందించడంలో ఏ మాత్రం ఉపయోగించవు.

జాతీయాదాయం లెక్కల సేకరణ బాధ్యత సంపూర్ణంగా ప్రభుత్వ సంస్థలకే వదలివేయరాదు.

ఆంధ్రలోని ఆహార క్లిష్టస్థితిపై కేంద్రానికి నివేదన

సెప్టెంబరు 2న రాష్ట్ర ఆహార మంత్రి ఢిల్లీకి పయనం

హైద్రాబాదు, ఆగస్టు 31

ఆంధ్రప్రదేశ్‌లో అనావృష్టి వల్ల ఏర్పడిన ఆహార ధాన్యాల క్లిష్ట పరిస్థితిని గూర్చి కేంద్ర ప్రభుత్వానికి నివేదించడానికై రాష్ట్ర వ్యవసాయ మంత్రి శ్రీ యస్ రామచంద్రారెడ్డి ఈ నెల రెండవతేదీన ఢిల్లీకి వెళ్ళనున్నారు.

శ్రీ రామచంద్రారెడ్డి నేడు పత్రికా విలేకరులతో ఇలా అన్నారు.

"రాయలసీమలోని వివిధ జిల్లాలలో పరిస్థితిని స్వయంగా పరిశీలించడానికై నేను ఈ నెల 8వ తేదీనుండి ఆ ప్రాంతంలో పర్యటించనున్నాను.

పరిస్థితులన్నీ మంత్రివర్గానికి తెలుసు క్షామపీడిత ప్రాంతాలకు సహాయం చేయడానికి ప్రభుత్వం చేయవలసినంత చేస్తున్నది.

ఒక రెవెన్యూ బోర్డు మెంబరు ప్రస్తుతం రాయలసీమ జిల్లాల్లో పర్యటిస్తున్నారు.

తమ తమ జిల్లాలలోని పరిస్థితిని వివరిస్తూ వెంటనే ప్రభుత్వానికి నివేదికలు పంపవలసిందిగా జిల్లా కలెక్టర్లను ఆదేశించాము నివేదికలందిన వెంటనే పరిస్థితిని ఎదుర్కోవడానికి తీసుకోవలసిన చర్యలను ప్రభుత్వం నిర్ణయిస్తుంది.

రాష్ట్రంలో వెంటనే చౌక ధాన్యం డిపోలు ప్రారంభించాలని నిశ్చయించాము. ప్రస్తుతావసరాలకై కేంద్ర ప్రభుత్వం 25 వేల టన్నుల బియ్యం మంజూరుచేసింది. ఇంతకు ముందుకూడా ఆంధ్రప్రదేశ్‌కు ఇంతే బియ్యం కేటాయించారు. కరువు పరిస్థితుల దృష్ట్యా ఇంకా ఎక్కువ ఆహారధాన్యం కేటాయించవలసిందిగా కేంద్రప్రభుత్వానికి విజ్ఞప్తి చేయడానికై ఆహారశాఖ కార్యదర్శి ప్రస్తుతం ఢిల్లీలో ఉన్నారు.

కరువు ప్రాంతాలలో పశుగ్రాసం సరఫరా చేయడానికికూడా ప్రభుత్వం చర్యలు తీసుకొంటున్నది"

కేంద్ర వ్యవసాయమంత్రి సూచించినట్లు దేశానికంతకూ ఒకే ఆహారమండలి ఏర్పాటుచేయడంయొక్క ఉపయోగం పట్ల మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి శ్రీ కట్జూ అనుమానం వ్యక్తపరచారు.

కౌల్దార్ల సమస్యలపై సెలెక్టు కమిటీకి విజ్ఞప్తులివ్వండి

హైద్రాబాదు, ఆగస్టు 31

ఆంధ్రప్రదేశ్ రైతుసంఘంతరఫున శ్రీ కందూరి ప్రసాదరావుగారు ఇలా వ్రాస్తున్నారు

కౌలుదారీ బిల్లుపైన ఏర్పడిన జాయింట్ సెలెక్టు కమిటీ వారు సదరు బిల్లులోని అంశాలను గురించి సాక్ష్యాన్ని, ప్రజాభిప్రాయాన్నీ సేకరించేనిమిత్తం ఆంధ్ర ప్రాంతంలో పర్యటించబోతున్నారు సెప్టెంబరు 12న విజయవాడ, 14న అనకాపల్లి, 26న కడప, 28న బాపట్ల వస్తారు.

ఆయాచోట్ల రైతు, వ్యవసాయ కార్మిక సంఘాలు తమ కృషిచేసి, అధిక సంఖ్యాకులైన కౌలుదార్లు మౌఖికంగానూ, వ్రాతపూర్వకంగానూ తమ అభిప్రాయాలు చెప్పేటట్లు చూడాలి ప్రస్తుతమున్న కౌల్దారిచట్టాలు ఎలా లోపభూయిష్టంగా ఉన్నవో, ఆ మూలంగా భూస్వాములు కౌలుదార్లను పెద్దయెత్తున ఎలా బేదఖలు చేస్తున్నారో సోదాహరణంగా వివరించడం అవసరం భూస్వాములకు అనుకూలంగా వ్యవహరిస్తున్న ప్రస్తుత పరిపాలనా యంత్రం వల్ల వాటిల్లిన కష్టనష్టాలను కూడా సోదాహరణంగా తెలియజేయాలి.

అనంతపురంజిల్లా నూతన కమ్యూనిస్టు సమితి కార్యవర్గం

అనంతపురం, ఆగస్టు 31

ఇటీవల బుక్కపట్నంలో జరిగిన అనంతపురంజిల్లా 6వ కమ్యూనిస్టు పార్టీ మహాసభలో 11 మందితో కూడిన క్రింది కార్యవర్గం ఎన్నికైంది

శ్రీ వి కె ఆదినారాయణ రెడ్డి (కార్యదర్శి), శ్రీ నీలం రాజశేఖరరెడ్డి శ్రీ [illegible], శ్రీ బి గోపాలప్ప, కొండాధికారి, శ్రీ సి ముత్యాలప్ప (ఈ అయిదుగురూ సెక్రటేరియట్ సభ్యులు) శ్రీ బి టి పక్కీరప్ప శ్రీ బి. ఎర్రిస్వామి, శ్రీ ఎస్. గణేనాయక్, శ్రీ పి వెంకటనారాయుడు, శ్రీ టి రంగన్న, శ్రీ పి. ఎస్ శర్మ

భారత పాకిస్తాన్ అధికారులసమావేశం

న్యూఢిల్లీ, ఆగస్టు 31

ఇటీవల చేసుకొన్న భారత - పాకిస్తాన్ ఒడంబడిక ప్రకారం సరిహద్దు రేఖను నిర్ణయించేందుకుగాను వివాదగ్రస్తంగానున్న నదిపై సరిహద్దు స్తంభాల పరిశీలనను పూర్తిచేయడానికి గత సోమవారం నాడు భారత - పాకిస్తాన్ అధికారుల సమావేశం నూలివంకి సమీపంలో జరిగింది

సట్లెజ్ నదిలో వరదల మూలంగా ఇరుపక్షాలకున్న సరిహద్దు స్తంభాలు దెబ్బతిన్నాయని వార్తలు అందాయి. సరిహద్దురేఖ, విభజనలపైన ఇరుపక్షాల వారికి ఒకఅంగీకారం కుదిరింది. తర్వాత సెప్టెంబరు మూడవ వారానికల్లా స్తంభాలను బాగుచేయించి మళ్లీ యథాస్థానాల్లో నాటించడానికి అంగీకరించారు. సెప్టెంబరు పదవ తేదీన ఇరుపక్షాలకు చెందిన ఆర్థిక కమీషనర్ల సమావేశం జరుపడానికి నిర్ణయమైనట్లు తెలుస్తోంది.

మలయా రాజు మరణం

కౌలాలంపూర్, సెప్టెంబరు 1

మలయా రాజు సర్ హిసాముద్దీన్ ఆలమ్ షా ఈ రోజు తెల్లవారఝామున చనిపోయారు ఆయన కొద్ది రోజులనుండి జబ్బుగా ఉన్నారు. వారి వయసు 62 సంవత్సరాలు. మునుపటి రాజు చనిపోయినమీదట ఆయన ఇటీవలనే రాజుగా ఎన్నికయారు.

జెకోస్లొవేకియా ఖండన

ప్రాగ్, ఆగస్టు 31

కాసై రాష్ట్ర పునరాక్రమణ సాగిస్తున్న కాంగో సేనలను జెకోస్లొవేకియా సైనికోద్యోగులు నడుపుతున్నారని బెల్జియన్ చేసిన ప్రచారం పూర్తిగా నిరాధారమని జెకోస్లోవాక్ వార్తాసంస్థ 'సెటెకా' నేడు ప్రకటించింది

కాసై రాష్ట్రపు అధ్యక్షుడనని చెప్పుకొంటున్న అల్బర్ట్ కాలోంజీ కల్పించిన కథలోనే ఈ అపవాదు వేశాడని ఖండించింది

కేంద్ర సర్వీస్ కమిషన్

అనధికార సభ్యుల సంఖ్య పెంచనవసరంలేదని దాతార్

న్యూఢిల్లీ, ఆగస్టు 31

యూనియన్ సర్వీస్ కమిషన్‌లో అనధికార సభ్యుల సంఖ్య పెంచనవసరం లేదనీ, రాజ్యాంగం చట్టంలో చెప్పిన మేరకు ఇప్పటికే సగంమంది అనధికార సభ్యులున్నారనీ హోం వ్యవహారాలశాఖామంత్రి శ్రీ దాతార్ నేడు రాజ్యసభలో అన్నారు

యూనియన్ సర్వీస్ కమిషన్ 1958-59 సంవత్సరానికి అందజేసిన నివేదికపై నేడు రాజ్యసభలో చర్చ జరిగినప్పుడు కొందరు కమిషన్‌లోని అనధికార సభ్యుల సంఖ్య పెంచాలనీ, వారికి పెన్షను ఇవ్వాలనీ సూచించారు

శ్రీ దాతార్ చర్చకు సమాధానమిస్తూ ఇలా అన్నారు

"సర్వీస్ కమిషన్‌లో పరిపాలనానుభవమున్న వ్యక్తులుండడం అవసరం కాబట్టి ఇప్పటికున్న అధికార సభ్యుల సంఖ్య పెంచడానికి వీలులేదు వీరు సర్వీస్‌కమిషన్ సభ్యులుగా వున్న ఆరుసంవత్సరాలూ మంచి జీతం ముట్టుతున్నది. కాబట్టి వీరికి పెన్షన్లు యివ్వనవసరంలేదు.

ఉద్యోగాలకు అభ్యర్థుల ఎన్నికల్లో వ్యక్తిత్వపరీక్షకు ప్రస్తుతమిస్తున్న ప్రాధాన్యం తగ్గించడం అవసరమని కమ్యూనిస్టు నాయకుడు శ్రీ భూపేష్ గుప్త అన్నారు కాని ఈ పరీక్షలకు ప్రాధాన్యం తగ్గించరాదని శ్రీ పణిక్కర్, శ్రీ లింగం (కాం) అన్నారు

కొందరు సాంకేతిక నిపుణుల నియామకం విషయంలో యూనియన్ పబ్లిక్ సర్వీస్‌కమిషన్ అధ్యక్షుడే స్వయంగా విదేశాలకువెళ్ళి అభ్యర్థులను ఇంటర్వ్యూచేసిన సంఘటన చర్చల్లో ప్రస్తావనకు వచ్చింది శ్రీ భార్గవ (కాం) ఇందుకు కమిషన్ అధ్యక్షుని విమర్శిస్తూ, ఇది ప్రభుత్వం డబ్బువృథాగ చేయటమే కాక, కమిషన్ అధ్యక్షుడు చేయదగనిపని అని అన్నారు

పాకిస్తాన్‌లో లంచగొండితనం

పెచ్చు పెరిగినందుకు బ్రోహీ విచారం

న్యూఢిల్లీ, ఆగస్టు 31

పాకిస్తాన్ ఏర్పడిన అతిస్వల్పకాలంలోనే లంచగొండితనం పెచ్చుపెరిగి, దేశం దిగజారిపోవడం ప్రారంభమైంది అని భారతదేశంలో పాకిస్తాన్ హైకమిషనరు ఏ కె బ్రోహీ అన్నారు.

కష్టించి పనిచేయడం, నిస్వార్థ కృషిద్వారానే పాకిస్తాన్ ప్రజలు తమ దేశాన్ని పునర్నిర్మించుకోగలరని ఏ కె బ్రోహీ ఈరోజు ఒకసభలో ప్రసంగిస్తూ అన్నారు.

ఆయన ఇంకా ఇలా అన్నారు:

ఆర్థిక, ఆధ్యాత్మికసమస్యలు భారతదేశానికి తదితర అనేక దేశాలకు ఒకటే. పదమూడు సంవత్సరాలక్రింద పాకిస్తాన్ ఉన్నత ఆశయాలతో అవతరించింది కాని అతిస్వల్పకాలంలోనే దేశంలో లంచగొండితనం ప్రబలిపోయింది దిగజారుడుతనం ప్రారంభమైంది మళ్ళీ తన ఆశయాల్లో ఎప్పుడు జయప్రదమౌతుందనేది ఆ దేశ ప్రజల కృషిపై ఆధారపడి వున్నది

వ్యక్తిగత ఆధిక్యతను విమర్శించే జాతితో నేను ఏకీభవించలేను. ఎందుకంటే ప్రముఖ వ్యక్తులు జాతీయ జీవనాన్ని మలిచిన ఘటనలు అనేకమున్నాయి అలాంటి ప్రముఖ వ్యక్తులు తమ దేశ ప్రజలపైనేగాక ఇతర దేశాల ప్రజలపైకూడ గొప్ప ప్రభావాన్ని కలిగించగలరు

సభకు లోక్‌సభ స్పీకరు శ్రీ అనంతశయనం అయ్యంగారు అధ్యక్షత వహించారు సభకు కేంద్రమంత్రులు, పార్లమెంటు సభ్యులు హాజరయ్యారు.

నవ్యాంధ్ర సాహిత్య వీధులు

శ్రీ తెన్నేటి ప్రసంగం

విజయవాడ, సెప్టెంబరు 1

సరస్వతీ సామ్రాజ్యం వారి ఆధ్వర్యాన నిన్న సాయంత్రం యిచ్చట దివ్యజ్ఞాన సమాజ మందిరంలో జరిగిన సమావేశంలో శ్రీ తెన్నేటి విశ్వనాథంగారు 'నవ్యాంధ్ర సాహిత్యవీథులు' అనే అంశంపై ప్రసంగించారు

ఇప్పుడు వస్తున్న గేయకవిత్వం, నాటకాలు, కథలను గురించి తమ ప్రసంగంలో విమర్శించారు

గిరీశంలాంటి పాత్రలను సృష్టించాలని సూచించారు. పత్రికారచన మెచ్చదగినదిగా ఉంటోందన్నారు వార్తలను సాహిత్య సంధానంగా వ్రాస్తున్నందుకు పత్రికలను అభినందించారు

శ్రీ అయ్యంకి వెంకటరమణయ్యగారి వందన సమర్పణతో సభ ముగిసింది

(వి. వి)

జోర్డాన్ రాజధాని అమ్మాన్‌లో మొన్న జరిగిన బాంబు ప్రేలుడు ఐక్య అరబ్ రిపబ్లిక్ ప్రోత్సాహంతో జరిగిందని జోర్డాన్ రాజు ఆరోపించారు.

కేరళలో ప్రాంతీయ విభేదాలు పెంచుతున్న ప్రభుత్వచర్యలు

త్రిచూరు బహిరంగసభలో మాజీముఖ్యమంత్రి శ్రీ ఇ యం. యస్. నంబూద్రిపాద్ హెచ్చరిక

త్రిచూర్, ఆగస్టు 31

కేరళలోని ప్రస్తుత ప్రజాసోషలిస్టు - కాంగ్రెస్ మిశ్రమ మంత్రివర్గం అధికారంలోకి వచ్చి ఆరునెలలయినా ప్రజల సమస్యలను పరిష్కరించడంలో పూర్తిగా విఫలమయిందని కేరళ మాజీ ముఖ్యమంత్రి శ్రీ ఇ. యం. యస్. నంబూద్రిపాద్ నేడిక్కడ ఒక బహిరంగసభలో విమర్శించారు.

ఈ సభను త్రిచూరు జిల్లా కమ్యూనిస్టు కమిటీ ఏర్పాటు చేసింది

శ్రీ నంబూద్రిపాద్ ఇంకా ఇలా ఉపన్యసించారు

"చేయాలనే కోరిక, ధైర్యమూ ఉంటే ప్రసో - కాంగ్రెసు మిశ్రమ మంత్రివర్గం అనేక సమస్యలను పరిష్కరించగలిగేది కాని వారు తమఅస్తిత్వం కోసం కొట్లాడుతూ స్వార్థపరులను సంతృప్తి పర్చాలనుకొంటున్నారు ఆ కారణంగా తమ విధులు నిర్వర్తించటంలో విఫలమయ్యారు రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలమధ్య ఏర్పడ్డ విభేదాలకు కాంగ్రెస్-ప్రసో పార్టీల నాయకులే పూర్తి బాధ్యులు ప్రభుత్వం తొందరపడి సమర్థులైన సభ్యుల్ని మార్చడమే మలబార్ ప్రాంతంలో అపనమ్మకమూ, అసంతృప్తి ఏర్పడటానికి ప్రధాన కారణం

"మలబార్ ప్రాంతంలోని కాంగ్రెస్, ప్రసో. పార్టీ, ముస్లిం లీగు శాసనసభ్యులు "మలబారుకు న్యాయం" జరగాలని హోంమంత్రికి డిమాండు చేస్తున్నారు

మలబారు, తిరువాంకూరు, కొచ్చిన్ ప్రాంతాల ఉద్యోగసమస్యపైనే మంత్రివర్గం చీలిఉంటే, ఇక ఈ ప్రాంతాలమధ్య భావసమైక్యత నుఎక్కడ సాధించగలుగుతుందో బోధపడకుండా ఉంది

"మలబార్ నిర్లక్ష్యం చేయబడింది. దానివంతు దానికి వెళ్ళాలి" అనేది కమ్యూనిస్టుపార్టీ ఉద్దేశం కాదు. ఒక్క మలబారే కాదు, రాష్ట్రంలోని ప్రతి అంగుళాన్నీ ప్రభుత్వం ఒకే పద్ధతిపై పరిపాలించాలి

"ప్రభుత్వం అన్ని తరగతుల ప్రజలకూ, అన్ని ప్రాంతాలకూ న్యాయం చేయలేకపోతే దాని దుష్ఫలితం తీవ్రంగా ఉంటుంది. సివిల్‌సర్వీసులో అసంతృప్తి ఏర్పడితే రాష్ట్రానికి తీరని నష్టం కేరళ ప్రజలు హతాశులైతే అతి దురదృష్టకరమైన అస్సాం ఘటనల వంటివి ఇక్కడా తలెత్తవచ్చు" అని శ్రీ నంబూద్రిపాద్ హెచ్చరించారు

తర్వాత పాలై సెంట్రల్‌బ్యాంకు విషయం ప్రస్తావించి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలచర్యలను కమ్యూనిస్టుపార్టీ పూర్తిగా బలపర్చిందన్నారు అయితే మున్ముందు ఇట్టివి జరగకుండా ఉండటానికి గాను భారత ప్రభుత్వం బ్యాంకుల్ని జాతీయంచేయడం అవసరమన్నారు.

కేరళ వ్యవసాయ సంబంధాల బిల్లుకు రాష్ట్రపతి సూచించిన సవరణలను మంత్రివర్గం ఆమోదిస్తే ఆ బిల్లు ద్వారా రైతులకు సంక్రమిస్తున్న అనేక హక్కులు ఎగిరిపోతాయన్నారు.

అస్సాంలో స్త్రీలపై అత్యాచారాలు

న్యాయ విచారణ జరపమని ప్రధానికి మహిళా సంఘాల విజ్ఞప్తి

న్యూఢిల్లీ, సెప్టెంబరు 1

ఇటీవల అస్సాం అల్లరులలో స్త్రీలపైన, పసిపిల్లలపైన జరిగిన అత్యాచారాలను గురించి న్యాయవిచారణ జరపాలని కోరుతూ వివిధ మహిళా సంఘాలకు చెందిన 30 మంది ప్రతినిధులు నేడు ప్రధాన మంత్రికి ఒక విజ్ఞప్తి పత్రం సమర్పించారు

సంయుక్త మహిళా సహాయ సంఘ ఈ రాయబారవర్గానికి ఢిల్లీ మాజీ మేయరు శ్రీమతి అరుణ అసఫాలీ నాయకత్వం వహించింది

అస్సాంలో పరిస్థితినీ, ముఖ్యంగా సంక్షోభిత ప్రాంతాలలోని స్త్రీల బాలబాలికల పరిస్థితిని గురించి వీరు ప్రధాన మంత్రితో చర్చించారు

ఈ రాయబారవర్గంలో, భారత జాతీయ మహిళా సమాఖ్య అధ్యక్షురాలు శ్రీమతి అనసూయ జ్ఞానచంద్ శ్రీమతి కళ్యాణీ భట్టాచార్య మొదలగు వారున్నారు.

వీరు చెప్పిన విషయాలు ప్రధాన మంత్రి సావధానంగా విని, వీటిని సానుభూతితో పరిశీలిస్తానని అన్నారు

హైద్రాబాదునుంచి బస్సుల వేళలు

హైద్రాబాద్, ఆగస్టు 31

ఆర్. టి. సి వారి జగత్యాల్ డీలక్సుబస్సు సెప్టెంబరు 1 లగాయతు హైద్రాబాద్‌డిపోనుంచి మధ్యాహ్నం 2-30 గంటలకు బదులు మూడుగంటలకు బయలుదేరుతుంది హైద్రాబాద్ నుంచి సిద్దిపేటకు సాయంత్రం 6 గంటలకు బయలుదేరేబస్సు, సిద్దిపేటలో ఉదయం 6 గంటలకు బయలుదేరి రాత్రి 9-30కి హైద్రాబాద్‌వచ్చేబస్సు రద్దుచేశారు.

(వి వి.)

అస్సాంలో నిషేధాజ్ఞలు

షిల్లాంగ్, ఆగస్టు 31

రేపటినుండి ప్రారంభంకాబోతున్న విద్యార్థుల కోర్కెల వారోత్సవాన్ని కామరూప్, సిబిసాగర్ జిల్లాలలో ఆయా జిల్లాల మేజస్ట్రేట్లు నిషేధించారు.

సభలనూ, ఊరేగింపులనూ, ప్రదర్శనలనూ విద్యార్థులుబహిరంగంగా నిర్వహించడాన్ని నిషేధించవలసిందిగా జిల్లా మేజిస్ట్రేట్లకు ఆజ్ఞలను జారీచేశామని అస్సాం హోంమంత్రి శ్రీ ఫక్రుద్దీన్ పత్రికా విలేకరులకు తెలియజేశారు.

మలకాపురం బోర్డు ఎన్నికలు

కాంగ్రెసుతో పోటీచేసిన గ్రామమండలి ఘనవిజయం

విశాఖపట్నం, ఆగస్టు 31

విశాఖపట్నం తాలూకా మలకాపురం మేజర్ పంచాయతీ ఎన్నికలలో గ్రామమండలి కాంగ్రెసుతో ముఖాముఖి పోటీచేసి విజయం పొందింది. మండలిఅభ్యర్థులు ఏడుగురు, కాంగ్రెస్ అభ్యర్థులు యిద్దరు గెలిచారు.

గెలుపొందిన అభ్యర్థుల పేరు: శ్రీ యం [illegible] రామారావు (గ్రా మం), కొట్ల సింహాచలం (కాం), ఏడూరు చిన్నయ్య (కా) భోగవిల్లి చిన్నయ్య (గ్రా మం) బత్తిన ఎర్రయ్య (గ్రా మం), పావడ అప్పన్న (గ్రా మం), పోతిన సన్యాసిరావు (గ్రా మం), బీశెట్టి సన్యాసినాయుడు (గ్రా మం), వరాలశెట్టి రామునాయుడు (గ్రా మం)

గ్రామ మండలిలో కమ్యూనిస్టులు కూడ ఉన్నారు వీరిలో శ్రీ పోతిన సన్యాసిరావు గారు ఒకరు. వీరు కణితి పంచాయతీ సమితి ఉపాధ్యక్షులు.

తాలూకా కాంగ్రెసు నాయకులు ఈ ఎన్నికలలో కేంద్రీకరించి పనిచేశారు ఈ పంచాయతీని ఎలాగైనా ప్రతిపక్షం చేతుల్లోకి పోకుండాచేయాలని చూశారు. (వి. వి)

హెచ్.ఎస్.సి; హైయర్ సెకండరీ పరీక్షలు

హైద్రాబాద్, ఆగస్టు 31

తెలంగాణా ప్రాంతంలోని హెచ్ యస్ సి, హైయర్, సెకండరీ (మల్టీపర్పస్) స్కూల్ సర్టిఫికెట్ (హీక్సీ) సప్లిమెంటరీ పరీక్షలు అక్టోబరు 24వ తేదీనుంచి ప్రారంభమౌతాయి.

(వి వి)

ఎం. ఫార్మ్, డిగ్రీ పరీక్షా ఫలితాలు

వాల్తేరు, ఆగస్టు 31

1960 జూన్‌లో ఆంధ్ర విశ్వవిద్యాలయంవారు నిర్వహించిన ఎం ఫార్మ్ డిగ్రీ పరీక్షల్లో ఈదిగువ రిజిస్టరునంబర్లుగల అభ్యర్థులు ఉత్తీర్ణులైనారు.

బ్రాంచి I ఫుడ్, డ్రగ్స్, వాటర్

(న్యూరెగ్యులేషన్)

ప్రథమశ్రేణి ఎవరూలేరు.

ద్వితీయశ్రేణి. 556 558.

557 నంబరు ఫలితం తర్వాత ప్రకటించబడుతుంది.

(ఓల్డు రెగ్యులేషన్)

ప్రథమ శ్రేణి. ఎవరూ లేరు.

ద్వితీయశ్రేణి ఎవరూలేరు

బ్రాంచి II మాన్యుఫాక్చర్ ఆఫ్ ఫార్మస్యూటికల్స్ అండ్ ఫైన్ కెమికల్స్

ప్రథమశ్రేణి 568 మాత్రమే.

ద్వితీయశ్రేణి. 562 564 565.

లావోస్ కొత్త మంత్రివర్గానికి కాంగ్‌లీ ఆక్షేపణ

వియంటియాను, ఆగస్టు 31

మునుపటి పశ్చిమరాజ్యాల అనుకూల మంత్రివర్గంలోని కొంతమందిని కలుపుకొని సోవన్నా ఫూమా నిన్న ఏర్పరచిన కొత్త మంత్రివర్గానికి తన పూర్తి వ్యతిరేకతను తెలుపుతూ కాంగ్‌లీ నేడు రాజధాని వియంటియానులో ఒక ప్రకటన చేశారు.

ఆగస్టు తొమ్మిదవ తేదీన వియంటియానులో జరిగిన విప్లవానికి కాంగ్‌లీ నాయకత్వం వహించిన విషయం పాఠకులకు తెలిసినదే ఆ విప్లవం ఫలితంగా మునుపటి మంత్రివర్గం పతనమయింది

"పాత మంత్రివర్గంలోని వారు కొత్త మంత్రివర్గంలో ఉండటం మాకు ఇష్టంలేదు ఈవిషయాన్ని తెలుపుతూ సోవన్నా ఫూమాకు ఒక సందేశం పంపాను. దానికి ఇంకా జవాబు రాలేదు" అని కాప్టన్ కాంగ్‌లీ విలేకరులకు తెలిపారు

ఆ తరువాత ఆయన ఒక రేడియో ప్రసంగం గావిస్తూ, "కొత్తప్రభుత్వంలోని ద్రోహులను తొలగించివేయవలసిందిగా సోవన్నా ఫూమాకు విజ్ఞప్తి చేశారు

"జనరల్ ఫౌమి నోసవాన్, ఇన్ పెంగ్ సూర్యదే లాంటి ద్రోహులను అధికారస్థానాల్లో ఉండనివ్వడంకన్నా మా ఎనిమిదివందలమంది [illegible] సైనికులమూ ప్రాణాలర్పించడానికయినా సిద్ధంగా ఉన్నాము"ని ఆయన ఆ ప్రసంగంలో తెలిపారు.

జనరల్ నోసవాన్ మునుపటి రక్షణశాఖామంత్రి ఆగస్టు తొమ్మిది విప్లవంతరువాత ఇతను విప్లవప్రతీఘాతక తిరుగుబాటును లేవదీసి, వియంటియాను పైకి దాడికి సిద్ధమయ్యాడు తరువాత ప్రస్తుత ప్రధాని సోవన్నా ఫూమా జరిపిన సంప్రతింపుల ఫలితంగా, ఇతను తన తిరుగుబాటును మానుకొన్నాడు ప్రస్తుత నూతన మంత్రివర్గంలో ఇతను ఉపప్రధానీ, అంతరంగిక శాఖ, సాంస్కృతికశాఖ మంత్రి కాంగ్‌లీ ద్రోహిగా పేర్కొన్న రెండవ వ్యక్తి ఇన్ పెంగ్ సూర్యదే, ప్రస్తుత మంత్రి వర్గంలో ఆర్థికశాఖ మంత్రి కొత్త మంత్రి వర్గంలో ఉన్న పాత మంత్రులలో కాంగ్‌లీ తన ప్రసంగంలో ఈ ఇద్దరినే పేర్కొన్నారు మిగతా ముగ్గురి విషయంలో పట్టు పట్టలేదు

లువాంగ్ ప్రబాంగ్‌లో సమావేశమయిన జాతీయ సభ కొత్త మంత్రివర్గాన్ని ఏకగ్రీవంగా ఆమోదించింది

ఆ వెనువెంటనే ప్రధాని సోవన్నా ఫూమా, నిన్న సంజె బయలుదేరి, కెప్టన్ కాంగ్‌లీతో చర్చలకోసం వియంటియానుకే వచ్చారు.

విప్లవ నాయకులకు నచ్చచెప్పగలనని నమ్మకం తన కున్నదని ఆయన రాగానే విలేకరులతో అన్నారు ఆయన రేపు తిరిగి లువాంగ్ ప్రబాంగ్ వెళ్ళబోతున్నారు.

తూర్పు జర్మనీ ప్రభుత్వ చర్యలపై పశ్చిమ రాజ్యాల ఆగ్రహం

బెర్లిన్, ఆగస్టు 31

అయిదురోజులపాటు తూర్పుబెర్లిన్‌లోకి పశ్చిమ జర్మన్లను ఎవ్వరినీ రానివ్వకుండా తూర్పు జర్మనీ ప్రభుత్వం కట్టుదిట్టాలు చేసినందుకు, పశ్చిమ బెర్లిన్‌లోని మూడు పశ్చిమ దేశాల సైనికాధికారులూ, సోవియట్ సైనికాధికారికి తమ నిరసనను తెలిపారు

బెర్లిన్‌లో స్వేచ్ఛాయానం హక్కుకిది భంగకరమని వారు ముగ్గురూ కలిసి ఒక ప్రకటన చేశారు

తూర్పు జర్మనీ ప్రభుత్వ ఉత్తర్వులను ఖండిస్తూ పశ్చిమ జర్మనీ ప్రభుత్వం కూడా ఒక ప్రకటన చేసింది

అమెరికా విదేశ సహాయనిధికి దరిదాపు అరువదకోట్ల డాలర్లు చేర్చడానికి అమెరికా కాంగ్రెసు అంగీకరించింది

కాసైరాష్ట్ర పరిస్థితిని గురించి విద్రోహుల ప్రచారం

ఎలిజబెత్‌విల్లీ, ఆగస్టు 31

కాసైరాష్ట్ర ముఖ్యపట్టణం బాక్వాంగాను తమసేనలు కాంగో కేంద్ర ప్రభుత్వసేనలను వెనక్కి తరిమి కొట్టాయనీ, పరిన్ని నగరాలను కూడా పునరాక్రమించుకున్నాయనీ, ఆ రాష్ట్ర ప్రధానినని చెప్పుకొంటున్న జోసఫ్ ఎన్‌గాలులా, అధ్యక్షుడనని చెప్పుకుంటున్న ఆల్బర్ట్ కాలోంజీలు నేడొక పత్రికాగోష్ఠిలో తెలిపారు.

వీరు ఈ పత్రికాగోష్ఠిని కాటంగా రాష్ట్ర ముఖ్యపట్టణమయిన ఎలిజబెత్‌విల్లీలో జరిపారు

తమ సైనికులకు నాటు తుపాకులు తప్ప మరేమీలేవనీ, వీటితోనే వారు లుముంబా సేనల్ని పారద్రోలారనీ, అందులోనూ 120 మంది నాలుగువందల మందిని ఓడించారనీ, ఎన్‌గాలులా చెప్పారు లుముంబా సేనల్ని చెకోస్లొవేకియా సైనికాధికారులు నడుపుతున్నారని కూడా ఆరోపించారు

ముఖ్యంగా కాటంగా రాష్ట్ర ఉత్తర సరిహద్దు సమీపంలోని నగరాలను తమ సైనికులు తిరిగి ఆక్రమించుకున్నారట కాని, ఆ సరిహద్దు ప్రాంతములోనున్న కాబిందా, సెంరి నగరాలు లుముంబా సేనల స్వాధీనం లోనే ఉన్నాయని ఒప్పుకొన్నారు

ఐక్యరాజ్యంలో లుముంబా సైనికులు తమ 'మంత్రివర్గం'లోని పబ్లిక్ వర్క్స్ మంత్రిని చంపారనీ, మామూలు పౌరులనుకూడా కొందరినీ చంపారనీ అతనన్నాడు

ఇటీవల బక్వాంగా నగరాన్ని లుముంబా సేనలు ఆక్రమించుకున్నది మొదలుగా కాసైరాష్ట్రం గురించిన వార్తలు కాటంగా రాష్ట్రంలో ద్రోహి మోయిస్ షోంబే 'ప్రభుత్వా'నికి చెందిన బెల్జియం అధికారుల ద్వారా ప్రచార మవుతున్నాయి కాసై రాష్ట్రంలోకి వెళ్ళిన లుముంబా సేనలు చెల్లాచెదరై పోతున్నాయనీ, కాటంగా రాష్ట్రం మీదికి రావాలనే కట్టుదల వాటిలో ఎక్కడా కనబడటంలేదనీ ఈ బెల్జియన్ అధికారులు గత రాత్రే ఒక ప్రచారం ప్రారంభించారు.

ముఖ్యమంత్రి వెంటనే రాజీనామా ఇవ్వాలి

బందరు, ఆగష్టు 29

రాష్ట్ర కాంగ్రెస్ కమిటీ మెజారిటీ సభ్యుల విశ్వాసాన్ని ముఖ్యమంత్రి, రాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షులు కోల్పోయారు గనుక వారు తమ పదవులకు వెంటనే రాజీనామా ఇవ్వటం న్యాయమని కృష్ణాజిల్లా సోషలిస్టు పార్టీ కార్యదర్శి శ్రీ కూనాటి బాలకోటేశ్వరరావుగారు ఒక ప్రకటన చేశారు.

రేడియో

శనివారం, సెప్టెంబరు 3
శక 1882, భాద్రపద 12

విజయవాడ

357.1 మీ (840 కిలోసై)

ఉదయం 6-30 శుభోదయం, ప్రసార విశేషాలు - అఖండ గౌతమి (బాపుర) పద్య పఠనము; 6-40 భక్తిరంజని కార్యక్రమం: దండకం: డి. కె. పట్టమ్మాళ్, 7-0 తె. వా., 7-15 వీణ, 7-45 సంగీత శిక్షణ, 8-0 ఆం. వా., 8-15 హిం. వా.; మధ్యాహ్నము 12-30 కార్మికులకు (హై. రిలే), 1-0 'వనితా వాణి', 1-30 గాత్ర సంగీతం, 1-50 తె. వా., 2-0 పిల్లలకు సంగీత శిక్షణ - చిలకపలుకులు, 2-30 బొమ్మరిల్లు - పిల్లల కార్యక్రమము, సాయంత్రం 6-0 స్థానిక ప్రకటనలు, 6-5 ప్రాం. వా.; 6-15 గ్రామస్థులకు, 7-0 తె. వా., 7-15 గ్రామస్థులకు, 7-30 పుస్తక సమీక్ష - అవసరాల సూర్యారావు, 7-40 ఫిల్మ్ సంగీతం, 8-0 వీణ, 8-30 రేడియో న్యూస్‌రీల్ [ఢి. రి], 8-40 లలిత సంగీతం, 9-0 ఆం. వా., 9-15 హా. వి. వలె, 9-30 అఖిల భారత సంగీత కార్యక్రమము - [ఢి. రి], 11-0 సమాప్తి.

హైదరాబాద్ - ఎ

405.4 మీ (740 కిలోసై)

ఉదయం 6-30 సుప్రభాత్ - కార్యక్రమ వివరణ, 6-40 భక్తిరంజని (వి. రి), 7-0 తె. వా.; 7-15 విజయవాడ వలె; 7-40 సంగీత శిక్షణ, 8-0 ఆం. వా., 8-15 హిం. వా., 8-30 బాలానందం - చిన్నపిల్లల కార్యక్రమము, మధ్యాహ్నం 12-30 కార్మికులకు, 1-0 'వనితా వాణి' (వి. రి), 1-30 లలిత సంగీత్, 1-50 తె. వా., 2-0 శాస్త్రీయ సంగీత్, 2-10 ఉ. వా., 2-20 బొమ్మరిల్లు [వి. రి], సాయంత్రం 6-0 స్థానిక ప్రకటనలు, 6-5 ప్రాం. వా., 6-15 'నగర వాణి' సూగాడ్డ కొండ ప్రసంగం, 7-0 తె. వా.; 7-15 స్త్రీల కవిత [ఉర్దూ], 7-30 విజయవాడ వలె, 7-40 ప్రసంగం [ఉర్దూ], 7-50 శ్రోతల కోర్కెలు ..., 8-10 వివాహ సంగీతం, 8-15 బెంగాలీ ఖయాల్; 8-30 రేడియో న్యూస్ రీల్ [ఢి. రి], 8-45 సుగమ్ సంగీత్, 9-0 ఆం. వా., 9-15 ఉ. వా., 9-30 అఖిల భారత సంగీత కార్యక్రమం [ఢి. రి], 11-0 సమాప్తి.

హైదరాబాద్ - బి

49.02 మీ. [6120 కిలోసై]

ఉదయం 6-30 హై. ఎ. వలె.

30.86 మీ. [9720 కిలోసై]

మధ్యాహ్నం 12-30 హై. ఎ వలె, 2-10 వయొలిన్ నిలయ విద్వాంసుడు, 2-20 హై. ఎ వలె;

60.12 మీ. [4990 కిలోసై]

సాయంత్రం: 6-0 హైదరాబాద్ ఎ వలె, 6-15 గ్రామస్థులకు, 7-0 తె. వా., 7-15 గ్రామస్థులకు, 7-30 హై. ఎ వలె, 7-40 లలిత్ సంగీత్, 7-50 హై. ఎ వలె, 9-15 అగ్ని వదిలేసుకున్నాను - నాటిక; 9-30 హై. ఎ. వలె, 11-0 సమాప్తి.

మద్రాస్ - బి

211.8 మీ (1420 కిలోసై)
41.32 మీ (7260 కిలోసై)

ఉదయం 6-55 మంగళగానం, 7-0 తె. వా., 7-15 'సుప్రభాతమ్' సంస్కృత కార్యక్రమం - శాకుంతలమ్ నాటిక (చతుర్థాంకం), 7-30 వాసా కృష్ణమూర్తి వీణ, 8-0 ఆం. వా.

211.8 మీ (1420 కిలోసై)
41.32 మీ (7260 కిలోసై)

మధ్యాహ్నం 1-0 ఓణం ప్రత్యేక కార్యక్రమం [మలయాళం], 1-30 ఆం. వా., 1-40 గీతమాలిక, 1-50 తె. వా., 2-0 మధురగీతం, 2-10 'ముత్తుక్కువియల్' పిల్లల కార్యక్రమం (తమిళం),

211.8 మీ (1420 కిలోసై)
60.98 మీ (4920 కిలోసై)

సాయంత్రం 5-30 పాశ్చాత్య సంగీతం, 5-50 స్థానిక ప్రకటనలు, వాణిజ్య వార్తలు [ఆంగ్లం], 6-0 ఆం. వా., 6-5 ప్రాంతీయ మెడికల్, 6-15 కార్యక్రమ వివరణ [తమిళం], 6-20 టి. పి. శివశంకరన్. వేణువు, 7-0 తె. వా., 7-15 సంగీతమాల, 7-30 పెరియ అయ్య - నాటిక హిందీ మూలం ఆర్ డి శుక్ల, 8-0 ఎస్ పార్థసారథి వయొలిన్, 8-30 పి. ఎస్. నారాయణస్వామి, 9-0 ఆం. వా., 9-15 డెవలప్‌మెంట్ ప్లాన్స్ ఆఫ్ మద్రాస్ స్టేట్ - ప్రసంగం, 9-25 వాద్యసంగీతం, 9-30 పాశ్చాత్య సంగీతం; 11-0 సమాప్తి.

క్షుధార్తులైన క్షామపీడితులు

అన్నం కుండలను ఎత్తుకు పోతున్నారని చిత్తూరుజిల్లా సుగాలీ సంఘం ప్రకటన

పుంగనూరు, ఆగష్టు 31

క్షుద్బాధకోర్వలేని క్షామపీడితులగు ఏనాది, ఎరుకల మున్నగు అనాది జాతులు చాలాచోట్ల ఇండ్లలో జొరబడి వండిన అన్నమును ఎత్తుకొనిపోతున్నారని చిత్తూరుజిల్లా సుగాలీ సంఘంవారు చిత్తూరుజిల్లాలోని క్షామ పరిస్థితులపై ఒక ప్రకటన చేస్తూ తెలియజేశారు.

ఆ ప్రకటనలో యిలా వుంది:

"గత 3, 4 ఏండ్లుగా రాయలసీమలో కలిగిన వర్షాభావం వల్లను, ఈ సంవత్సరం కూడా వర్షములు లేనందువల్లనూ ఏర్పడిన వాతావరణ పరిస్థితులవల్లను తరతరాలుగా దరిద్రభారంతో కృంగుచున్న వెనుకబడిన హరిజన, గిరిజన, లంబాడి, ఏనాది, ఎరుకల, దొమ్మరి, పిచారి, సుగాలీ మొదలగు జాతులప్రజలు జిల్లా అంతటా గుంపులుగుంపులుగా గ్రామాల్ని వదలి రోజుకొక పూట పస్తులుంటున్నారు. అడవులమీద పడి కడుపుకక్కుర్తికై కలబంద, ఈత దుంపలూ మొదలైన కందమూలాదులూ, చెట్లాకు, బచ్చలఆకు మొదలైన కలములాకు తింటూ ప్రాణాల్ని నిలబెట్టుకుంటున్నారు. ఈ కందమూలాదులూ, ఆకులలములు కూడా అడవుల్లో 2-3 మైళ్ళు వెళ్ళితేగాని దొరకటంలేదు. గ్రామాల్లోని వీరవైతులుసైతం నీటికై ఎగబడుతున్నారు. వేయించి పొట్టు తీసిన చింతగింజల్ని మధ్యతరగతి ప్రజలు చాటుమాటుగా తినాల్సివచ్చింది.

ఇంకా 10 రోజుల్లో మంచివర్షం పడకపోతే ఇక్కచిక్కిన కుటుంబాలు జిల్లాలో కనీసం 8 లక్షలదాకా చచ్చేందుకు సిద్ధంగా వున్నవి. దుర్భరక్షామం మూలంగా సామాన్య ప్రజానీకంలో నిరాశ, అసూయ, క్రోధావేశాలు ఏర్పడుతున్నాయి. కూలీలకు పనులులేవు. జనులకు చేతిలో కాసులేదు. జీవితావసరాలైన ధాన్యాదుల ధరలు ఆకాశాన్నంటిపోయినై. బజార్లలో అవీ దొరకటం దుర్లభంగావుంది.

వీరు తమ సంతానాన్ని ఏ కానుకు రూపాయలకో అమ్మివేసి కార్వార్ ప్రాంతానికి కూలీలుగాను వెళ్ళుతున్నట్లు వార్తలు చేరుతున్నవి. ఆకలి, దప్పి ఈ రెండింటితోపాటు చిల్లర దొంగతనాల వార్తలు కూడా వినిపిస్తున్నాయి జిల్లాలోని అన్ని ప్రాంతాల నుంచి.

ఆకలిగొన్న వ్యక్తులు చాలాచోట్ల యిండ్లలో జొరబడి వండిపెట్టుకున్న అన్నాన్ని సైతం కుండలతోసహా ఎత్తుకొనిపోతున్నారు. మాజీ నేరస్థ జాతికి చెందిన ఏనాది, ఎరుకల, సుగాలీ దొమ్మర కుటుంబాలు పల్లెలమీదుగా భిక్షకై తిరుగుతున్న సందర్భాల్లో, అక్కడక్కడ జరుగుతున్న చిల్లర దొంగతనాలకు వీరేబాధ్యులుగా (నేరం చెయ్యకపోయినా ఆ గ్రామంలో ఆ దినం మకాం పెట్టినందువల్ల) ఆయా గ్రామ పెద్దలూ, స్థానిక పోలీసులూ యెంచుతున్నారు.

జిల్లాలోని దాదాపు 8, 9 లక్షల మందికి ప్రస్తుతం పనులులేవు. వెంటనే ప్రభుత్వ సైనిక శాఖలనివారి చేత పల్లెల్లో త్రాగునీటికి తగిన ఏర్పాట్లు, లారీలద్వారా పశుగ్రాసము సరఫరా, ప్రతి ఫిర్కా కేంద్రములో చౌకధాన్యపు డిపోలు, చెరువుల మరమ్మత్తులు, నీటి వనర్ల రిపేర్లవంటి కార్యక్రమాలను ఆచరణలోకి తేవలసియున్నది."

బజారు ధరలు

విజయవాడ, సెప్టెంబరు 1
(మధ్యాహ్నం 1 గంట)

			రూ. అ. పై.
బంగారం			
మేలిమి	పొట్లు		134 4 0
	మారక		134 0 0
	వరహము		88 12 0
వెండి. 100 తులములు			228 0 0
1 తులము			2 4 0
ధాన్యం			
14 నెంబరు			రూ 32 0 0
కంకరన్నాలు			29 8 0
12 నెంబరు			28 12 0
అక్కుళ్లు			28 8 0
కుసుమ			28 8 0
బియ్యం			
14 నెంబరు			73 0 0
కంకరన్నాలు			69 0 0
12 నెంబరు			67 8 0
అక్కుళ్ళు			65 0 0
కుసుమ			65 0 0
అపరాలు			
మినుములు 240 సేరు			58 4 0
కందులు		40/-	44 0 0
పప్పుసెనగ [పూనాసి]			50 0 0
పచ్చిసెనగలు 230			49 8 0
పచ్చిసెనగలు (కొత్తవి)			49 0 0
పెసలు (తేరాలి)			50 0 0
" (పంటనాలు)			48 0 0
వేరుశనగలు 26సేరు		లు55/-	51 0 0
ఉలవలు		41/-	48 0 0
ఉసుమాలు			51 0 0
పంచదార (ఉయ్యూరు)			118.14న.పై
కొబ్బరినూనె డబ్బా			41 12 0
వెల్లుల్లి మణుగు		4 0 0	4 12 0
బెల్లం	"	5 0 0	8 0 0
మిర్చి	"	27/-	30 0 0
పసుపు	"	1 10 0	1 12 0
చింతపండు	"	10-0-0	12 0 0
నువ్వులపొడి	"	25 0 0	28 0 0
వేరుశెనగకాయలు 177 సేరు			
జగ్గయ్యపేట సేరు (పాతవి)			84 0 0
గోనాది సరుకు లేదు			85 0 0
వేరుశెనగపప్పు మేలురకం మణుగు			22 4 0
నెయ్యి 160 తులాలు			27 4 0
కొబ్బరికాయలు 1000			160 0 0
కంతులు 100			128 0 0
డిటో ఫారిన్			121 12 0
కవుడు 2వ పట్టు		13/-	14 0 0
" 3వ పట్టు		14/-	15 0 0

అనావృష్టికి గురైన కొత్తపట్నం పరిసరాలు

ఒంగోలు, ఆగష్టు 30

కొత్తపట్నం, దాని పరిసరాలలో సాగుక్రింద వేసిన వరికి సరిపడేంతనీరు లేనందువల్ల పండుతుందనే ఆశలేదు. దొరువులలో నీటి చెమ్మ లేనందువల్ల పొగాకుతోటలు చల్లడం ఇంతవరకు జరుగలేదు. నీటి కొరతచేత ఉప్పుసంటుగూడ అంతంతమాత్రంగానే ఉంది.

పరీక్షల విధానము: విద్యార్థులసూచనలు

భీమవరం, ఆగష్టు 27

"3వ సంవత్సరం డిగ్రీ చదువుచున్న విద్యార్థులు పార్టు (1) పూర్తిచేసుకుంటేనేగాని గ్రూపుకు అంటే పార్టు (2) పరీక్షకు హాజరవుటకు వీలులేదు. ఇది మూడు సంవత్సరముల డిగ్రీ కోర్సు చదివే విద్యార్థులకు తీరని నష్టము కాబట్టి ఈనిర్ణయమును ఆంధ్ర యూనివర్శిటీ మార్చి అందరూ పరీక్షకు కూర్చొనే అవకాశము కల్పించవలసినదిగా" పశ్చిమగోదావరిజిల్లా విద్యార్థి ఫెడరేషన్ కార్యకర్తల సమావేశంలో తీర్మానించారు.

పశ్చిమగోదావరిజిల్లా విద్యార్థి ఫెడరేషన్ కార్యకర్తల సమావేశము ఆగష్టు 21వ తేదీన శ్రీ జె. మోహన్‌గారి అధ్యక్షతను జరిగినది. సమావేశమునకు ప్రదేశ్ విద్యార్థి ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శి శ్రీ జె. వి. నారాయణరావుగారుకూడా హాజరైనారు. వివిధ కాలేజీలనుండి, హైస్కూల్సునుండి 25 మంది కార్యకర్తలు హాజరైనారు.

జిల్లా కార్యదర్శి శ్రీ యం. వి. కృష్ణారావుగారు గత సంవత్సరము జరిగిన పనిమీద, ఈ సంవత్సరము చేయవలసిన పనిమీద రిపోర్టు ప్రవేశపెట్టారు. చర్చలు జరిగిన తరువాత రిపోర్టును ఆమోదించారు.

తర్వాత శ్రీ వి. రాజగోపాలరావు అధ్యక్షుడుగాను, శ్రీ యం. వి. కృష్ణారావు కార్యదర్శిగాను, శ్రీ వి. వి. వి. నారాయణమూర్తి ఉపాధ్యక్షుడుగాను, శ్రీ కె. శివాజీ సహాయ కార్యదర్శిగాను, మరో ఐదుగురు సభ్యులతో కార్యవర్గం ఎన్నికైంది.

శ్రీ నారాయణరావుగారు ప్రస్తుత విద్యావిధానంపైనా, దాని లోపములపైనా ఉపన్యసించారు.

సమావేశంలో ఈక్రింది తీర్మానములను ఆమోదించారు.

మూడు సంవత్సరముల డిగ్రీ చదువుచున్న విద్యార్థి పార్టు 1లో ఉత్తీర్ణుడు కావలెనని సరాసరి 40/ మార్కులు మరియు ప్రతి సబ్జక్టులోను 35%కంటే తక్కువ రాకూడదు. ఈ విధముగా వచ్చిన విద్యార్థియే ఉత్తీర్ణుడగును. మిగిలినవారు ఉత్తీర్ణులు కారు. ఇది విద్యార్థి విద్యాభివృద్ధికి ఎంతవరకూ కూడా తోడ్పడదు. అందుచే ప్రతి సబ్జక్టులోను 30% కంటే తక్కువ రాకుండగాను, సరాసరి 35 మార్కులు వచ్చే విద్యార్థిని ఉత్తీర్ణుని చేయవలెనని ఈ సమావేశము ఆంధ్ర విశ్వవిద్యాలయము వారిని కోరుచున్నది. పార్టు II లో కూడా సరాసరి మార్కులు 40%నుండి 35%కు తగ్గించవలయునని కూడా ఈ సమావేశము కోరుచున్నది.

అస్సాం కల్లోలాల్లో నిర్వాసితులకు పునరావాసం కల్పించడంలో అస్సాం, పశ్చిమబెంగాల్ రాష్ట్రాల పత్రికలు నిర్వహించవలసిన పాత్ర చాల ఉందని పి. యస్. పి. నాయకుడు శ్రీ గోరె అన్నారు.

వెనుకబడ్డ కులాల ప్రాతిపదిక యధాతథంగా ఉంచాలని పాట్నా సమావేశం విజ్ఞప్తి

పాట్నా, ఆగష్టు 29

ప్రస్తుతమున్న వెనుకబడ్డ కులాల ప్రాతిపదికను యథాతథంగా ఉంచాలని ప్రభుత్వాన్ని అర్థిస్తూ ఈరోజు వెనుకబడ్డ కులాల ప్రతినిధుల సమావేశం యిక్కడ ఒక తీర్మానంచేసింది.

సమావేశానికి బీహారు మాజీ న్యాయశాఖామంత్రి అధ్యక్షత వహించారు.

ప్రస్తుతమున్న ప్రాతిపదికను మార్చడానికి కారణాలేమీ లేవని తీర్మానం తెలియజేస్తూంది.

వెనుకబడ్డకులాల సంఘం ప్రతిపాదించిన నివేదికను ప్రభుత్వం ఆమోదించి, అమలు జరపడానికి వెంటనే చర్యలు తీసుకోవాలని మరొక తీర్మానం కోరుతూంది. బీహారు మాజీ ప్రజారోగ్య శాఖామంత్రి ప్రసంగిస్తూ ఇలా అన్నారు.

ప్రస్తుతమున్న వెనుకబడ్డ కులాల ప్రాతిపదికను అలాగే వుంచాలని ప్రజల్లో అభిప్రాయాన్ని కలుగచేయవలసిన అవసరం ఉంది. ప్రస్తుతమున్న ప్రాతిపదిక రాజ్యాంగంలో నిర్వచించినట్లుగా సాంఘిక, విద్యారంగాల్లో వెనుకబడ్డస్థితి ఆధారంపైనే నిర్ణయించబడింది.

నిత్యపాలనలో మంత్రుల జోక్యం

శ్రీ తెన్నేటి విశ్వనాథం విమర్శ

విజయవాడ, ఆగష్టు 31

"నిత్యపరిపాలనలో మంత్రుల జోక్యం ఎక్కువైంది. అవినీతి, దుర్వ్యయం ప్రభుత్వ యంత్రాంగంలో ఎక్కువైంది" అంటూ ఆంధ్ర ప్రజాపార్టీ నాయకులు శ్రీ తెన్నేటి విశ్వనాథంగారు నేడు యిచ్చట రామమోహన లైబ్రరీహాలులో జరిగిన కృష్ణాజిల్లా ప్రజాపార్టీ సమావేశాన్ని ప్రారంభిస్తూ చెప్పారు.

సమావేశానికి శాసనసభ్యులు శ్రీ పి. తమ్మిరాజు (పిఠాపురం నియోజకవర్గం) అధ్యక్షత వహించారు.

ఆంధ్ర ప్రజాపార్టీ కార్యదర్శి డాక్టర్ ప్రకాశచంద్ర శతపథి సభికులకు స్వాగతం చెప్పారు.

శ్రీ విశ్వనాథంగారు సభను ప్రారంభిస్తూ యిలా ప్రసంగించారు.

"మనకు స్వరాజ్యం వచ్చి 13 సంవత్సరాలైనా, సామాన్య ప్రజలకు జరిగిన మేలు ఏమీ లేదు. పైగా రోజురోజుకూ ధరలు విపరీతంగా పెరిగిపోతున్నాయి. భారత ప్రభుత్వం వెయ్యి కోట్ల రూపాయలకు పైగా అదనంగా పన్నులు వేసింది. రాష్ట్ర ప్రభుత్వము మూడు, నాల్గు కోట్ల రూపాయలకు పైగా పన్నులు వేసింది. వచ్చే 5 సంవత్సరాలలోనూ 1650 కోట్ల రూపాయల పన్ను విధించబోతోంది. కాని, వసూలు చేసిన ఈ ధనం సద్వినియోగం కావటం లేదు. అవినీతి, దుర్వ్యయంగా ఖర్చవుతోంది. నిత్యపరిపాలనలో మంత్రుల జోక్యం ఎక్కువైపోతోంది" అన్నారు.

సమావేశంలో ఈక్రింది తీర్మానాలు ఆమోదించారు.

(1) జిల్లా పరిషత్ పంచాయతీ చట్టానికి, సమితులకు, స్టాండింగ్ కమిటీలకు, సింగిల్ ట్రాన్సఫరబుల్ ఓటింగు పద్ధతిపైన జరిపేందుకువీలుగా చట్టాన్ని సవరించాలి.

(2) కో-ఆప్టు చేసుకున్న సభ్యులు సమితి అధ్యక్షులుగా ఉండకూడదు.

(3) ఎరువుల పంపకంలో జరుగుచున్న అవకతవకల్ని సవరించాలి.

(4) రాష్ట్రంలోని క్షామ పరిస్థితులను విచారించి తక్షణ నివారణ చర్యలు తీసుకోవాలి.

కాంగో ప్రభుత్వానికి అమెరికా నిరసన

లియోపోల్డ్‌విల్లీ, ఆగష్టు 29

మొన్న శనివారంనాడు కాంగోలోని స్టాన్లీవిల్లీ విమానాశ్రయంలో కొందరు కాంగో సైనికులు ఒక అమెరికా విమానంపై దాడిచేసి అందులోని వారిని పట్టుకు కొట్టినందుకు కాంగో ప్రభుత్వానికి తీవ్ర నిరసన తెలియజేయడానికి అమెరికా ప్రభుత్వం నిశ్చయించింది. కాంగోలోని అమెరికా రాయబారి క్లేర్ టింబర్లేక్, కాంగో అధ్యక్షుడు జోసఫ్ కసావుబుని కలుసుకొని వాచా అందజేసేందుకు ఘాటైన నిరసనను సిద్ధం చేస్తున్నాడని ఇక్కడి అధికారులు తెలిపారు.

మొన్నటి ఘటనలో గాయపడిన అమెరికన్ వైమానిక సిబ్బంది ఎనిమిది మందిలోనూ కొందరిని విమానంలో వాషింగ్టన్ చేర్చారు. తక్కినవారికి మరీ బలమయిన గాయాలు తగలడంవల్ల వారిని కదపడానికి వీలులేదని, వారిప్పుడు లియోపోల్డ్‌విల్లీలో ఉన్నారని ఈ అధికారులు తెలిపారు.

జైపూర్, ఆగష్టు 30

భారత - పాకిస్తాన్ సరిహద్దుల్లో తిరుగుతున్న పేరు పొందిన బందిపోటు దొంగలు పద్దెనిమిదిమంది ఈ రోజు రాజస్థాన్ హోంమంత్రి శ్రీ రామకిశోర్ వ్యాస్ సమక్షంలో జైసల్మీర్‌కు ఎనభై మైళ్ళ దూరంలో లొంగిపోయినట్లు వార్తలు అందాయి.

కృష్ణనీటిని సక్రమంగా అందించడంలో నిర్లక్ష్యం

పి. డబ్ల్యు. శాఖ చర్యలకు గన్నవరం బ్లాక్ కమ్యూనిస్టు మహాసభ తీవ్ర నిరసన

గన్నవరం, ఆగష్టు 31

మాగాణి భూములకు సకాలంలో సరిఅయిన పద్ధతులలో కృష్ణనీటిని సరఫరా చేయని పి. డబ్ల్యు. శాఖవారి చర్యలను తీవ్రంగా ఖండిస్తూ గన్నవరం బ్లాక్ కమ్యూనిస్టు ప్రథమ మహాసభలో తీర్మానించారు.

ఈ మహాసభ పొట్టిపాడు గ్రామములో ఆగష్టు 24, 25 తేదీలలో జరిగింది. మహాసభకు 26 గ్రామములనుండి 90 మంది ప్రతినిధులు హాజరయ్యారు. శ్రీ ఆట్లూరి శ్రీమన్నారాయణ, శ్రీ మద్దుకూరి సత్యనారాయణ గార్లను అధ్యక్షవర్గంగాను, శ్రీ తుమ్మల చల్లయ్య, శ్రీ ఆట్లూరి శ్రీమన్నారాయణ, శ్రీ మద్దుకూరి సత్యనారాయణ, శ్రీ చింతపల్లి లక్ష్మారాయుడు, శ్రీ గొంది వెంకటేశ్వరరావు గార్లను సారథ్య సంఘంగా ఎన్నుకున్నారు.

జిల్లా కమ్యూనిస్టు నాయకులు శ్రీ కె. యస్. ఆర్. శాస్త్రి, శ్రీ మైనేని లక్ష్మణస్వామి, శ్రీ మానికొండ సుబ్బారావుగార్లు మహాసభకు హాజరైనారు. శ్రీ కె. యస్. ఆర్. శాస్త్రిగారు జాతీయ, అంతర్జాతీయ రాజకీయ పరిస్థితులను వివరించారు. బ్లాక్ ఆర్గనైజింగు కమిటీ తరఫున శ్రీ తుమ్మల చల్లయ్యగారు గన్నవరం బ్లాక్‌లోని 36 పంచాయతీగ్రామాలకు సంబంధించిన ఆర్థిక, రాజకీయ, స్థానిక పరిస్థితులను గురించి నివేదిక ప్రవేశపెట్టారు.

ప్రతినిధులు చర్చించి కొద్ది సవరణలతో దానిని ఆమోదించారు.

గన్నవరం బ్లాక్ ప్రాంతంలోని వ్యవసాయ కార్మికుల, రైతుల రక్షణ సమస్యలపై పార్టీ ఆందోళన చేసి పరిష్కరించడానికి విశాల ఐక్య ఉద్యమాలను నిర్మించి పనిచేయాలని, వివిధ గ్రామాలలో పార్టీనిర్మాణాన్ని పటిష్టంచేయాలనీ తీర్మానించారు.

గన్నవరం బ్లాక్ సమితి అధ్యక్షులు డాక్టరు సి. యల్. రాయుడుగారు సమితి ఏర్పడిన నాటినుండి నెరవేర్చిన వివిధ కార్యకలాపాలను గురించి, ఇంకా సమితిలో తీసుకోవలసిన కార్యక్రమాన్ని గురించి వివరించారు.

మహాసభలో ఈ క్రింది తీర్మానాలు చేశారు.

గన్నవరం బ్లాక్‌లోని మెట్టగ్రామాలన్నింటికీ వెంటనే విద్యుచ్ఛక్తి సప్లయి చేయాలి. సకాలంలో రైతులకు ఎరువులు సరఫరా అగునట్లు ప్రభుత్వం చర్యలు తీసికోవాలి. గన్నవరం బ్లాక్‌లోవున్న లిఫ్టింగు స్కీములు వెంటనే పూర్తి అయ్యేట్లు చర్యలు తీసుకోవాలి. కరువు పనులు కల్పించి ఆహారసమస్యను పరిష్కరించడానికి పూనుకోవాలి.

గన్నవరం బ్లాక్‌లో వున్న ఈ క్రింది రోడ్లను పూర్తిచేయడానికి జిల్లా పరిషత్ వెంటనే పూనుకోవాలి.

గన్నవరం-పుట్టగుంట, గన్నవరం-పురుషోత్తపట్నం ముస్తాబాద ఆత్కూరు-పానమరుడు - ఉయ్యూరు గన్నవరం-తరిగొప్పల - మానికొండ

అనంతరం 15 మందితో బ్లాక్ కమిటీ ఎన్నుకోబడింది. శ్రీ తుమ్మల చల్లయ్య (కార్యదర్శి) శ్రీ ఆట్లూరి శ్రీమన్నారాయణ, శ్రీ గొంది వెంకటేశ్వరరావుగార్లతో సెక్రటేరియట్‌ను ఎన్నుకొన్నారు.

వినుకొండ నుండి కూలీల వలస

వినుకొండ, ఆగష్టు 30

వినుకొండనుండి కూలిజనం తిండికి లేక వలస వెళ్ళుతున్నారు. ఈ తాలూకాలో మూడు నెలల నుండి వర్షాలు లేవు. పునాస పైర్లు సజ్జ, జొన్న, కొర్ర వేసినవి పైర్లు ఎండపోయినవి. బావులు, కుంటలు, చెరువులలో నీరులేదు. మంచినీటికి చాలా ఎద్దడిగా ఉంది. పశువులకు మేత దొరకడంలేదు. చొప్ప బండి 1కి రు 30లు అమ్ముతున్నది. వినుకొండలో ఇంతవరకు వర్షంలేదు ప్రతిరోజూ మబ్బుపట్టి గాలికి తేలిపోతున్నది.

అస్సాం నివేదికపై బెంగాల్ పార్లమెంట్ సభ్యుల అసంతృప్తి

న్యూఢిల్లీ, ఆగష్టు 30

అస్సాం కల్లోలాల గురించి పార్లమెంటు ప్రతినిధివర్గం సమర్పించిన నివేదికపై బెంగాల్ సభ్యులు తీవ్ర అసంతృప్తిని వెలిబుచ్చుతున్నారు. గోరేశ్వర్ ప్రాంతంలో జరిగిన ఘటనల గురించేగాక అస్సాం అంతటా జరిగిన సంఘటనల గురించి విచారణ జరపాలని వీరు కోరుతున్నారు. ఈ నివేదికపై ప్రభుత్వంచేసే నిర్ణయం కొరకు వీరు ఎదురుచూస్తున్నారు. ప్రభుత్వం నిర్ణయాలను ఈ నివేదికపై చర్చ ప్రారంభం అయ్యే రోజునే బహుశా ప్రకటించవచ్చు.

రెండు మత్స్య విద్యాలయాలస్థాపన

శ్రీ పాటిల్ వెల్లడి

న్యూఢిల్లీ, ఆగష్టు 31

ప్రథమంలో భావించినట్లు ఒకటికి మారుగా రెండు మత్స్య విద్యాసంస్థలు స్థాపించాలని ప్రభుత్వం భావిస్తున్నట్లు కేంద్ర ఆహార వ్యవసాయ మంత్రి శ్రీ యస్. కె. పాటిల్ ఈరోజు లోక్‌సభలో తెలియజేశారు.

ఇది కొచ్చిన్, బొంబాయిలలో స్థాపింపబడుతాయని తెలియజేశారు.

ఆయన యిలాఅన్నారు: బొంబాయిలో, తాత్కాలిక మత్స్య శిక్షణా కేంద్రాన్ని స్థాపించాలన్న మొదటి ప్రతిపాదన ఎత్తివేయబడింది. కాని ఆ సంస్థను బొంబాయిలో స్థాపించవలసిందిగా ప్రస్తుత మహారాష్ట్ర ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వాన్ని కోరింది. భవన నిర్మాణానికి స్థలాన్ని ఉచితంగా ఇవ్వడానికి ఆ ప్రభుత్వం తన సంసిద్ధతను వెల్లడించింది. మనం ప్రస్తుతం మత్స్య పరిశ్రమను అభివృద్ధిచేస్తున్నాం, గనుక ఒక విద్యాసంస్థకంటే యెక్కువ స్థాపించే అవకాశంలేకపోలేదు.

ఫైనాన్స్ కార్పొరేషన్ యిచ్చే అప్పులు

చట్ట సవరణకు ఆలోచన

న్యూఢిల్లీ, ఆగష్టు 30

ప్రభుత్వ గ్యారంటీ లేకుండానే కోటి రూపాయలకు మించి అప్పు యివ్వడానికి వీలుగా ఫైనాన్స్ కార్పొరేషన్ చట్టాన్ని సవరించడానికి ప్రభుత్వం నిశ్చయించిందని ఆర్థికమంత్రి శ్రీ మొరార్జీ దేశాయి పార్లమెంటు సభ్యుల ఆర్థిక సలహా సంఘ సమావేశంలో తెలియజేశారు.

సహకార పంచదార మిల్లులకు గాని, లేదా కార్పొరేషన్ యివ్వదలచుకొన్న మరే యితర సంస్థకు గాని కోటిరూపాయలు మించి అప్పు యివ్వదలచినప్పుడు అది వ్యాపార సూత్రాలకు భిన్నంగా వున్నప్పటికీ అందుకు కార్పొరేషన్ ప్రభుత్వ గ్యారంటీని కోరడానికి ఈ కొత్త ప్రతిపాదన వలన అవకాశం ఏర్పడుతూంది.

పగ తీర్చుకోడానికి ఇద్దరి ముక్కుల కోత

బారాబంకి, ఆగష్టు 31

ఇద్దరు వ్యక్తుల ముక్కులు తెగ్గోసి రక్తంతో తడిసిన కత్తితో సహా ఒక యువకుడు ఇక్కడ అధికారులకు లొంగిపోయాడని వార్త అందింది.

తన కులంవారి సమావేశంలో ఇద్దరు సోదరులు తన సోదరిపై అవమానకరమైన ప్రసక్తి తెచ్చినందుకు ఆ యువకుడు వారిద్దరి ముక్కులు కోశాడు. తర్వాత ఆ ఇద్దరు సోదరులు తెగిపోయిన ముక్కులతో పోలీసు స్టేషనుకు వెళ్లారు.

బడుగుదేశాలఅభివృద్ధికి పశ్చిమయూరప్ భయం

లాల్‌బహదూర్‌శాస్త్రి ప్రసంగం

అలహాబాదు, ఆగష్టు 30

బడుగుదేశాలు అభివృద్ధి కావడానికి ప్రయత్నిస్తున్న సమయంలోనే అరడజను పశ్చిమయూరపుదేశాలు ఎగుమతి, దిగుమతులను క్రమబద్ధం చేయడానికి ఉమ్మడిమార్కెట్టును నిర్మించుకున్నాయని కేంద్ర పరిశ్రమల మంత్రి శ్రీ లాల్‌బహదూర్‌శాస్త్రి అన్నారు.

మదనమోహన్ మాలవీయ కళాశాల యూనియన్‌ను నేడు ప్రారంభోత్సవం చేస్తూ ఆయన ఇంకా ఇలా అన్నారు. "బడుగుదేశాలు సాధిస్తున్న అద్భుతమైన అభివృద్ధిని చూచి ఆదేశాలు బెదిరి వుండవచ్చు.

అభివృద్ధిచెందిన దేశాలు, వెనుకబడిన దేశాలనే రెండు భాగాలుగా నేడు ప్రపంచం విభజించబడి వుంది.

వెనుకబడిన దేశాలు అభివృద్ధి చెందనంతవరకు ప్రపంచంలో శాంతి ఏర్పడదు. ఎందుచేతనంటే వెనుకబడిన దేశాల సమస్యలు, అభివృద్ధి చెందిన దేశాలపై ప్రతిబింబించకమానవు.

వెనుకబడిన దేశమైన భారతదేశం అనేక సమస్యలను ఎదుర్కొంటుంది.

పెద్ద పథకాలను అమలుపరచడం ద్వారా ఈ సమస్యలను పరిష్కరిస్తున్నాం. 15 సంవత్సరాల తరువాతగాని ప్రజలు తమ శ్రమకు త్యాగాలకు ఫలితాన్ని అనుభవించలేరు.

విమాన ఉద్యోగుల వివాదం

మధ్యవర్తి తీర్పు ఇవ్వరాదని మహారాష్ట్ర హైకోర్టు ఉత్తర్వు

బొంబాయి, ఆగష్టు 30

భారత వైమానికశాఖ కార్పొరేషన్, ఉద్యోగులకు మధ్య ఏర్పడిన వివాదాన్ని పరిశీలిస్తున్న మధ్యవర్తిత్వసంఘ అధ్యక్షుడు శ్రీ డి. వి. వ్యాస్ తన తీర్పు చెప్పడం తాత్కాలికంగా నిలిపివేయాలిసిందంటూ మహారాష్ట్ర హైకోర్టు ఈరోజు ఒక ఎక్స్ పార్టీ ఇంజంక్షన్ జారీ చేసింది.

మధ్యవర్తిత్వసంఘ అధ్యక్షుడు, మరో నలుగురు సభ్యులపైన వైమానిక శాఖ ఉద్యోగులు దాఖలుచేసిన రిట్ పిటీషన్‌దృష్ట్యా న్యాయాధికారి శ్రీ కె. కె. దేశాయి ఈవిధంగా ఇంజంక్షన్ ఇచ్చారు.

ఉద్యోగులకు చేయవలసిన సదుపాయాలు, పనిగంటలు, ఉద్యోగ విరమణకు చెందిన అంశాలను పరిశీలించేందుకు బొంబాయి ప్రభుత్వం గత సంవత్సరం జూన్ 27వ తేదీన ఈ కమిటీని నియమించింది.

రిట్ పిటీషన్‌లో ఇలా ఉంది:

సంపూర్ణ హక్కులుగల, ఏక మధ్యవర్తిలా శ్రీ వ్యాస్ వ్యవహరించాలని ప్రయత్నిస్తున్నాడు.

ఈనెల 30వ తేదీలోగా తన నివేదికను ప్రభుత్వానికి సమర్పించడానికి సిద్ధంగా ఉన్నట్లు తెలుస్తుంది. కాని వ్యాస్‌లో ఉద్యోగులకు నమ్మకం పోయింది. ఉద్యోగుల సంఘానికి, యాజమానులకు మధ్యజరిగిన ఒప్పందం ప్రకారం శ్రీ వ్యాస్ ఏకమధ్యవర్తిగా వ్యవహరించి ఎలాంటి నిర్ణయం చేయడానికి వీల్లేదు.

స్టాక్ ఎక్స్ఛేంజీలలో జరిగే జూదం!

న్యూఢిల్లీ, ఆగష్టు 30

"స్టాక్ ఎక్స్ఛేంజీలలో జరుగుతున్న జూదాన్ని ఖండించవలసిందే. దీనిని అరికట్టడానికి ప్రభుత్వం తగుచర్యల గురించి ఆలోచిస్తూంది" అని ఆర్థికమంత్రి శ్రీ మొరార్జీ దేశాయి పార్లమెంటు సభ్యుల ఆర్థిక సలహా సంఘ సమావేశంలో నేడు మాట్లాడుతూ అన్నారు.

బులియన్‌లో జరిగే ఫార్వర్డు వ్యాపారాన్ని కూడా నిషేధించాలని సమావేశంలో కొందరు సభ్యులు సూచించారు. ఈ సూచన పాతదేనని, ఈ యావత్తు విషయం ఆలోచనలో ఉందని శ్రీ దేశాయ్ సమాధానం చెప్పారు.

అస్సాంపై కేంద్రం వైఖరికి నిరసన

పార్లమెంటుముందు ఫార్వర్డుబ్లాకు ప్రదర్శన

కలకత్తా, ఆగష్టు 29

అస్సాం వ్యవహారాలపట్ల కేంద్ర ప్రభుత్వ అలక్ష్యానికి, అలసత్వానికి నిరసన తెల్పడానికి పశ్చిమబెంగాల్ శాసనసభ్యులిద్దరితోసహా వందమంది ఫార్వర్డుబ్లాక్ సభ్యులు పార్లమెంటు ముందు సెప్టెంబరు 1న శాంతియుత ప్రదర్శన జరుపుతారు.

ఫార్వర్డ్‌బ్లాక్ బెంగాల్ కమిటీ అధ్యక్షులు శ్రీ హేమంతకుమార్ బాసు ఈవిషయాన్ని నేడొక పత్రికాగోష్టిలో వెల్లడించారు.

అస్సాం కల్లోలాలపై తమ అభిప్రాయాలను, ఆరాష్ట్ర సమస్యల పరిష్కారానికి సూచనలను పొందుపరుస్తూ బెంగాల్ కమిటీ ఒక మెమొరాండాన్ని పార్లమెంటు సభ్యులకు అందజేస్తుందని కూడా చెప్పారు.

దొంగలను పట్టుకునే సాధనం ప్రదర్శన

మద్రాసు, ఆగష్టు 30

విద్యుచ్ఛక్తి సరఫరా ఆగిపోగానే విద్యుద్దీపాలను వెలిగించి అలారం గంటలను మోగించే ఒక సాధనాన్ని ఇక్కడ ప్రదర్శించారు. శ్రీ బి. దాస్ గుప్త ఈ సాధనాన్ని రెండేళ్లు పరిశోధనలు జరిపి కనిపెట్టారు.

ఈ సాధనం ద్వారా ఇండ్లలోను, బ్యాంకులలోను దొంగతనాలను నిరోధించవచ్చు.

ఈ సాధనాన్ని అమర్చి ఉన్నట్లయితే దొంగలు బ్యాంకులను దోపిడీ చేయడానికి ముందు మెయిన్ స్విచ్‌ను ఆపివేసినపుడు కాని, విద్యుచ్ఛక్తి తీగలను నరికివేసినప్పుడు కాని, ప్రమాదాన్ని సూచించే విద్యుద్దీపాలు వెలిగి అలారం గంటలు మ్రోగుతాయి. విద్యుచ్ఛక్తి సరఫరా ఆపివేయకుండా దొంగ ఎవరైనా బ్యాంకులోనికి ప్రవేశించినప్పుడు, ప్యాసేజిలో దారి క్రింద ఉండే మాట తొక్కినప్పుడు కూడా అలారంగంటలు మ్రోగుతాయి.

ఇళ్ళల్లో వాడడానికి ఇటువంటి నమూనాలనే మూడింటిని శ్రీ దాస్ గుప్త ప్రదర్శించారు.

అధిక వర్షాలవలన హౌరా, కుండ్లా స్టేషన్లమధ్య రైళ్ళ మామూలు రాకపోకలు ఆగిపోయాయి.

లేఖలు

ప్రచురణకర్తల పుస్తకాలు వారివారివద్దనే కొనవలెను

ఆర్యా,

ప్రతి జిల్లాలోనూ జిల్లా లోకల్ లైబ్రరీ అథారిటీవారు కొన్ని గ్రంథాలయములను నిర్వహిస్తూ వుంటారు. ఈ గ్రంథాలయాలకు కావలసిన పుస్తకాలు ప్రతి సంవత్సరం కొంటూంటారు. ఈ కొనటంలో చాలా పద్ధతులు వున్నాయి. ఇంతకు పూర్వం టెండర్లు పిలిచి టెండరు ద్వారా పుస్తకాలు కొనేవారు. ఇలాంటి టెండరు పద్ధతిద్వారా అనేక అనర్థాలు జరుగుతున్నాయి. టెండరుదార్లు పోటీపడి ఎక్కువ కమిషను యిస్తామని చెప్పటం, ఆ కమిషనుకు అందుబాటులో వున్న పుస్తకాలే సప్లయి చేయటం జరుగుతోంది. లైబ్రరీ అధికార్లు కావాలని కోరిన పుస్తకాలు వున్నప్పటికీ, లేవని చెప్పటంకూడా జరుగుతోంది. టెండరు పద్ధతివల్ల జరిగే అన్యాయం, అక్రమ పద్ధతులు 1959 మార్చిలో గుంటూరుజిల్లా లైబ్రరీ అథారిటీవారికి చేసిన సప్లయిలో పరాకాష్ఠ పొందాయి.

ఈ పద్ధతి సరియైనది కాదని శాసనసభ అధ్యక్షులు, విద్యామంత్రి తమతమ అభిప్రాయములను యిచ్చివున్నారు.

ఈ కారణాలన్నింటివల్ల దాదాపు అన్ని జిల్లా లైబ్రరీ అథారిటీలవారు ఆ ప్రచురణకర్త పుస్తకాలు ఆ ప్రచురణకర్త వద్దనే కొనాలనే అభిప్రాయానికి వచ్చారు.

1960 మార్చిలో ఒక్క పశ్చిమ గోదావరిజిల్లావారు తప్ప మిగతా జిల్లా అధికారులు యే ప్రచురణకర్త పుస్తకాలు ఆ ప్రచురణకర్తకే ఆర్డరు యిచ్చి తెప్పించుకొన్నారు.

ఇదే పద్ధతిలో పుస్తకాలు కొనేందుకు నెల్లూరు జిల్లా గ్రంథాలయాధికారులు కూడా డైరెక్టరు ఆఫ్ పబ్లిక్ లైబ్రరీస్‌కు వ్రాసి అనుమతిపొందారు. అనేకమంది ప్రచురణకర్తలను కోటేషన్లు అడిగి తీసుకొన్నారు. లిస్టులు కూడా తయారుచేశారు. ఇదివిని ప్రచురణకర్తలంతా సంతసించారు.

కాని అదే నెల్లూరుజిల్లా అధికారులు టెండరు పద్ధతిద్వారా పుస్తకాలు కొనాలని నిర్ణయించుకొన్నట్లు తెలుస్తోంది. లైబ్రరీ కమిటీ చేసిన తీర్మానాన్ని అధ్యక్షులు ఇలా ఎందుకు మార్చదలచుకొన్నారో బోధపడుటలేదు. ఇందుకు యేమైనా ఒత్తిడి వచ్చిందో యేమో తెలియదు. కాన డైరెక్టర్ ఆఫ్ పబ్లిక్ లైబ్రరీస్, విద్యాశాఖ మంత్రిగార్లు యీవిషయమై తగు శ్రద్ధవహించి యే ప్రచురణకర్త పుస్తకాలు ఆ ప్రచురణకర్త వద్దనే కొనే యేర్పాటు చేయించాలి.

ఇట్లు,
కె. సుబ్బారావు కార్యదర్శి,
విజయవాడ ప్రచురణకర్తల,
పుస్తక విక్రేతలసంఘం (రిజిష్టర్డ్)

ఉద్యోగప్రవేశ వయఃపరిమితి

ఆర్యా,

దినదినంలో నిరుద్యోగం నానాటికి తీవ్రమగుచున్నది. ఉద్యోగ ప్రయత్నంలో ఉద్యోగములుదొరకక దశాబ్దములు కూడా దాటిపోవుచున్నవి. ఇట్టి స్థితిలో ప్రభుత్వం నిర్ణయించిన ఉద్యోగ ప్రవేశవయఃపరిమితి మించిపోయి ఉద్యోగానర్హులై నిరుద్యోగములో చాలమంది బాధపడుచున్నారు.

వయోనిబంధనలవల్ల సమర్థులు నిరుద్యోగులై ఆకలితో అలమటించుచున్నారు. వయస్సు మరిపోయిన కొన్ని సందర్భములలో పూర్తిఅర్హత లేనివారుకూడా ఉద్యోగములలో వున్నారు. నిరుద్యోగమును రూపుమాపడం ఆశయంగా కలిగిన మన ప్రభుత్వము ఉద్యోగప్రవేశ వయోపరిమితిని సడలించునని, కనీసం ఇప్పటి వయోపరిమితిని ఇంకొక పదిసంవత్సరములకు పొడిగిస్తారని ఆశిస్తున్నాను.

ఇట్లు
పి. సెట్టి సుబ్బారావు, పుల్లేటికుర్రు.

కేంద్ర ఉద్యోగులపై కేసులు

ఆర్యా,

కేంద్ర ప్రభుత్వోద్యోగుల సమ్మె సందర్భంలో అనేకమంది కార్మికుల పైన, నాయకులపైనా, ప్రభుత్వం కేసులను మోపింది. సమ్మె విరమణానంతరం, కేంద్రమంత్రులు, రాష్ట్ర మంత్రులు కూడా సమ్మెదార్లపై కక్ష సాధించమని ఉదారంగా వ్యవహరిస్తామని ప్రకటించారు. తదనుగుణంగానే మైసూరు, కేరళ, మద్రాసు రాష్ట్రాలలో ఎక్కువభాగం కేసులు యిప్పటికి ఉపసంహరించబడ్డాయి.

కాని ఆంధ్రరాష్ట్రంలో మాత్రం ఈ ఉపసంహరణల విషయంలో చాలా జాప్యం జరుగుతున్నది. యిందువల్ల కార్మికులు చాలా యిబ్బందులకు గురికావటం జరుగుతున్నది. ఆంధ్రరాష్ట్ర ప్రభుత్వం కూడా, తోటి రాష్ట్రాలలాగా ఉదారంగా వ్యవహరించాలని, జాప్యం చేయకుండా మిగిలిన కేసులను ఉపసంహరించాలని కోరుతున్నాను. డిపార్టుమెంటు అధికారులుకూడా, యీ విషయంలో శ్రద్ధ వహించి కేసుల ఉపసంహరణకు ప్రయత్నించాలని విజ్ఞప్తి చేస్తున్నాను.

ఇట్లు,
పి. కె. కుమార్,
విజయవాడ

కమ్యూనిస్టుపార్టీ శాఖా సమావేశాలు

చౌకడిపోలు స్థాపించాలనీ, వలసినన్ని ఎరువులు రైతులకు సప్లయి చేయాలని అభ్యర్థనలు

తెనాలి, ఆగస్టు 30

ప్రభుత్వం వెంటనే తెనాలి పట్టణంలోను, గ్రామాలలోను చౌకడిపోల ద్వారా బియ్యాన్ని ప్రజలకు అందజేయాలని నిన్న తెనాలిలో శ్రీ ముక్తేవి మాధవాచార్యగారి అధ్యక్షతను సమావేశమైన తెనాలి పట్టణ, కూచిపూడి, చుండూరు బ్లాకు ప్రాంతీయ కమ్యూనిస్టుపార్టీ సభ్యుల సాధారణ సమావేశంలో తీర్మానించారు

ఈ సమావేశానికి తెనాలిపట్టణం నుంచి, 11 గ్రామాలనుంచి మొత్తం 145 గురు సభ్యులు హాజరైనారు సమావేశ ప్రారంభంలో శ్రీ పరుచూరి నాగేశ్వర్రావుగారు తాలూకా మహాసభలో ఆమోదించబడిన నివేదికను వివరించారు.

తరువాత గుంటూరు జిల్లా కమిటీ నుండి సమావేశానికి వచ్చిన శ్రీ మాదాల నారాయణస్వామిగారు రాజకీయ విధానాన్ని రూపొందించుకోవడంలో గతానికీ, ఇప్పటికీ ఉన్న తేడాను వివరించారు.

పిమ్మట ఈ క్రింది 18 గురిని కార్యవర్గంగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. శ్రీయుతులు చుక్కపల్లి పిచ్చయ్య, గోరికపూడి జోసెఫ్, ముక్తేవి మాధవాచార్య, వేమూరు సుబ్బారావు, మస్తాన్ ఖాన్, కంచర్ల కోటయ్య, అంగ్రాజు లక్ష్మయ్య, వారి బాలిరెడ్డి, రావూరి పుల్లారావు, కె కృష్ణమూర్తి, కొడాలి చక్రవర్తి, పందిపాటి ఆశీర్వాదం, శ్రీ గోలి హనుమంతరావు.

తరువాత కార్యవర్గ సభ్యులు సమావేశమై శ్రీ చుక్కపల్లి పిచ్చయ్యగారిని కార్యదర్శిగాను, శ్రీ గోరికపూడి జోసెఫ్, శ్రీ వేమూరి సుబ్బారావుగార్లను సెక్రటేరియట్ సభ్యులుగాను ఎన్నుకున్నారు.

ఎరువుల పంపిణీ సక్రమంగా లేదనీ, డబ్బుగలవారికి తప్ప సాధారణ రైతులకు అందటంలేదనీ, అందరికీ అందేటట్లు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలనీ తీర్మానించారు.

పామర్రు బ్లాక్ మహాసభ

గుడివాడ తాలూకా పామర్రు బ్లాకు కమ్యూనిస్టుపార్టీ మహాసభ శ్రీ ముక్తేవి శేషాచార్యులుగారి అధ్యక్షతన ఆగస్టు 25 వ తేదీ జరిగింది

14 గ్రామాలనుండి ప్రతినిధులు, ఆహ్వానితులు 92మంది హాజరయ్యారు జిల్లా పార్టీ నాయకులు శ్రీ జె వి ఎస్ ఆర్ శాస్త్రిగారు రాజకీయ నివేదిక ఇచ్చారు అనంతరం బ్లాకు కమిటీ తరఫున శ్రీ తప్పిట సుబ్బారావుగారు నివేదికను ప్రవేశపెట్టారు

పదకొండుమందితో నూతన కమిటీని ఎన్నుకొన్నారు కార్యదర్శిగా శ్రీ పుట్టుకుంట సుబ్బారావు, సహాయ కార్యదర్శులుగా శ్రీ తప్పిట సుబ్బారావు, శ్రీ రావెళ్ళ హనుమంతరావు గార్లు ఎన్నికైనారు.

చౌకడిపోలు ఏర్పాటుచేసి ఆహారధాన్యాలు తక్కువ ధరకు అందించాలని, రైతాంగానికి ఎరువులు వెంటనే సక్రమంగా అందజేయాలని, వ్యవసాయ కార్మికులకు బంజర్లు, ఇండ్ల స్థలాలు చాప్యం జరుగకుండా ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరుతూ తీర్మానించారు

తాపేశ్వరం, ఇప్పనపాడు

రామచంద్రపురం తాలూకా తాపేశ్వరం, ఇప్పనపాడు కమ్యూనిస్టుపార్టీ శాఖల సంయుక్త మహాసభ తాపేశ్వరంలో 24 వ తేదీన జరిగింది. డాక్టరు చెలికాని రామారావుగారు జెండా ప్రతిష్ఠాపన చేశారు 40 మంది హాజరయ్యారు శ్రీ పిలాని రామన్న, శ్రీ చిట్టూరి వెంకన్న గార్లు అధ్యక్షత వహించారు డాక్టరు చెలికాని రామారావుగారు, శ్రీ పెదపాటి వెంకట్రావుగార్లు నేటి జాతీయ, అంతర్జాతీయ రాజకీయ పరిణామాలు, పార్టీ నిర్మాణం, తక్షణ కర్తవ్యాలు వివరించారు నూతన సంవత్సరానికి శ్రీ మెరుగాని నవిరాజు తాపేశ్వరానికి కార్యదర్శిగా, శ్రీ ముక్కల వెంకటేశ్వర్లుగారిని ఇప్పనపాడు గ్రామానికి కార్యదర్శిగా ఏకగ్రీవంగా ఎన్నుకొన్నారు.

ఆరాత్రి శ్రీ పరేడి అప్పారావుగారి అధ్యక్షతను పెద్ద బహిరంగసభ జరిగింది సభలో డాక్టరు చెలికాని రామారావుగారు మాట్లాడారు

అనంతరం ఉపకాయల వెంకట్రావు దళంవారిచే 'వీరాభిమన్య' బుర్రకథ చెప్పబడింది

నాయుడుగూడెం

ఏలూరుతాలూకా నాయుడుగూడెం గ్రామ కమ్యూనిస్టుపార్టీసభ్యుల సమావేశం శ్రీ కొత్నేని కృష్ణమూర్తిగారి అధ్యక్షతను 26 న జరిగింది సమావేశమునకు జిల్లా పార్టీ కార్యదర్శి శ్రీ సెక్కలపూడి రామారావు, ఏలూరు తాలూకా కమ్యూనిస్టుకమిటీ కార్యదర్శి శ్రీ సేతల పోతంరాజుగార్లు హాజరైనారు. శ్రీ పొన్నమండ సుబ్బారావుగారు (కార్యదర్శి), శ్రీ కొత్నేని పెదకాశీ, శ్రీ కొత్నేని కృష్ణమూర్తి, శ్రీ నందిగం వెంకయ్య, శ్రీ గారపాటి పూర్ణచంద్రరావుగార్లతో కమిటీని ఎన్నుకున్నారు. తాలూకా కమ్యూనిస్టుపార్టీ మహాసభకు ప్రతినిధులను కూడా ఎన్నుకున్నారు

పొనుగోడు

హుజూర్‌నగర్ తాలూకా పొనుగోడు గ్రామ కమ్యూనిస్టు శాఖ మహాసభ ఆగస్టు 20 వ తేదీ శ్రీ ఎస్. బసవయ్యగారి అధ్యక్షతన జరిగింది 47 మంది సభ్యులు హాజరైనారు తాలూకా కమ్యూనిస్టుపార్టీ నాయకులు శ్రీ అందె నర్సయ్యగారు రాజకీయ నివేదిక, వర్షాభావం వలన ఏర్పడిన పరిస్థితులను వివరించారు స్థానిక పరిస్థితులపై పంచాయతీబోర్డు అధ్యక్షులు శ్రీ అనుమాల లింగయ్యగారు మాట్లాడారు వెంటనే కరువు పనులు ప్రారంభించాలని, చౌకడిపోలు తెరవాలని, వ్యవసాయ కూలీలకు వ్యక్తిగత హామీపై కుటుంబానికి రు 50 లు తక్కావీ అప్పు యివ్వాలని ప్రభుత్వాన్ని కోరుతూ తీర్మానించారు.

శ్రీ యస్ బసవయ్య కార్యదర్శిగా, ఏడుగురితో కార్యవర్గాన్ని, బ్లాకు మహాసభకు 14 మంది ప్రతినిధులను ఎన్నుకున్నారు

తాళ్ళూరుబ్లాకు కమ్యూనిస్టు కమిటీ సమావేశం

సత్తెనపల్లి తాలూకా తాళ్ళూరు బ్లాకు కమ్యూనిస్టు కమిటీ ప్రథమ సమావేశం ఆగస్టు 24 వ తేదీన పెదకూరపాడు గ్రామంలో జరిగింది. బ్లాకు కమిటీ కార్యదర్శిగా శ్రీ పుతుంబాక వెంకటపతిగారిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

అనంతరం కమిటీ సభ్యులందరూ తమ తమ గ్రామాలపరిస్థితులపై ఇచ్చిన నివేదికలను విన్నారు.

వెంటనే అన్ని గ్రామశాఖల సమావేశాలు జరపాలనీ, గత రెండు సంవత్సరాల శాఖా కార్యకలాపాలపై చర్చలు జరిపి, ఆయా శాఖలకు కమిటీల, కార్యదర్శుల ఎన్నికలు జరపాలనీ నిర్ణయించారు.

నరసన్నపేట తాలూకా కమ్యూనిస్టు మహాసభ

శ్రీకాకుళంజిల్లా నరసన్నపేట తాలూకా కమ్యూనిస్టుపార్టీ మహాసభ పోలాకి గ్రామంలో ఆగస్టు 21 న శ్రీ రెడ్డిపాపయ్యగారి అధ్యక్షతనుజరిగింది కార్యదర్శి శ్రీ మామిడి అప్పలసూరిగారిచే ప్రవేశపెట్టబడిన రిపోర్టులు చర్చ జరిపిన తదుపరి ఆమోదింపబడినవి.

ఈ నెల 1 వ తేదీన కాంగ్రెస్ దుండగీండ్రచే చంపబడ్డ, కోడూరు శివారు రాజస్మాయిల్‌పేటకు చెందిన కమ్యూనిస్టు కార్యకర్త కోట సూర్యనారాయణ మరణానికి మహాసభ తన గాఢ సంతాపాన్ని తెలియజేసింది

తరువాత అంతర్జాతీయ, జాతీయ పరిస్థితులపై జిల్లాకమ్యూనిస్టుపార్టీ కార్యదర్శి శ్రీ దారపు గోవిందరాజులుగారు రిపోర్టు యిచ్చారు

ఆ సాయంత్రం స్థానిక పంచాయతీ అధ్యక్షులు శ్రీ కెలమి లక్ష్మినారాయణగారి అధ్యక్షతన బహిరంగసభ జరిగింది సభలో శ్రీ గోవిందరాజులు, జిల్లాయువజనసంఘ కార్యదర్శి శ్రీ పంచాది కృష్ణమూర్తిగారలు ఉపన్యసించారు.

గూడూరు

నెల్లూరుజిల్లా గూడూరు పట్టణ కమ్యూనిస్టుశాఖ సమావేశం శ్రీ సి. హెచ్. వెంకయ్యగారి అధ్యక్షతను ఈ నెల 28 వ తేదీన జరిగింది.

ప్రస్తుతం మున్సిపాలిటీకి సప్లయి చేస్తున్న వాటర్ వర్క్సులో (మంచినీటి బావులలో) నీరు తగ్గినందున పట్టణంలో నీటి కొరత ఏర్పడి ప్రజలు యిబ్బందుల పాలవుతున్నారు. పట్టణం వెలుపలనున్న మంచినీటి బావులలో పూడిక ఎత్తించి ఈ బావుల నుండి ట్రాక్టరుమీద కుళాయిలు లేని ప్రాంతాలకు సప్లయిచేయాలని మున్సిపల్ కౌన్సిలును కోరుతూ తీర్మానించారు.

గూడూరు బస్సుస్టాండులో స్త్రీల ప్యాసింజరు షెడ్డును పక్కకొట్టుగా మార్చిన కమీషనరు చర్యలను నిరసిస్తూ స్త్రీల ప్యాసింజరు షెడ్డుకు అడ్డువున్న గోడలను ఎత్తివేసి ప్రయాణీకులకు సౌకర్యం కలిగించాలని కౌన్సిల్‌ను కోరారు అలాగే మిడిల్ స్కూలు హెడ్‌మాస్టర్ నియామకంలో కమిషనర్ చర్యను నిరసించారు (వి ని)

మద్రాస్ శాసనసభ అఖిలపక్ష సంఘం రాష్ట్ర మూడవ ప్రణాళికలో చేర్చవలసిన పారిశ్రామిక పథకాలను గూర్చి చర్చించింది.

కొబ్బరి, అరటి తోటలపై పన్నులు

రద్దుచేయాలని సోంపేట కమ్యూనిస్టుసభ తీర్మానం

కత్తుం, ఆగస్టు 31

కొబ్బరి, అరటితోటలపై పన్నులను రద్దుచేయాలనీ, ఉద్యానవన ప్రాంతంలో పైపుల ద్వారా మంచినీటి సప్లయి స్కీమును చేపట్టాలని ప్రభుత్వాన్ని కోరుతూ శ్రీకాకుళం జిల్లా సోంపేట తాలూకా కమ్యూనిస్టుపార్టీ మహాసభ తీర్మానించింది

ఈ మహాసభ ఇటీవల కత్తుం గ్రామంలో జరిగినది

వర్షాకాలమైనను, దమ్ములు (వరినాట్లు) ముమ్మరంగా జరుగుతున్నప్పటికీ, అన్ని ప్రాంతాలనుండి 82 మంది ప్రతినిధులు వచ్చారు. జిల్లా కమ్యూనిస్టుకమిటీ కార్యదర్శి శ్రీ దారపు గోవిందరాజులు, బొబ్బిలి తాలూకా కమ్యూనిస్టు కమిటీ కార్యదర్శి శ్రీ వి రాములింగాచారిగారు జిల్లా కార్యవర్గం తరఫున హాజరైనారు.

మొదటిరోజు సమావేశానికి శ్రీ ఊడిమూడి శ్రీరామచంద్రరాజు, మరునాటి సమావేశానికి కత్తుం గ్రామ పంచాయతీ అధ్యక్షులు శ్రీ కీలం కృష్ణమూర్తిగారు అధ్యక్షత వహించారు

మొదట అమరజీవులు శ్రీ గేదెల రాజేశ్వర్రావు, శ్రీ గొరకల అప్పలస్వామి గార్లకు జోహారులర్పించారు

తాలూకా ఆర్థిక పరిస్థితి, కార్యకలాపాల నివేదిక, రాజకీయ పరిస్థితి పార్టీ నిర్మాణంపై సుదీర్ఘమైన చర్చలు సాగినవి సవరణలతో ఆమోదించారు

తాలూకా కమ్యూనిస్టు కమిటీని బ్లాకుల పునాదిపై రెండుగా విభజించి ఒక్కొక్క బ్లాకుకమిటీకి అయిదుగురు సభ్యులను మహాసభలో ఎన్నుకోవడమైనది ఈ కమిటీలు సమావేశమై మందసాబ్లాకు కమ్యూనిస్టు కమిటీకి శ్రీ గానుగుల తరుణాచారి, సోంపేటబ్లాకు కమ్యూనిస్టు కమిటీకి శ్రీ ఊడిమూడి శ్రీరామచంద్రరాజు గార్లను కార్యదర్శులుగా ఎన్నుకొన్నాయి.

జిల్లా కమ్యూనిస్టుపార్టీ మహాసభకు 15 గురు ప్రతినిధులు కూడా ఎన్నుకోబడ్డారు.

ప్రభుత్వం ఈ క్రింది సౌకర్యాలకు వెంటనే పూనుకోవాలని మహాసభ తీర్మానించింది.

జీవితావసరవస్తువుల ధరలు తగ్గించి చౌక డిపోలు నెలకొల్పాలి,

2 అధికపన్నులు, అక్రమ నీటి తీరువా, కొబ్బరి, అరటితోటలపై పన్నులు రద్దుచేయాలి,

3 ఉద్యాన ప్రాంతంలో పైపుల ద్వారా మంచినీరుసరఫరా చేయుటకు స్కీము వేయాలి.

4 తాలూకా మొత్తంగా పంట కరువు తీర్చుటకు యీ క్రింది ప్రాజెక్టులకు స్కీములు తయారుచేయాలి

అ) బీలప్రాంతానికి "బీలబట్టి" (ఆ) కొల్లూరు, ఝూమూపుడి, కంచిలి యీ మూడు ఫిర్కాలకు "మంకిడిసాగరం రిజర్వాయరు" (ఇ) మందసా ప్రాంతానికి "చీపీ ప్రాజెక్టు"

5 రవాణా, రహదారి సౌకర్యాలు హెచ్చించాలి

6, ఆపివేయబడ్డ "పాడిగాం ప్రాజెక్టు"పని చురుగ్గా పూర్తిచేయాలి.

ఆ సాయంత్రం కత్తుం రెండు గ్రామాలలో 50 మందితో ఊరేగింపు జరిగింది రాత్రికి తాలూకా కమ్యూనిస్టుకమిటీ సభ్యులు శ్రీ బెందాళం గవరయ్యాగారి అధ్యక్షతను బహిరంగ సభ జరిగింది

మందసా పంచాయతీ సమితి అధ్యక్షులు శ్రీ మజ్జి తులసీదాసు గారు ఉపన్యసిస్తూ ప్రభుత్వం అమలుపరచిన ప్రణాళికలు ఏ విధంగా ప్రజల కందుబాటులో లేక పోతున్నవో వివరించారు పంచాయతీ సమితులలో, ప్రభుత్వ పథకాలలో ఏవిధంగా నామమాత్రపు ప్లానులు అమలు జరుగుతున్నవీ అందులో గల పరిమితులూ, అడ్డంకులూ తెలిపారు

అంకెల్లోనూ పేపరుమీదనూ అభివృద్ధిపొందుతున్నదనియు, దొంగలెక్కలు చూపించబడుతున్నవనియు చెప్పారు. ప్రజల జీవితపరిమాణాన్ని పెంచకుండా భూస్వాములను, ధనవంతులను పెంచుతున్న యీ ప్రభుత్వాన్ని దించాలని, రానున్న ఎన్నికలలో కమ్యూనిస్టుపార్టీని గెలిపించాలని విజ్ఞప్తిచేశారు

తర్వాత శ్రీ దారపు గోవిందరాజులు, శ్రీ గానుగుల తరుణాచారి గార్లు మాట్లాడారు

ఒరిస్సా వరద పరిస్థితి

భువనేశ్వర్, ఆగస్టు 30

మూడుగ్రామాలు మహానదివరదలవల్ల కొంతవరకు దెబ్బతిన్నాయని బలంగీర్ నుంచి వచ్చిన వార్త తెలుపుతున్నది సుమారు 50 ఇళ్ళకు నష్టం వాటిల్లింది కొంత భూమిలో ఇసుక మేటలు పడ్డాయి

బ్రాహ్మణి దిగువ నీటిమట్టం పెరుగుతున్నట్టు సుందర్‌గర్ జిల్లాలోని పంపోష్‌నుండి వార్తవచ్చింది

బాలసోర్ జిల్లాలోని సాలందినది క్రితంరాత్రి పొంగి గతరాత్రినుంచి తగ్గుముఖం పట్టింది

ఆరుగురు పశ్చిమబెంగాల్ వైద్యులు వారి సహాయకులు కారి, భద్రక్ వరద ప్రాంతాలకు వెళ్లారు.

కాంగ్రెసు నాయకునిచే సల్ఫేట్ దొంగవ్యాపారం

నడిగూడెంనుండి లారీలో 54 బస్తాలు వేసికొని పోతుండగా పట్టివేత

మునగాల, ఆగస్టు 30

నల్లగొండ జిల్లా కాంగ్రెస్ నాయకుడు శ్రీ కొల్లు చినరామస్వామిగారు మూడురోజుల క్రితం అర్ధరాత్రి ఒక లారీలో 54 బస్తాల అమ్మోనియా సల్ఫేట్ వేసుకొని, విజయవాడ ప్రాంతంలో అమ్మడానికై వెళ్ళుతుండగా, పోలీసులు పట్టుకొని, సరుకును స్వాధీనపరచుకొన్నారు

లారీలో అమ్మోనియా సల్ఫేట్ తీసుకొని పోతున్నట్లు నడిగూడెం గ్రామ కమ్యూనిస్టుపార్టీ సభ్యులకు తెలిసింది వారు కాపలాకాచి, లారీ ఊరి వెలుపలకు రాగానే పట్టుకొన్నారు. ఈ విషయం మునగాల పోలీస్ స్టేషన్‌కు రిపోర్టుచేశారు. పోలీస్ సబ్ఇన్‌స్పెక్టర్ శ్రీ ఎల్ రామచంద్రారెడ్డిగారు నడిగూడెం వచ్చి, విచారణ జరిపారు. లారీలోఉన్న సల్ఫేట్‌ను స్వాధీనపరచుకొన్నారు (వి ని)

రాష్ట్ర ప్రెస్‌కౌన్సిలును నిర్మించాలి

కేరళ పాత్రికేయుల తీర్మానం

అలెప్పీ, ఆగస్టు 30

ప్రెస్ కమిషను చేసిన సిఫారసును అనుసరించి రాష్ట్ర ప్రెస్ కౌన్సిలును ఏర్పరచి రాష్ట్రంలో పత్రికా రచన అవకాశాలను, ప్రమాణాలను అభివృద్ధి పరచాలని కేరళ పాత్రికేయుల సంఘం, కేరళ ప్రభుత్వాన్ని కోరింది

పాట్నా జిల్లాలో వరదనష్టాలు

పాట్నా, ఆగస్టు 29

పశ్చిమ పాట్నాలోని దీనాపూర్, మసేరిషా థానాలలో 15 వేల ఎకరాల మొక్కజొన్న పంట గంగా, సోనే నదుల వరదల మూలంగా పూర్తిగా నాశనమైందని పాట్నా జిల్లా కాంగ్రెసు కమిటీ అధ్యక్షుడు శ్రీ ఆర్ ఎల్. సింగ్ నేడిక్కడ తెలియజేశారు

గత పక్షం రోజులుగా పెద్ద భూభాగాలు జలమయం కావడం వల్ల ప్రజలకు ఈ ఏడాది కష్టనష్టాలు అధికంగా కలిగాయని చెప్పారు 30 వేల మంది ప్రజలు వరదలకు గురిఅయ్యారని అన్నారు.

మలబార్ పట్ల వివక్ష: తాను పిళ్లైచే ఆరోపణల నిరాకరణ

తెల్లిచెర్రి, ఆగస్టు 30

మలబారు పట్ల వివక్ష ప్రదర్శిస్తున్నారని వచ్చిన ఆరోపణలను కేరళ ముఖ్యమంత్రి శ్రీ పట్టంతానుపిళ్లై నేడిక్కడ నిరాకరించారు.

ఈ ఆరోపణలు నిరాధారాలని కేరళ రాష్ట్రం నిర్మింపబడిన తరువాత మలబారు ప్రాంతంలో రోడ్లు, వంతెనలు, స్కూళ్ళు కట్టడానికి ఎక్కువ డబ్బు ఖర్చుపెట్టబడిందని చెప్పారు.

ఉద్యోగుల సమన్వయ సంఘంలో మలబారు సభ్యుని స్థానంలో ప్రధాన కార్యదర్శిని నియమించిన తరువాత ఫిర్యాదులు వచ్చాయని చెప్పారు కేంద్ర హోంమంత్రితో సంప్రదించి ఈ సంఘంలో సభ్యుడిగా ఆంధ్ర ఉద్యోగి శ్రీ ఆర్ ప్రసాదును నియమించామని అన్నారు

బోనసుపై తాతా కంపెనీ ప్రతిపాదన

కార్మిక సంఘం నిరాకరణ

జెంషెడ్‌పూర్, ఆగస్టు 28

1959-60 సంవత్సరానికి తాతా ఇనుము-ఉక్కు కర్మాగారంలో పనిచేసే కార్మికులకు డెబ్బయి ఐదు లక్షల రూపాయల తాత్కాలికబోనసు ఇస్తామంటూ కంపెనీ చేసిన ప్రతిపాదనను కార్మిక సంఘ అధ్యక్షుడు మిఖేల్ జాన్ గతరాత్రి నిరాకరించారు

ఇంతకుముందు ముప్పయిమూడు లక్షల రూపాయల బోనసు ఇస్తామంటూ కంపెనీచేసిన ప్రతిపాదనను కార్మిక సంఘం పూర్తిగా నిరాకరించింది కంపెనీకి 1959-60 లో వచ్చిన మొత్తం లాభం కోటి రూపాయలని తెలుస్తున్నది.

సంక్షేమ కార్యక్రమాల్లో పౌరసంఘాలకృషి

సంజీవరెడ్డి హితవు

కాట్నిముర్వారా, ఆగస్టు 28

సాంఘిక సంక్షేమ కార్యక్రమాలు నిర్విరామంగా కొనసాగేందుకై పౌరసంఘాలు ఏకమనస్సుతో కృషి చేయాలని కాంగ్రెసు అధ్యక్షుడు శ్రీ నీలం సంజీవరెడ్డి ఈ రోజు విజ్ఞప్తి చేశారు. కాట్నిముర్వారా మునిసిపాలిటీ ఏర్పాటు చేసిన సభలో ప్రసంగిస్తూ ఇలా అన్నారు

మునిసిపాలిటీలు పార్టీ రహిత ప్రాతిపదికపైన పనిచేయాలని ఆచార్య వినోబాభావే సూచించారు. అలాంటి ప్రయోగం వాస్తవంలో జయప్రదమైతే స్థానిక సంస్థల్లో రాజకీయ కక్షలను నిర్మూలించేదుకు కాంగ్రెసు పార్టీ అడ్డురాదు.

శనివారంనాడు జరిగిన బహిరంగ సభలో అధ్యక్షునికి 22381 రూపాయల నిధి సమర్పింపబడింది.

అస్సాం అధికారభాష

రాజకీయపక్షాల నాయకులతో చర్చలు

షిల్లాంగ్, ఆగస్టు 30

రాష్ట్ర అధికార భాషపై ప్రభుత్వం ఒక విధానాన్ని రూపొందించడానికి వీలుగా రాష్ట్రంలోని రాజకీయ పక్షాల నాయకులతోను, సాంస్కృతిక సంస్థలతోను తాను వెంటనే చర్చలు ప్రారంభించనున్నానని అస్సాం ఆర్థికమంత్రి శ్రీ ఫక్రుద్దీన్ అహ్మద్ నేడిక్కడ అన్నారు

ప్రారంభంలో ఈ చర్చలు ఇష్టాగోష్ఠిగా జరుగుతాయని, సెప్టెంబరు మధ్యలో అఖిలపక్ష సమావేశం జరుగుతుందని చెప్పారు

కల్లోలాల సందర్భంలో కొన్ని జిల్లాలలో తమ విధులను నిర్వర్తించడంలో విఫలులైన అధికారులపై వచ్చిన ఆరోపణలను విచారించడానికి ప్రభుత్వం ఒక సీనియర్ ఉద్యోగిని పంపించిందని శ్రీ అహ్మద్ చెప్పారు నేరం రుజువైన వారిపై గట్టిచర్య తీసుకొంటామని అన్నారు.

సెప్టెంబరు 1 నుండి కోర్కెల వారాన్ని జరపదలచిన విద్యార్థులను తమ ప్రయత్నాన్ని విరమించవలసినదిగా తాను కోరగలనని మంత్రి చెప్పారు

పటేల్, పట్వారీల లంచగొండితనం

కరీంనగరం తాలూకా కాంగ్రెస్ కార్యదర్శి విమర్శ

కరీంనగరం, ఆగస్టు 25

కరీంనగరం తాలూకాలో పటేల్, పట్వారీల లంచగొండితనం మితిమీరి పోయిందని తాలూకా కాంగ్రెస్ కార్యదర్శి శ్రీ కె. వి. లక్ష్మారెడ్డిగారు నేడొక ప్రకటనలో విమర్శించారు.

అందులో ఇలాఉంది

తాలూకాలో ఒకవైపున కరువు తాండవిస్తూవుండగా, పటేల్, పట్వారీలు లావుణీ కార్యాలయాలలో ప్రజలకు కొట్లాటలు పెడుతున్నారు. గ్రామాలలో పశువులకు బంచరాయి ఉంచకుండా లంచాలు తీసుకొంటున్నారు సర్వే నంబర్లువేసీ, వారే స్వయంగా దరఖాస్తులు వ్రాస్తున్నారు ఎకరం 1కి రు 10 నుండి 50 వరకు లంచాలు వసూలు చేస్తున్నారు. ఇట్టి లంచాలు తమకే కాదని, గిర్దావర్లకు, శేగిదార్లకు, పేష్కార్లకు, తహశీల్దారుకు కావాలని విపరీతంగా డబ్బు గుంజుతున్నారు.

లావుణీ కార్యాలయాలకథ ఈవిధంగా ఉంటే, గ్రామ పరిస్థితులలో చిన్న మొత్తాల పొదుపుకింద డబ్బు కట్టించుకోవడంకోసం డిప్యూటీ కలెక్టరు, తహశీల్దారు గ్రామాలలో తిరుగుతున్నారు. ఎరువుల తక్కావీలు, బావుల తక్కావీల వసూళ్ళకోసం భూములు జప్తులు చేస్తామని నోటీసులు ఇస్తున్నారు.

కావున ప్రభుత్వం లావుణీ కార్యాలయాలలో జరుగుతున్న అన్యాయాన్ని అరికట్టాలి తక్కావీ బకాయీల వసూళ్లు ఆపివేయాలి

మైకా కార్మికుల రిట్రెంచిమెంటు

కొత్త కూలిరేట్లు అమలుజరపకుండా యజమానుల ఆగడం

గూడూరు, ఆగస్టు 30

గూడూరులో మైకా ఫ్యాక్టరీ కార్మికులకు యీ మధ్య కొత్తగా ప్రకటించిన కనీస జీతాలు అమలు జరపకపోగా సంవత్సరాల తరబడి ఫ్యాక్టరీలలో పనిచేసిన స్త్రీ కార్మికులను తొలగించుచున్నారు కనీసం రిట్రెంచిమెంటు పరిహారం కూడ చెల్లించకుండా కార్మికులను నిలిపివేసున్నారు.

ఇప్పటివరకు నిలిపిన ఫ్యాక్టరీలు: ప్రీమియర్ మైకా ఫ్యాక్టరీలో 11 మంది; గూడూరు మైకా కంపెనీలో 28 మంది, శ్రీ పొన్నలూరు వీరరాఘవరెడ్డిగారి కాంటినెంటల్ మైకాఫ్యాక్టరీలో 180 మంది (ఈ 180 మందికి ఆగస్టు 1 న నోటీసు యిచ్చినట్లుగా ఆగస్టు 27 న నెంనోటీసు యిచ్చినారు.)

పారిశ్రామిక తగాదాచట్టప్రకారం రిట్రెంచిమెంటు చేయు కార్మికులకు రిట్రెంచిమెంటు నష్టపరిహారం చెల్లించుతూ ఒక నెల ముందుగా నోటీసు యివ్వవలసి యున్నది కాని గూడూరులో అట్లు జరగడం లేదు. మైకా సార్టింగు చేయువారికి రు 2, సాధారణ పనులుచేయు కార్మికులకు 1-75లు; 15-8-60 నుంచి అమలుజరపమన్నారు ఆంధ్ర ప్రభుత్వంవారు. కాని యథాప్రకారం కనీస కూలీ రు1-0-0 వంతున యిప్పటికి యిస్తున్నారు కొత్తరేట్లు అమలు జరపకుండా ఆలస్యం చేస్తున్నారు. నోరెత్తి మాట్లాడితే రిట్రెంచిమెంటు చేస్తారని కార్మికులు భయపడుచున్నారు (వి ని.)

'మీ శక్తిని కరువు నివారణకు వినియోగించండి'

ఆంధ్ర కాంగ్రెసునాయకులకు సంజీవరెడ్డి సలహా

హైదరాబాద్, ఆగస్టు 31

ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ నాయకులు రాష్ట్రంలోని కరువు పరిస్థితుల్ని రూపుమాపడంలో తమశక్తిని కేంద్రీకరించి పనిచేయాలని కాంగ్రెస్ అధ్యక్షులు శ్రీ సంజీవరెడ్డి నేడిక్కడ సలహా యిచ్చారు

ప్రదేశ్ కాంగ్రెస్ నాయకులకు మీ సలహా ఏమిటని ఒక విలేకరి ప్రశ్నించగా ఆయన పైవిధంగా చెప్పారు

మన రాష్ట్రంలోని పత్రికలు కరువు పరిస్థితులను గూర్చి వ్యాసాలు విదారకమైన వార్తలను ప్రచురిస్తున్నవి. ఉత్తరాది పత్రికలు కరువుపరిస్థితి తీవ్రతను గూర్చి పట్టలేదు అని ఆయన అన్నారు. రాష్ట్రంలోని కరువు తీవ్రతను గూర్చి రాష్ట్ర ప్రభుత్వం కేంద్రాన్ని బాగా ఒప్పించ గలిగితే కేంద్రం నుండి తగిన సహాయం లభిస్తుందనటంలో సందేహం లేదని ఆయన అన్నారు (పి టి)

రాయలసీమ కరువు నివారణ సంఘం - యూనిట్ఫ్రంటుకు పోటీగా ప్రభుత్వ సంఘం?

హైదరాబాద్, ఆగస్టు 31

రాయలసీమ ప్రాంతానికి చెందిన ప్రముఖ కాంగ్రెస్ నాయకులతో రాష్ట్ర ప్రభుత్వం "రాయలసీమ కరువునివారణ సంఘం" న్నొకదాన్ని నెలకొల్పింది. ఈ సంఘానికి శాసనసభ్యులు శ్రీ కె. కోటిరెడ్డి అధ్యక్షులు. శ్రీయుతులు నివర్తి వెంకటసుబ్బయ్య, పి బసిరెడ్డి కార్యదర్శులుగా వ్యవహరిస్తారు.

ఈ కమిటీలో సంబంధం వున్న వారినిచూస్తే ఈ కమిటీ, కాంగ్రెస్‌లోని అధికారపక్షానికి వ్యతిరేకముగా వారి "వ్యవసాయదార్ల సదస్సు" ఏర్పర్చిన కమిటీకి పోటీగా ఏర్పడినట్లు యిక్కడ అనుకుంటున్నారు.

రాయలసీమ జిల్లాలకుచెందిన ప్రదేశ్ కాంగ్రెస్ శాసనసభ్యులు, కాంగ్రెస్ కార్యకర్తల సమావేశం నిన్న ప్రణాళికామంత్రి ఇంట్లో జరిగింది. ఈ సమావేశానికి ముఖ్యమంత్రి, పి డబ్ల్యు డి. మంత్రి శ్రీ అల్లూరి, తదితరులు హాజరైనారు. వీరే సంఘాన్ని ఏర్పర్చారు. రాయలసీమను కరువుప్రాంతంగా ప్రకటించాలని ఈ సంఘం ప్రభుత్వాన్ని కోరింది.

ఈ కమిటీవారి కోర్కెలివి - (1) భూమిశిస్తు వసూళ్ళు, తక్కావీ అప్పులను తక్షణం నిలిపివేయడం;

(2) కొత్తగా ఋణాలు మంజూరు చేయడం, బావుల త్రవ్వకం, ఉన్న బావులను యింకా లోతుగా త్రవ్వడం;

(3) చౌక ధాన్యం డిపోలను ఏర్పర్చడం. (4) రోడ్డు, చిన్నతరహా ఇరిగేషన్ పనులు కల్పించడం,

(5 వ్యాధిగ్రస్తులకు, ముసలివారికి, అవిటివారికి ఉపకారవేతనాలివ్వాలి.

అదనంగా 1 లక్ష టన్నుల ఆహార ధాన్యాలను నిల్వ ఉంచాలని, రు. 20 కోట్ల కరువు నిధిని ఏర్పర్చాలని కూడా ఈ కమిటీ కోరింది వేరుశెనగ, తదితర ముంగారు పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయని సభ్యులు చెప్పారు బావులు ఎండిపోయాయని, చెరువులకు నీరు లేదని చెప్పారు ఆహార పదార్థాలధరలు చుక్కలంటుతున్నాయని ఒప్పుకున్నారు

రాయలసీమ జిల్లాలలో 20 మంది సభ్యులుగల ఒక సంఘం సెప్టెంబరు ఒకటి, రెండు వారాల్లో పర్యటించనున్నది (పి టి)

ఆంధ్రలో పాల సరఫరా పథకం

హైదరాబాద్, ఆగస్టు 31

విజయవాడ హైదరాబాదులలో సమగ్రమైన పాల సరఫరా పథకాన్ని తయారుచేసి, నిర్వహించేందుకై ఒక అధికారిని నియమిస్తూ రాష్ట్రప్రభుత్వం ధృవీకరించింది

ఐ రాసు సంస్థ సహాయంతో ఈ పథకాన్ని భారత ప్రభుత్వం అమలుపెట్టిన విషయం పాఠకులకు తెలిసినదే.

ఈ అధికారి కేంద్ర కార్యాలయం హైదరాబాద్‌లో వుంటుంది ఈ అధికారి పేరు శ్రీ పి ప్రభాకరరావు, ఐ ఎ ఎస్ ఈయన ఢిల్లీలో ఆంధ్రప్రభుత్వ అధికారిగా వున్నారు ఈయన స్థానంలో ఢిల్లీలో శ్రీ కె సి. సుందరను రాష్ట్రప్రభుత్వ అధికారిగా నియమించారు.

నిడదవోలు

ఈ నెల 21 వ తేదీన నిడదవోలు టైలర్సు యూనియను సమావేశము జనాబ్ మస్తాన్ సాహెబ్ గారి అధ్యక్షతన జరిగినది టైలర్ల సమస్యలపై శ్రీ పసుపులేటి సూరయ్య, స్థానిక పంచాయతీ సభ్యులు శ్రీ సామవ ప్రహ్లాద్, పట్టణ కమ్యూనిస్టుపార్టీ నాయకుడు శ్రీ టి వి రత్నం మొదలగు వారు మాట్లాడినారు టైలర్సు యూనియన్ మహాసభను అక్టోబరులో జరపుటకు గాను ఒక కమిటీని ఎన్నుకొన్నారు.

విజయవాడ మునిసిపాలిటీ లోగడ ఆమోదించిన పనులు

వెంటనే అమలుజరపాలని

ఒకటవ డివిజన్ కమ్యూనిస్టుమహాసభ విజ్ఞప్తి

విజయవాడ, ఆగస్టు 31

విజయవాడ మునిసిపల్ కౌన్సిల్‌లో లోగడ ఆమోదింపబడిన పనులన్నీ వెంటనే అమలుజరపాలని స్పెషల్ ఆఫీసరును కోరుతూ విజయవాడ ఒకటవ డివిజన్ కమ్యూనిస్టు మహాసభలో తీర్మానించారు.

విజయవాడపట్టణకమ్యూనిస్టు కమిటీ 1వ డివిజను మహాసభ ఈ నెల 21 వ తేదీన శ్రీ కె ఎస్ ఆర్ ఆంజనేయులుగారి అధ్యక్షతను జరిగింది. 78 గురు సభ్యులు హాజరైనారు. శ్రీ బూరాడ సీతారామయ్యగారు జాతీయ, అంతర్జాతీయ పరిస్థితులనూ, పార్టీ నిర్మాణ బాధ్యతలనూ వివరించారు

అంతకుముందు కాంతి చౌకులో పట్టణ కమ్యూనిస్టు నాయకులు శ్రీ తమ్మిన పోతరాజుగారు పతాకావిష్కరణ జరిపారు.

సాయంత్రం సమావేశంలో డివిజన్ కార్యదర్శి నివేదికను ప్రవేశపెట్టారు. చర్చల అనంతరం కొద్ది సవరణలతో అది ఆమోదించబడింది 9 మంది సభ్యులతో కూడిన కమిటీని ఎన్నుకున్నారు నూతన కమిటీకి కార్యదర్శిగా శ్రీ అండిమాని బ్రహ్మయ్య సహాయ కార్యదర్శిగా శ్రీ పంగులూరి కృష్ణమూర్తి, కోశాధికారిగా శ్రీ ఉప్పలపాటి సుబ్బరాజుగార్లు ఎన్నికైనారు.

1 వ వార్డులో ఒక మిడిల్ స్కూలు తెరవాలని, ఒక మార్కెటును కూడా కట్టాలని, మునిసిపల్ కౌన్సిలులో ఆమోదించబడిన పనులన్నీ వెంటనే అమలుజరపాలని మునిసిపాలిటీని కోరుతూ తీర్మానించారు.

పట్టణ మహాసభకు 21 మందిని ప్రతినిధులుగా ఎన్నుకొన్నారు.

వార్డు మహాసభలు

విజయవాడ - భాస్కరరావుపేట, భ్రమరాంబపురముల పార్టీశాఖా మహాసభ శ్రీ యస్ కృష్ణారెడ్డిగారి అధ్యక్షతను జరిగింది విడివిడిగానున్న యీ రెండుశాఖలు సంయుక్తంగా పనిచేయడానికి సభవారు ఏకగ్రీవంగా ఆమోదించారు

శ్రీ చలసాని వెంకటరత్నం ప్రవేశపెట్టిన ఉభయశాఖల కార్యకలాపాల నివేదికను ఏకగ్రీవంగా ఆమోదించారు తర్వాత పట్టణపార్టీ మహాసభకు 12 గురు ప్రతినిధులను ఎన్నుకున్నారు శ్రీ చలసాని వెంకటరత్నం కార్యదర్శిగా, శ్రీ అయితా రాములు సహాయ కార్యదర్శిగా, శ్రీయుతులు పూరి నాగభూషణం, అడపా సత్యం, కె సూర్యనారాయణమూర్తి, కృష్ణారెడ్డి, రాములు సభ్యులుగా శాఖా కమిటీని ఎన్నుకొన్నారు.

రెండు పేటల అభివృద్ధికిగాను కొన్ని తీర్మానాలు ఆమోదించబడిన తర్వాత సభ ముగిసింది.

19 వ శాఖా మహాసభ శ్రీ అంగా వెంకటరత్నంగారి అధ్యక్షతను ఆగస్టు 28వ తేదీన సుందర్ నగర్‌లో జరిగింది. పట్టణ కమిటీ కార్యదర్శి శ్రీ టి. వెంకటేశ్వరరావుగారు పాల్గొన్నారు.

శ్రీ రాఘవయ్యగారు గత రెండు సంవత్సరాల కార్యకలాపాల నివేదికను ప్రవేశపెట్టారు

పట్టణ పార్టీ మహాసభకు 6 గురు ప్రతినిధులను ఎన్నుకొన్నారు తర్వాత శ్రీ రాఘవయ్య తిరిగి కార్యదర్శిగా, శ్రీ అంగా సుబ్బారావు సహాయ కార్యదర్శిగా, శ్రీయుతులు అంగా వెంకటరత్నం, మల్లంపల్లి సుబ్బారావు, కొండా రామకోటయ్యగార్లు కమిటీ సభ్యులుగా ఎన్నికైనారు.

వార్డు ప్రజలు ఎదుర్కొంటున్న రోడ్డు, నీటి సప్లయి యిబ్బందులను తొలగించాలని, పార్కు స్థలాన్ని పెంచి, అందులో రేడియో పిల్లల ఆటసామాగ్రి ఏర్పాటు చేయాలని, పబ్లిక్ పాయిఖానాదొడ్లు నిర్మించాలని మునిసిపాలిటీ వారిని కోరారు. బావాజీపేట స్థలాన్ని స్లం ఇంప్రూవ్‌మెంటు చట్టంక్రింద ప్రకటించి, తక్కువ ధరకు ఆ స్థలాన్ని ప్రస్తుతం కాపురముంటున్నవారికి ప్రభుత్వంవారు యివ్వాలని తీర్మానాలు చేశారు

విజయవాడ 3 వ వార్డు కమ్యూనిస్టు శాఖా మహాసభ యీ నెల 21 వ తేదీ శ్రీ చొక్కా వెంకటేశ్వర్లుగారి అధ్యక్షతను జరిగింది. కార్యదర్శి శ్రీ గుంటి వెంకయ్యగారు ప్రవేశపెట్టిన నివేదికను సభవారు ఆమోదించారు

శాఖ కమిటీకి శ్రీ బూరాడ లక్ష్మణరావు, శ్రీ సంపర తాతబ్బాయి, శ్రీ గుండు సత్యనారావు, శ్రీ మతి సింహాద్రి గంగారత్నంగార్లను ఎన్నుకున్నారు శ్రీ గుంటి వెంకయ్యగారిని కార్యదర్శిగా ఎన్నుకున్నారు.

పట్టణ పార్టీ మహాసభకు ఎనిమిది మంది ప్రతినిధులను ఎన్నుకున్నారు.

వార్డులో మరుగుదొడ్లు వెంటనే నిర్మించాలనీ, ఉప్పర కాలువలో ఉన్న డ్రైనేజిని ఎప్పటికప్పుడు బాగుచేయించాలని కోరారు.

వచ్చే వేసవికాలానికైనా వార్డుమొత్తానికి చాలినంత నీరు అందించే ఏర్పాట్లు చేయాలనీ, అంతవరకూ తాత్కాలికంగా జమ్మిదొడ్డివద్ద ఉన్న బావికి టాంకు నిర్మించి పంపులు బిగించాలని కోరారు

పట్టణ సెక్రటేరియట్ తరపున శ్రీ రెండు మహాసభలకు శ్రీ కాయితాల కృష్ణమూర్తిగారు హాజరైనారు

విజయవాడ 9 వ వార్డు కమ్యూనిస్టు శాఖా మహాసభ ఆగస్టు 21-వ తేదీ శ్రీ యాది కొండలరావుగారి అధ్యక్షతను జరిగింది శ్రీ జి భీమలింగేశ్వరరావుగారు ప్రవేశపెట్టిన నివేదికను సభవారు ఆమోదించారు

కొత్తపేట మార్కెట్ చుట్టుపట్ల విచ్చలవిడిగా సాగుతున్న సారా వ్యాపారాన్నీ, జూదాన్నీ అరికట్టాలని పోలీసు అధికారులను కోరుతూ తీర్మానించారు.

మార్కెట్టు వెనుకభాగం అంటురోగాలకు నిలయంగా ఉందని, మునిసిపాలిటీవారు ప్రత్యేక శ్రద్ధ వహించి శుభ్రంచేయాలనీ, మార్కెట్టులో గ్రంథాలయంకొరకు నిర్మించిన గదిలో పఠనాలయాన్ని ప్రారంభించాలనీ కోరారు. ఒక గర్భిణీ స్త్రీని కొందరు కోడెకుర్రవర్తకులు ఈ నెల 4 వ తేదీన కడుపుమీద గుద్ది స్పృహ తప్పేలాగకొట్టా నీ పోలీసులకు రిపోర్టు చేస్తే పట్టించుకోలేదనీ, ప్రభుత్వానికి వైద్యాధికారులకూ [illegible], పిటీషన్ల ద్వారా తెలియజేసినా నేటి వరకూ పట్టించుకోనందుకు తీవ్రంగా ఖండిస్తూ తీర్మానించారు.

తర్వాత పట్టణపార్టీ మహాసభకు ఐదుగురిని ప్రతినిధులను ఎన్నుకొన్నారు. నూతన కార్యదర్శిగా శ్రీ జి. భీమలింగేశ్వర రావు గారినీ, సహాయకార్యదర్శిగా శ్రీ దేవిన వెంకటరమణ గారినీ ఎన్నుకున్నారు

విజయవాడ ఆరవ వార్డు కమ్యూనిస్టు మహాసభ సైలుపేటలో ఆగస్టు 28వ తేదీన శ్రీ కరీము అప్పారావుగారి అధ్యక్షతన జరిగింది. పట్టణకమిటీ తరపున శ్రీ రామచంద్రరాజు, శ్రీ బూరాడ సీతారామయ్య, శ్రీ తుర్లపాటి సింహాచలంగార్లు హాజరైనారు శ్రీ ఎస్. రంగారావు నివేదిక సమర్పించారు చర్చల అనంతరం అది ఆమోదింపబడింది. పట్టణ మహాసభకు 6 గురు ప్రతినిధులను ఎన్నుకున్నారు

శ్రీ ఎస్ రంగారావు, కార్యదర్శిగా, శ్రీ మల్లారావు, శ్రీ కరీము అప్పారావు, శ్రీ జి సత్యం, శ్రీ బి. అప్పారావుగార్లతో నూతన కమిటీ ఎన్నుకున్నారు

విజయవాడలో బియ్యం డిపోలు తెరవాలనీ, కొండపోరంబోకు స్థలాలలోని పాకలపై పెంట్లకు రద్దుపర్చాలని ప్రభుత్వాన్ని కోరుతూ తీర్మానించారు

గొల్లపాలెం గట్టు, బ్రేకుపేట, సైలుపేట, కొండప్రాంతంలో వీధి దీపాలు వేయాలనీ, కొండవాగులనుండి పాకలకు రక్షణగోడలు కట్టించాలనీ, కొండ ప్రాంతపు ప్రజలకు మంచినీటి సౌకర్యం కలిగించాలని మున్సిపాలిటీని కోరుతూ మరికొన్ని తీర్మానాలు చేశారు

సభలు - సమావేశాలు

భీమవరం తాలూకా ఆకివీడు బ్లాక్ కమ్యూనిస్టుపార్టీ మహాసభ సెప్టెంబరు 9, 10 తేదీలలో ఆకివీడులో జరుగుతుంది.

* * *

పార్వతీపురం తాలూకా కమ్యూనిస్టు మహాసభ సెప్టెంబరు నెల 4 వ తేదీన చిన్నబోరబాలో జరుగుతుంది మహాసభకు శ్రీ యస్. నాకి రెడ్డి ఎమ్. ఎల్. ఏ. గారు హాజరౌతారు.

నిరాయుధీకరణే నేడున్న అత్యంత ప్రధాన సమస్య

అంతర్జాతీయ పరిస్థితులపై లోక్‌సభలో ప్రధాని నెహ్రూ సింహావలోకనం

న్యూఢిల్లీ, ఆగస్టు 31

"గత నాలుగైదు నెలలుగా అంతర్జాతీయ పరిస్థితి మరింత అధ్వాన్నంగా తయారైంది. నేడు ప్రపంచంలో నిరాయుధీకరణ అనేది అత్యంత ప్రధానమైన సమస్యగా వుంది. వచ్చే ఐరాస సర్వప్రతినిధి సమావేశంలో నిరాయుధీకరణ సమస్య చర్చకు రానున్నందున ఆ సమావేశం అత్యంత ముఖ్యమైనది కావచ్చు. ఉద్రిక్త వాతావరణం వల్ల భారతదేశ ప్రణాళికా పథకాలు దెబ్బతినే ప్రమాదం వుంది" అని ప్రధాని నెహ్రూ నేడు లోక్‌సభలో విదేశ వ్యవహారాలపై చర్చను ప్రారంభిస్తూ చెప్పారు.

[శ్రీ నెహ్రూ ప్రసంగాన్ని క్లుప్తంగా దిగువ యిస్తున్నాం]

ప్రధాని నెహ్రూ యింకా యిలా అన్నారు: "నిరాయుధీకరణ అనేది ప్రధానంగా అణ్వస్త్రాలకు ఆయుధాలకు సంబంధించినదే అయినప్పటికీ, ఆ సమస్యలో ప్రతిపక్షానికి ఆసక్తి వుంది. ఎందుచేతనంటే, నిరాయుధీకరణకు ఏ పరిష్కారమార్గాన్నీ కనుగొనలేకపోతే అందువల్ల వచ్చే ఫలితాలు ఘోరంగా వుంటాయి కాబట్టి. నేటి సంక్షుభిత ప్రపంచంలో ఉద్రిక్త వాతావరణం పెరిగిపోతోంది. చిన్న చిన్న ఉద్రిక్తతలుగా జరిగే ఏ చిన్న ఘటనైనా సరే అది మొత్తం ప్రపంచాన్నే ముంచే మహాప్రమాదంగా వుంది. ఈ తరుణంలో భారతదేశం వంటి ప్రణాళికా పథకాన్నింటికీ ప్రాముఖ్యత లేకుండాపోతుంది.

"చివరకు ఎంతో ప్రధానమైన విషయాలలో సహితం ఈ రోజే కాలయాపన జరిగిపోయింది. నిరాయుధీకరణ సమస్యపై చర్చలు జరిపిన కమిటీలూ, కమిషన్లూ కేవలం చర్చలకే తయారైనాయి. ఫలితంగా అభివృద్ధిగానీ అంత జరగకుండా పోయింది. అణ్వస్త్రాల ఉత్పత్తి యింకా ఎక్కువైంది. ఈ విషయంలో ఏదో పరిష్కారం కోసం ప్రపంచ ప్రజలంతా ఎదురుచూస్తూ ఇదిగదిగో అంటూ నెలలనాటి మాట. తిరిగి ఈ సమస్య వచ్చే ఐరాస సమావేశం ముందుకు రానున్నది.

"ఈ సమావేశం అత్యంత ప్రాధాన్యత గలది కావచ్చు ఏమంటే నిరాయుధీకరణ సమస్య ఈ సమావేశంలో చర్చకు రానున్నది. ఈ సమస్యపై చర్చలో పాల్గొనేందుకు ప్రభుత్వాధినేతలుకూడా రావచ్చునని వార్తలు తెలుపుతున్నాయి. నిరాయుధీకరణ సమస్యపై చర్చను త్వరితం చేసి, ఆ సమస్య పరిష్కారానికి దారితీసే ఏ చర్యనైనా మనం బలపరుస్తాం.

"అంతేగాదు ఇటీవలనే స్వాతంత్ర్యం పొందిన అనేక ఆఫ్రికా దేశాలు మొదటి సారిగా ఐరాసలో అడుగు పెట్టనున్నందున కూడా ఇది అసాధారణ సమావేశం కానున్నది. ఐరాసలో ఆఫ్రికాదేశాల సభ్యత్వం తిరిగి ఒకటి రెండు సంవత్సరాల్లో ఇంకా పెరగనున్నది. ఇది మొత్తం ఆఫ్రికా ఖండంపైననే గాకుండా మొత్తం ప్రపంచ సాధారణ పరిస్థితిపైనకూడా ప్రభావం కలిగించనున్నది. ఐరాసపై కూడా దాని ప్రభావం వుండు."

"కాంగోలో ఐరాస చాల త్వరితంగానూ, సమర్థవంతంగానూ తన కార్యకలాపాలను సాగించింది. ఐరాస యే లేకపోతే కాంగోలో ఏమిజరిగివుండేదో చెప్పలేము. ఏమంటే కాంగోలో ఒకవైపున అంతర్జాతీయ కల్లోలం వుత్పన్నం, పెద్ద చిన్న దేశాలన్న భేదం లేకుండా ఇతర దేశాలు జోక్యం కల్పించుకునే అవకాశం వుంది. వాస్తవానికి కాంగో స్వాతంత్ర్యం ఎక్కువకాలం వుండేదికాదు. అందువల్లనే ఐరాస కాంగోలో ప్రవేశించడం మంచిదైంది. ఇతర భారతదేశంనుండి కాంగోకు సహాయమే కల్పించి ఆ దేశానికి సహాయార్థం మన అధికారులు వెళ్ళారు. మొత్తం 250 మంది వరకు భారతదేశంనుండి వెళ్ళి ముఖ్య అధికారుల్లో ఒకరు ఐరాస కార్యదర్శి సైనిక సలహాదారుడుగా నియమింపబడ్డారు. ఐరాస కార్యదర్శి కాంగోలో వ్యక్తిగత సలహాదారుడుగా నియమింపబడనున్నారు.

స్వతంత్ర ఆఫ్రికా దేశాల ఆవిర్భావం

"నేడు ఆఫ్రికాలో అనేక దేశాలు స్వాతంత్ర్యం పొందుతున్నాయి ఇది ప్రపంచ చరిత్రలో ప్రముఖ పరిణామం.

ఏకో బ్రిటిష్ ప్రాంతాలను ముఖ్యంగా పోర్చుగీసు వలసలను మినహాయిస్తే మిగతా ఆఫ్రికా ప్రాంతాలన్నీ స్వాతంత్ర్యం పొందాయి; లేదా త్వరలో పొందనున్నాయి. అయితే ఉత్తరాఫ్రికాలో ఆల్జీరియా ఒకటి వున్నది. అనేక సంవత్సరాలుగా ఇది కల్లోలిత ప్రాంతంగా వుంది అనేక నష్టాలు పొందింది. అనేక కష్టాల కోర్చింది. స్వాతంత్ర్య పోరాటంలో అనేక ఇక్కట్లు అనుభవిస్తోంది

ఆల్జీరియా

"ఆల్జీరియాకు స్వాతంత్ర్యం వుండాలని భారతదేశం ఎప్పుడూ చెప్తూనే వుంది ఫ్రెంచివారి ఆధీనంలోకిందవున్న మిగతా భూభాగాలన్నీ స్వాతంత్ర్యం పొందుతూండగా, ఆల్జీరియామాత్రం స్వాతంత్ర్యం లభించకపోవడం దురదృష్టకరమైన విషయం త్వరలో పరిష్కారం జరుగుతుందని, అదీ - ఆల్జీరియా స్వాతంత్ర్యాన్ని దృష్టిలో పెట్టుకునే జరుగుతుందనీ ఆశిస్తున్నాను.

"ఆఫ్రికా ఖండంలో వరి చీకటిలో బట్టుగాపడివున్న ప్రాంతాలు కొన్ని వున్నాయి. ఇవి పోర్చుగీసు వలసలు ఈ ప్రాంతంలో ఏమి జరుగుతుందో వాస్తవ సమాచారంకూడా అందడంలేదు కొంతకాలంకొంత ఇప్పుడిప్పుడే ఆ సమాచారం మనకు అందుతోంది అయితే అదైనా కొద్దిగా మాత్రమే ఏమైనా ఈ వలసలుకూడా స్వాతంత్ర్యపథంలోకి వస్తున్నాయి. మొత్తం ఆఫ్రికా అంతా స్వాతంత్ర్యపోరాటజ్వాలలు రేగుతూండగా ఇది సహజమే. వారి పోర్చుగీసు వలసల్లో వస్తున్న ఈ పరిణామాలు గోవాసమస్యపై ప్రభావం కలిగించక మానవు ఈ విషయంలో భారతదేశానికి ప్రత్యేకశ్రద్ధ వుంది

షిప్కీ-గ్రామ సమస్య

హిమాచల్ - టిబెట్ సరిహద్దు మీద షిప్కీ లాకనుగురించి శ్రీ నెహ్రూ ఇలా అన్నారు. శ్వేత పత్రాలలో అది ఎప్పుడూ భారత సరిహద్దుగానే వుంది కాని షిప్కీ గ్రామం మాత్రం కనుమకు అవతల వుంది; అది టిబెట్ ప్రాంతంలోనిదే. ఈ గ్రామాన్ని ఎప్పుడూ భారతదేశం తనదని వాదించలేదు.

అసాధారణ మార్పులు

తర్వాత ప్రపంచంలో వస్తున్న మార్పులను గురించి శ్రీ నెహ్రూ ప్రస్తావించి ఇలా అన్నారు:

"అసాధారణమైన మార్పులు జరిగే కాలంలో మనం వున్నాం. రోదసీయానం గురించి ప్రజలు మాటాడుతున్నారు ఇక్కడ వున్నవారి జీవితకాలంలోనే బహుశా మానవుని రోదసీయానం మనం కళ్ళారా చూడవచ్చేమో.

"ప్రస్తుతకాలంలో, సాంకేతిక ప్రగతిపై అద్భుతమైన అంతరంగిక విప్లవాలు జరుగుతున్నాయి. ఇవి మానవుని జీవితంపై, ఆలోచనపై, సామాజిక నిర్మాణంపై ప్రభావం కల్గించుతాయి ప్రతిదీ మారిపోతున్నది. ఇది అందరూ అర్థంచేసుకోవల్గిన విషయము"

శాస్త్రవిజ్ఞాన, సాంకేతిక పరిజ్ఞానాల అభివృద్ధి అంతర్జాతీయ వ్యవహారాలపై ఎలా ప్రభావం కల్గించుతుందో చెప్పడానికి తానీ విషయం ప్రస్తావించానని శ్రీ నెహ్రూ అన్నారు. సాంకేతికాభ్యుదయ పురోగమనమే, ఒకానొక దేశ అభివృద్ధికి నిజమైన నిదర్శనమని నెహ్రూ అన్నారు దైనందిన వ్యవహారాలు మాత్రమే చూసేవారు, సంకుచిత భావపరిధిలో కొట్టుమిట్టాడుతూ, తమచుట్టూ జరిగే అద్భుతమైన పరిణామాలను చూడలేకున్నారు

ఒక సిద్ధాంతంగాని, దృక్పథంగాని కుదించడానికి వీలులేదని శ్రీ నెహ్రూ అన్నారు. దృఢమైన, నిశ్చితమైన సిద్ధాంతాలు అంటూ కమ్యూనిస్టు ప్రపంచంలో పరిస్థితులు మారిపోతున్నాయి. ఉదాహరణకు ఒక అధునాతన యంత్రం కనిపెట్టినప్పుడు తీరా అది ఉత్పత్తి అయ్యేసరికి పాతదై అయిపోతున్నది. మారుతున్న పరిస్థితుల ప్రభావంగా ఆలోచనలో కూడా మార్పువస్తున్నది చివరికి కమ్యూనిస్టు సిద్ధాంతంకూడా ప్రధానంగా పారిశ్రామిక విప్లవ అభివృద్ధియే. ఇతరమైన మార్పులు జరిగినకొలదీ, దృక్పథంలోనికూడా మార్పు వస్తున్నది ఇంకా పాతవిధానాలూ, పదజాలాలూ వున్నప్పటికీ, విషయాలలో మార్పు వచ్చింది అలా వారు మారి తీరాలి లేకపోతే, మారుతున్న ప్రపంచాన్ని గా రందుకోలేరు - అని నెహ్రూ అన్నారు.

యుద్ధం అనివార్యమా? కాదా? అన్న చర్చ

యుద్ధం అనివార్యమా కాదా అనే సిద్ధాంత చర్చలను శ్రీ నెహ్రూ ప్రస్తావించి ఇలా అన్నారు.

శాంతియుత సహజీవనం గురించీ, పంచశీల గురించీ, యుద్ధం అనివార్యం అనే విషయం గురించీ, కొందరు చర్చలు కొనసాగించుతున్నారు భారతదేశంలో అంతగా ఈచర్చ సాగలేదు- బహుశా ఇక్కడకూడా కొంత సాగిందేమో

యుద్ధం అనివార్యం అవునా కాదా అనేది సిద్ధాంతీకర్తలు ఇతర విధాలా వాదవివాదాలు జరుగుతున్నట్టు పత్రికలలో చూశాను. ఒక వ్యక్తిగాని, వర్గంగాని యుద్ధం అనివార్యమని భావించినట్లయితే, నిరాయుధీకరణ వారి దృష్టిలో కట్టిపెట్టినట్లవుతుంది యుద్ధమే అనివార్యమైతే, నిరాయుధీకరణకు అర్థం లేదని మరికొన్ని దేశాల అభిప్రాయం. అందుచే సహజీవన శాంతియుత సహజీవనం అనే దానికి అపుడు అర్థం వుండదు. ఎందుకంటే, అపుడు నీవు తప్పనిసరిగా యుద్ధంవైపుకు పోతున్నావు. ఆ క్షణంనుండి, శాంతియుత సహజీవనం అనేది నిస్సందేహంగా దూరంచేస్తుంది అందువల్ల నీవుయుద్ధానికి సన్నాహాలు చేస్తావు.

యుద్ధం అనివార్యం అనే ఈ వాదన నన్ను ఆశ్చర్యపరచింది ఈ వాదన భారతదేశంలో జరగడం లేదనుకొంటాను. మరెక్కడో జరుగుతోంది

అనేక దేశాలు 'యుద్ధంఅనివార్యం' అనే భావాన్ని క్రమక్రమంగా, తిరస్కరించుతున్నాయి. దాదాపు అన్ని దేశాలు తిరస్కరించుతున్నాయనే చెప్పాలి యుద్ధం అనివార్యం అని భావించితే విభిన్న సమాజాలమధ్య, విధానాలమధ్య తప్పనిసరిగా ఘర్షణ వస్తుందని భావించితే, శాంతియుత సహజీవనం అనేదానికి అర్థంవుండదు యుద్ధం అనివార్యంకాదు అని, నమ్మినపుడే శాంతియుతసహజీవనంలో కూడా నమ్మకం ఏర్పడుతుంది యుద్ధం ఏదో అనుకోకుండా రావచ్చు అది వేరే విషయం. కాని యుద్ధం అనివార్యం అని భావించితే, యుద్ధాన్ని పూర్తిగా నిరోధించడానికి మీరు మనస్ఫూర్తిగా పనిచేయరు. యుద్ధం అనివార్యం అనే దానికీ, శాంతియుత సహజీవనానికీ పొసగదు.

ఈ సందర్భంలో ఒక సభ్యుడు మధ్యలో కలుగజేసుకొని, 'పంచశీలను అంటిపెట్టుకున్న ఒకానొక దేశం ఇప్పుడు యుద్ధం అనివార్యం అంటున్నది" అని అన్నారు.

ఈ విషయమై చాలా గందరగోళం వ్యాపించి యుండటంచేత తానీ విషయాన్ని సభముందు వుంచనని శ్రీ నెహ్రూ అన్నారు.

ఉమ్మడి రక్షణ

'ఉమ్మడి రక్షణ' మొదలైన వాటిని గురించి కొందరు అంటున్న విషయాన్ని ప్రస్తావించి, శ్రీ నెహ్రూ, ఒక కూటమితో లేక మరో కూటమితో చేరాలని మాట్లాడేవారు "విచిత్రమైన గందరగోళం" ప్రదర్శించుతున్నారని అన్నారు.

శ్రీ నెహ్రూ ఇంకా ఇలాఅన్నారు: ఉమ్మడి రక్షణలగురించీ, అవి అవసరమా కాదా అనే విషయాలగురించీ మాట్లాడేవారు, భారతదేశ ప్రధానవిధానాన్నే మరచిపోతున్నారు. ఉమ్మడి రక్షణ గురించి ఆలోచించడమంటే, గత పన్నెండేళ్ళనుపైగా అంటిపెట్టుకున్న విధానాలను వ్యక్తిచెప్పడమన్నమాట మీరీ విషయాన్ని గురించి ఏది మంచిది, ఏది చెడ్డదని చర్చించవచ్చు. కాని మన స్వతంత్ర విధానాన్ని, మనం సహాయం పొందినా కూడా ఏ కూటమిలో చేరని విధానాన్ని వదులుకోరాదు.

వివిధ దేశాలుచేసే సహాయం అనేక విధాలుగా వుంటుంది. కాని అన్నిటికన్న మించి సహాయం ఆ దేశంతో స్నేహసంబంధాలు కల్గియుండటం మనకు అవసరమైన భౌతిక సహాయం కావాలనుకొంటే, ఋణరూపేణా తీసుకుందాం. కాని ఆయుధాలు మొదలైన సహాయంవైపుకు పోయామా, సైనిక ఆలోచనలకు దిగుతాం. అపుడు రెండుపక్షాలవైపుకుగాక, ఒక పక్షం వైపు మొగ్గుతాం. దానిఫలితంగా మన ప్రధానధోరణిని వదులుకోవలసి వస్తుంది. ఇతరులవైపు మొగ్గవలసి వస్తుంది ప్రచ్ఛన్నయుద్ధంలోకి, మనకు ఇష్టం వున్నా లేకపోయినా దిగుతాం. అందుచే ఈ విషయంపై మనకు స్పష్టమైన అభిప్రాయం వుండాలి. ప్రచ్ఛన్నయుద్ధం కావాలనుకొంటే అది వేరేవిషయం. వాటివల్ల తర్వాతవచ్చే ఫలితాలను గురించి తెలుసుకోకుండా ఆ విషయాలగురించి మనం మాట్లాడరాదు.

ఏ కూటమిలోనూ చేరరాదనే భారతదేశ విధానం దాదాపు ప్రపంచంలోని అన్నిదేశాలకైన శక్తింతప్రమా అభిప్రాయాన్ని కలుగచేసింది చిన్న పెద్దదేశాలు దానిని హర్షించాయి అంతర్జాతీయ వ్యవహారాలలో మనం అవలంబించిన విధానాలు, భారతదేశ ఆశయానికేగాక, ప్రపంచానికి ప్రపంచశాంతికీకూడా సేవ చేశాయి. (హర్ష ధ్వానాలు.)

తైవాన్ విషయంలో అమెరికా దుష్టపాత్ర

క్యూబా ప్రధాని కాస్ట్రో ఖండన

హవానా, ఆగస్టు 31

క్యూబా ప్రధాని డాక్టర్ ఫైడెల్ కాస్ట్రో నేడు చేసిన ముఖ్యమైన ప్రసంగంలో అమెరికా ప్రభుత్వ విధానాలను విమర్శిస్తూ, తైవాన్ విషయంలో అమెరికా వైఖరిని కూడా ఖండించారు

"అమెరికా ప్రభుత్వం తైవాన్‌లో తన కీలుబొమ్మ చాంగ్-కైషేక్‌ని బలపరుస్తూంది. అతని రక్షణకోసం అక్కడ తన నావికాదళాలను ఉంచింది చైనా ప్రజలు ఆ కీలుబొమ్మను తుడిచి పెట్టి తైవాన్‌ని విముక్తం చేసుకోకుండా అడ్డుపడుతూంది" అని ఆయన అన్నారు.

ఇంతవరకు బెల్జియమ్ క్యూబాకు ఆయుధాలను అమ్ముతూ ఉండేదనీ, ఇప్పుడు అమెరికాప్రభుత్వం ఒత్తిడి చేయడంవల్ల బెల్జియమ్ అమ్మడం మానివేసిందనీ కాస్ట్రో తెలిపారు

కోస్టారికాలో జరిగిన అమెరికా దేశాల విదేశాంగమంత్రుల సమావేశ ప్రకటనను ఖండిస్తూ క్యూబా ప్రజలు ఆత్మరక్షణకోసం సంపూర్ణ ఆయుధధారణ చేయడమే కర్తవ్యమని కాస్ట్రో ఉద్బోధించారు. మాతృదేశ రక్షణ విషయంలో క్యూబా ప్రజలు ఎంత పట్టుదలతో వున్నారో స్పష్టపరిచేందుకు సెప్టెంబరు రెండవ తేదీ హవానాలో బ్రహ్మాండమైన ప్రజాప్రదర్శనం జరుగుతుందని తెలిపారు.

క్యూబా యింతవరకు చాంగ్‌ముఠాతో దౌత్య సంబంధాలు కలిగి వుంది అయితే ఆముఠాను ఖండించడం కాస్ట్రో ప్రభుత్వం మానలేదు. చాంగ్ ముఠాను గుర్తించడం మానివేసి చైనా ప్రభుత్వంతో కాస్ట్రో ప్రభుత్వం దౌత్య సంబంధాలను ఏ క్షణంలోనైనా పెట్టుకోవచ్చునని ఇక్కడ రాజకీయవర్గాలు అంటున్నారు

క్యూబాలో అమెరికా మొరటు జోక్యం

గ్రోమికో విమర్శ

మాస్కో, ఆగస్టు 30

క్యూబా అంతరంగిక వ్యవహారాల్లో అమెరికా ప్రభుత్వం మొరటుగాజోక్యం కలిగించుకొంటున్నదని సోవియట్ విదేశాంగమంత్రి ఆండ్రీ గ్రోమికో నేడు నిశితంగా విమర్శించారని 'టాస్' వార్తాసంస్థ తెలిపింది

అమెరికా దేశాల విదేశాంగ మంత్రుల సమావేశంలో ఆగస్టు 25వ తేదీన అమెరికా విదేశాంగమంత్రి క్రిస్టియన్ హెర్టర్ చేసిన ఒక ప్రసంగాన్ని విమర్శిస్తూ గ్రోమికో ఈ మాట అన్నారు. క్యూబా అంతరంగిక వ్యవహారాల్లో మొరటుగా జోక్యం కలిగించుకుంటున్నదనేందుకు హెర్టర్ ప్రసంగమే ఒక నిదర్శనమని గ్రోమికో అన్నారు

మైనారిటీ భాషల కమిషనర్ అస్సాం పర్యటన

షిల్లాంగ్, ఆగస్టు 31

భారత ప్రభుత్వ మైనారిటీ భాషల కమిషనర్ సెప్టెంబరు ఎనిమిదో తేదీనుండి అస్సాంలో పర్యటించుతారు

ఆయన ఆరాష్ట్రగవర్నరును, ముఖ్యమంత్రిని, అధికారులను, ఇతర ప్రజానాయకులను కలుసుకొని భాషలరీత్యా మైనారిటీలుగా వున్న వర్గాల వారి ప్రయోజనాలను కాపాడేందుకు తీసుకోవలసిన చర్యలను గురించి చర్చించుతారు.

రాయలసీమలో కమ్యూనిస్టు పార్టీ ఉపసంఘం పర్యటన

సెప్టెంబరు 7 నుండి ప్రారంభం

హైదరాబాద్, సెప్టెంబరు 1

ఆంధ్ర ప్రదేశ్ కమ్యూనిస్టు సమితి కార్యవర్గం, రాష్ట్రంలోని కరువు ప్రాంతాల పర్యటనకై నియమించిన ఉపసంఘం సెప్టెంబరు 7వ తేదీ కర్నూలునుండి బయలుదేరి కర్నూలు, అనంతపురం, చిత్తూరుజిల్లాల్లో నాల్గురోజులపాటు పర్యటిస్తుంది.

అక్కడి పరిస్థితులు స్వయంగా పరిశీలించిన తరువాత, పార్టీకి రాష్ట్ర ప్రభుత్వానికి ఒక విజ్ఞప్తి పత్రం సమర్పిస్తుంది

ఈ కమిటీ సభ్యులు శ్రీ కొల్లా వెంకయ్య, బి ఎల్లమందారెడ్డి, జి బాపనయ్య, తరిమెల నాగిరెడ్డి.

ఈ నెల 24 న జిల్లా కలెక్టర్ల సమావేశం

హైదరాబాద్ సెప్టెంబరు 1

ఆంధ్రప్రదేశ్‌లోని కరువు ప్రాంతాల పరిస్థితిని గురించి చర్చించేందుకై ప్రభుత్వం ఈ నెల 24న జిల్లాకలెక్టర్ల సమావేశం ఏర్పాటు చేసింది సమావేశానికి ఉపముఖ్యమంత్రి శ్రీ కె. వి. రంగారెడ్డి అధ్యక్షత వహిస్తారు

నేడు మంత్రివర్గం సమావేశమై కరువు పరిస్థితులను గురించి చర్చించింది.

కె. వి. రంగారెడ్డిగారి ప్రకటన

హైదరాబాద్, ఆగస్టు 31

వివిధ ప్రాంతాలలో కరువు పరిస్థితుల్ని గూర్చి చర్చించేందుకుగాను త్వరలో హైదరాబాద్‌లో జిల్లా కలెక్టర్ల సమావేశం జరపనున్నామని రాష్ట్ర ఉపముఖ్యమంత్రి శ్రీ కె వి రంగారెడ్డిగారు హైదరాబాద్ జిల్లా పరిషత్ సమావేశంలో ప్రసంగిస్తూ ప్రకటించారు.

హైదరాబాద్ జిల్లాలోని కరువు పరిస్థితులను పరిశీలించి, తన్నివారణమార్గం సూచనలు చేసేందుకై పరిషత్ వారు అయిదుగురు సభ్యులతో ఒక ఉపసంఘాన్ని నియమించారు ఈ సంఘం సెప్టెంబరు 10 లోగా తన నివేదికను సమర్పించాల్సి వుంది. సమావేశంలో మాట్లాడిన అనేకమంది సభ్యులు శిస్తు వసూళ్ళను, తక్కావీ ఋణాల వసూళ్ళను వాయిదా వేయాలని కోరారు.

వర్షాభావంవల్ల మొంగారు పంట పూర్తిగా పాడైపోయిందని తెలుస్తోంది. ఇప్పుడైనా వర్షాలు కురిస్తే 100కి 15 పాళ్ళుమాత్రం పెట్టుబడులు దక్కుతాయని అంటున్నారు. జిల్లా పరిషత్తు సభ్యులంతా నేటి సమావేశానికి హాజరయ్యారు. మొత్తం 26 అంశాలను చర్చించారు.

జిల్లాలో తాత్కాలికంగా 25 చౌకధాన్యపు దుకాణాలు తెరవాలని నిశ్చయించబడింది. కనీసం వంద దుకాణాలైనా తెరవాలని సభ్యులుకోరారు. చిన్న మొత్తాల పొదుపు ఉద్యమంలో ఈ ఏడు కోటిరూపాయలు వసూలు చేయాలని యిదివరలో కోటా తీసుకొన్నారు. యిప్పటికి 28 లక్షల రూపాయలు వసూలయ్యాయి.

వికేంద్రీకరణ ఎలా పనిచేస్తున్నదీ చూడటానికై గుజరాత్‌నుండి వచ్చిన ముగ్గురు సభ్యులు, జిల్లా పరిషత్తు సమావేశ చర్చలను తిలకించారు.

గోదావరి లాంచి ప్రమాదం

దర్యాప్తుకు సంఘం నియామకం

హైదరాబాద్, ఆగస్టు 31

ఇటీవల గోదావరి నదిలో పోలవరం వద్ద కూటుగుంట సమీపంలో జరిగిన లాంచి ప్రమాదాన్ని గూర్చి విచారణ జరిపేందుకై రాష్ట్రప్రభుత్వం ఒక సంఘాన్ని నియమించింది

ఈ సంఘానికి కలెక్టర్ శ్రీ ఎమ్. సర్దార్‌ఖాన్ అధ్యక్షులుగా వుంటారు. గోదావరి లాంచీ ప్రమాదంలో 16 గురు వ్యక్తులు మరణించిన విషయం పాఠకులకు విదితమే.

సేవచేసే పార్టీ

లోక్‌సభలో ఒక సూచన

న్యూఢిల్లీ, ఆగస్టు 30

కాంగ్రెస్‌ను "పాలకవర్గపార్టీ" అని ప్రతిపక్షాన్ని "ప్రతిపక్షపార్టీ" అని స్పీకర్ వర్ణించరాదనీ, కాంగ్రెస్‌ను "సేవచేసేపార్టీ" గానూ, ప్రతిపక్షాన్ని "సహాయకపార్టీ"గానూ చెప్పాలనీ స్వతంత్ర సభ్యులు శ్రీ మహేంద్ర ప్రతాప్ నేడు లోక్‌సభలో సూచించారు.

హిరేన్ ముఖర్జీ

(1వ పేజీ తరువాయి)

రుద్ఘాటించవలసిందిగా నెహ్రూను శ్రీ ఇందులాల్ యాజ్ఞిక్ కోరారు

జయపాల్ సింగ్ (జార్ఖండ్) చైనాతో సంప్రతింపులు కొనసాగించే భారత ప్రభుత్వ విధానం విఫలమయిందని అన్నారు సంప్రతింపులతో చైనాకు సత్సంబంధం లేదనీ అలా ఉపాయం కాటిని కొనసాగించడంలో అర్థంలేదనీ అన్నారు

విజయనగరం మహారాజ కుమార్ (కాంగ్రెస్, చైనా మళ్లీ దురాక్రమణ జరిపితే సైనిక చర్య తీసుకోవాలని అన్నారు

కాశ్మీర్ సభ్యుడు ఎ యం తారిక్ మాట్లాడుతూ, కాశ్మీర్ భారతదేశంలో భాగం అనీ, పాకిస్తాన్‌కు దానం చేయడానికి అది ఎవరి స్వంత ఆస్తి కాదని స్పష్టంచేయాలని కోరారు.

పాకిస్తాన్‌తో ఉమ్మడిరక్షణ పనికి రాదని జనసంఘ సభ్యుడు ఎ బి వాజ్‌పాయ్ అన్నారు. శ్రీ యుతులు సురేంద్రమహాంతి (గణతంత్రపరిషత్) జయపాల్ సింగ్ (జార్ఖండ్), డాక్టరు రామ్‌సుభాగ్ సింగ్ [కాంగ్రెస్] చైనాను ఖండించుతూ మాట్లాడారు. లడాక్‌లో ఈశాన్య ప్రాంతంలో చైనా సైనికులను భారతదేశపు గస్తీ దళాలు మన దేశంలోకి రానీయకుండా ఉండవలసిందని రామ్ సుభాగ్‌సింగ్ అన్నారు.

"ప్రపంచ ప్రజలంతా ఆశించిన శిఖరాగ్ర సమావేశం అమెరికా చర్యవల్ల విఫలమైంది. ఈ విషయంలో క్రుశ్చేవ్‌కు వచ్చిన కోపం, దౌత్య వ్యవహారాల్లో రెండు కాల్పుల ధోరణికి వ్యతిరేకంగా సామాన్య మానవుడు కనపరచే కోపాన్ని ప్రతిబింబించింది నిరాయుధీకరణ ప్రతిపాదనను భారత ప్రభుత్వం బలపరచాలనేది సంతోషకరమైన విషయం

భారతదేశం సభ్యత్వంగా వున్న అంతర్జాతీయ కమిషన్ వుండగానే, దక్షిణ వియత్నాంలో సైనిక సమీకరణ జరగడం శోచనీయం భారత ప్రభుత్వం తూర్పు జర్మనీని గుర్తించాలి గోవా పట్ల మన విధానం సరిగా లేదు

నేడు లోక్‌సభలో జరిగిన విదేశాంగ వ్యవహారాలచర్చలో, కాంగ్రెస్ సభ్యులు చైనాపట్ల ప్రభుత్వవిధానాన్ని బలపరచారు ప్రజాసోషలిస్టుపార్టీ సభ్యుడు నాథ్‌పాయ్, ప్రభుత్వం ఈ విషయంలో విఫలమయిందని విమర్శించారు స్వతంత్రపార్టీ నాయకుడు శ్రీ రంగా భారతదేశ విదేశాంగవిధానం ప్రధానంగా విఫలమయిందనీ, అందువల్లనే చైనా దురాక్రమణ సంభవించిందనీ అన్నారు

నెహ్రూ పాకిస్తాన్ పర్యటన ఫలితంగా ఆ దేశంతో సత్సంబంధాలు ఏర్పడాలని, రంగా, నాథ్‌పాయ్‌లు ఆశించుతున్నామని అన్నారు.

ప్రదేశ్ కాంగ్రెస్ స్థితికి సంజీవరెడ్డి విచారం

హైదరాబాద్, ఆగస్టు 31

ఆంధ్ర ప్రదేశ్ కాంగ్రెస్ ప్రస్తుత వ్యవహారాలు తమకు విచారం కలిగిస్తున్నాయని అఖిల భారత కాంగ్రెస్ అధ్యక్షుడు శ్రీ సంజీవరెడ్డి నేడు బేగంపేట విమానాశ్రయంలో పత్రికలవారితో మాట్లాడుతూ చెప్పారు.

శ్రీ సంజీవరెడ్డి ఢిల్లీనుండి బెంగుళూరు వెళ్తూ ఇక్కడ విమానాశ్రయంలో కొంతసేపు ఆగారు. ఆ సందర్భంలో మాట్లాడుతూ ఆయన యింకా యిలా అన్నారు:

"ప్రదేశ్ కాంగ్రెస్ వ్యవహారాలపై శ్రీ కామరాజ్ నాడార్ తయారుచేసిన నివేదికను నేనింకా చూడలేదు పర్యటన జరిపిరావడం వల్ల నేను ఢిల్లీలో లేను. ప్రస్తుత ప్రదేశ్ కాంగ్రెస్ వ్యవహారాలు నాకు విచారం కలిగిస్తున్నాయి. ఇంతకన్నా నేను వ్యాఖ్యానించ దలిగింతేమీలేదు. నాకు యితర రాష్ట్రాల్లో చాలా తొందరపనులున్నాయి ప్రదేశ్ కాంగ్రెస్ రాజకీయాల్లో నేను జోక్యం కల్పించుకో దలచలేదు అఖిలభారత కాంగ్రెస్ వ్యవహారాలను అగ్రనాయకత్వం పంచుకొని వ్యక్తీకరించడంద్వారా నిర్వహిస్తోంది ఆంధ్ర కాంగ్రెస్ వ్యవహారాలను అగ్రనాయకుల్లో ఒకరు చూడగలరు.

బెల్జియన్ సేనల పూర్తి నిష్క్రమణ

ఎలిజబెత్‌విల్లీ, ఆగస్టు 30

కాంగోలోని బెల్జియన్ సేనలు నేడు తమ నిష్క్రమణను సమగ్ర సైనిక గౌరవాలతో పూర్తి చేశాయి.

1965 తర్వాత కూడా ఇంగ్లీషు అధికార భాషగా వుండడానికి వీలుకల్పిస్తూ త్వరలో బిల్లు

న్యూఢిల్లీ, ఆగస్టు 31

1965 సంవత్సరం తర్వాతకూడా ఇంగ్లీషును అధికార భాషగా వాడడాన్ని గూర్చి ఇటీవల ఒక పత్రికా గోష్ఠిలో ప్రధాని నెహ్రూ చేసిన ప్రకటనను ఆమోదించేందుకై భారత రాజ్యాంగంలో 343వ నిబంధనానుసారం ఒక బిల్లును పార్లమెంటులో త్వరలో ప్రవేశపెట్టనున్నారు ఈ విషయాన్ని కేంద్ర హోంశాఖ ఉపమంత్రి శ్రీ దాతార్ నేడు రాజ్యసభలో వెల్లడించారు.

1965 తరువాత కూడా ఇంగ్లీషు భాష వాడకంలో వుండడానికి ఈబిల్లు అవకాశం కల్పిస్తోందన్నారు

అటువంటప్పుడు హిందీని ఉద్యోగులంతా తప్పనిసరిగా నేర్చుకోవాలనీ పరీక్షలు వ్యాపకాలనీ హోంశాఖ ఒత్తిడి తెస్తూ ఉత్తర్వులిచ్చిందని ఒక సభ్యుడు ప్రశ్నించారు. దానికి మంత్రి సమాధానమిస్తూ, హోంశాఖ జారీ చేసిన ఉత్తర్వులు, రాష్ట్రపతి ఉత్తర్వును జాగ్రత్తగా పరిశీలిస్తే అందులోని హామీకి ఏమాత్రం వ్యతిరేకంగా లేవన్నారు.

శ్రీ భూపేష్‌గుప్త (కమ్యూనిస్టు): ఇటీవల మద్రాసులో అగ్రనాయకుడు జారు చేసిన ప్రసంగం, ప్రధాని నెహ్రూ ప్రకటనలకు, హామీలకు విరుద్ధంగా వుందని విమర్శ వచ్చిన సంగతి మంత్రిగారికి తెలుసా?

శ్రీ దాతార్: ప్రధాని నెహ్రూ ప్రకటన స్పష్టంగానే వుంది.

శ్రీ గుప్త: కాని ఆ అగ్రనాయకుని ప్రసంగం మాటేమిటి?

దానికి మంత్రినుండి సమాధానం లేదు

పార్లమెంటులో ప్రశ్నోత్తరాలు

సహకార వ్యవసాయ ప్రచార సంఘం

న్యూఢిల్లీ, ఆగస్టు 31

రైతులలో సహకార వ్యవసాయాన్ని బాగా ప్రచారం చేసేందుకై అధికారులతోనూ, అనధికారులతోనూ కలిపి ఒక ప్రత్యేక సంఘాన్ని నియమించాలన్న ప్రతిపాదన కేంద్ర ప్రభుత్వం ఆలోచనలో వుందని కేంద్ర సమాజాభివృద్ధిశాఖ ఉపమంత్రి శ్రీ బి ఎస్ మూర్తి నేడు లోక్‌సభలో ఒక ప్రశ్నకు సమాధానంగా చెప్పారు ప్రయోగ ప్రాతిపదికపై సహకార వ్యవసాయ సంఘాలను ఏర్పాటు చేయాలన్న సూచనను ప్రభుత్వం ఆమోదించిందని కూడా ఆయన తెలిపారు. ప్రతి జిల్లాకు ఇటువంటి ప్రయోగ పథకాన్నందివ్వాలని ఆలోచిస్తున్నట్లు ఆయన చెప్పారు

పాకిస్తాన్ పౌరుల రాకపోకలు

తమ దేశంలోని ఒక ప్రాంతం నుండి మరో ప్రాంతానికి భారత భూభాగంద్వారా పౌరుల రాకపోకలకు వీలు కల్పించవలసిందిగా పాకిస్తాన్ ప్రభుత్వం చేసిన సూచనను భారత ప్రభుత్వం పరిశీలిస్తోందని కేంద్ర రైల్వేల మంత్రి శ్రీ జగ్జీవన్ రామ్ నేడు లోక్‌సభలో తెలియజేశారు.

అటువంటి సౌకర్యాలను యిచ్చే పక్షంలో అవి ఉభయత్రా వుండాలని కూడా ఆయన ఒక ప్రశ్నకు సమాధానంగా చెప్పారు తూర్పు పాకిస్తాన్ నుండి భారత రైల్వే మార్గంద్వారా పశ్చిమ పాకిస్తాన్‌కు

విజయవాడలో లారీ ప్రమాదం

స్త్రీ మరణం

విజయవాడ, ఆగస్టు 31

విజయవాడలోని కార్మికవాడ దగ్గరలో నేటి మధ్యాహ్నం సుమారు 12 గంటలకు లారీ పైనపోవటంవల్ల బొడ్డుకూరి గురవమ్మ అనే స్త్రీ చనిపోయింది. లారీడ్రైవరు శ్రీ దాస్. నాగేంద్రం పోలీసు స్టేషనుకు వెళ్ళి రిపోర్టు యిచ్చాడు.

సర్కిల్ ఇన్స్పెక్టరు శ్రీ రామచంద్రరావు, సబ్ ఇన్స్పెక్టరు శ్రీ డి వెంకటేశ్వర్లుగారు దర్యాప్తు జరుపుతున్నారు ప్రభుత్వ ఆస్పత్రికి శవ పరీక్షకు పంపించారు. (వి. వి)

అంతర్జాతీయ అభివృద్ధిసంఘ బిల్లు

రాజ్యసభ ఆమోదం

న్యూఢిల్లీ, ఆగస్టు 31

అంతర్జాతీయ అభివృద్ధి సంఘ (ప్రతిపత్తి, హక్కుల) బిల్లు (1960) ను రాజ్యసభవారు నేడు ఆమోదించారు. ఈ బిల్లును లోక్‌సభ ఇంతకుముందే ఆమోదించింది.

హజ్ యాత్రీకులను చేరవేసేందుకు ప్రత్యేక రైలును నడపడానికి అనుమతియివ్వవలసిందిగా ఇటీవల పాకిస్తాన్ ప్రభుత్వం కోరిందనీ, ఇందుకు భారత ప్రభుత్వం అంగీకరించిందనీ ఉపమంత్రి తెలిపారు.

కృత్రిమ గర్భోత్పత్తి

ప్రభుత్వం తనవరకైనా కృత్రిమగర్భోత్పత్తి పద్ధతిని ప్రారంభించడంలేదనీ అయితే హైదరాబాద్, బొంబాయిలలోని కుటుంబనియంత్రణ కేంద్రాలలో ఈ పద్ధతి జయప్రదంగా సాగుతూందనీ కేంద్ర ఆరోగ్యశాఖామంత్రి శ్రీ కర్మార్కర్ నేడు లోక్‌సభలో తెలియజేశారు.

యస్.ఆర్.ఎం
గ్రేడ్ 1
4 - జా
రివర్సిబుల్ ఇండిపెండెంట్ లేత్ ఛక్స్
ఎంతటి బరువు పనినైనా, నైపుణ్యంగల ప్రమాణంతో పనిచేయగలదని
ధృవపడినది
లభ్యమగు సైజులు: 6"-8"-10"
12"-14"-16"-18"-20" & 24"
తయారు చేయువారు
శ్రీ రామ్ మిల్స్, లి., బొంబాయి-13
BATLIBOI
సోల్ ఏజెంట్లు:
బాట్లీబాయ్ & కంపెని
(ప్రొ: భోగిలాల్ లెహర్‌చంద్ (ప్రైవేట్) లిమిటెడ్, ఫోర్బస్ స్ట్రీట్, బొంబాయి-1
బ్రాంచీలు: విజయవాడ, అహమ్మదాబాద్, కలకత్తా, కోయంబత్తూరు, ఢిల్లీ, కాన్పూర్, మద్రాసు, సికింద్రాబాదు.
ఏసోసియేట్ బెంగుళూరు.



సంపాదకవర్గం: మోటూరు హనుమంతరావు (అధ్యక్షులు), కాట్రగడ్డ రాజగోపాలరావు, ఏటుకూరు బలరామమూర్తి విశాలాంధ్ర విజ్ఞాన సమితి తరఫున ఎడిటర్, ప్రింటర్ అండ్ పబ్లిషర్ కాట్రగడ్డ రాజగోపాలరావు, స్వతంత్ర ఆర్టు ప్రింటర్సు, విజయవాడ - 4.